Pubilshed from Eluru

PRGI NO : APTEL/25/A1219

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




ఏలూరు ELURU | సంపుటి : 02 Vol.No : 02 | సంచిక : 261 Issue No : 261 | గురువారం Thursday | సెప్టెంబర్ 10, 2026 10 SEPTEMBER 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



# నా సహనాన్ని పరీక్షించారు..

## • నన్నే అరెస్ట్ చేసి జైలుకు పంపారు

- ప్రతీకారం తీర్చుకోవాలంటే నిమిషం చాలు...
- కానీ సహనంతో వ్యవహరిస్తా - నన్ను ఇబ్బంది పెట్టినట్టే... పవన్ కళ్యాణ్‌నూ వేధించారు
- నా అక్రమ అరెస్టును నిరసిస్తూ నాడు చేపట్టిన ప్రజాందోళనలతో బాధ్యత మరింత పెరిగింది
- నాపై చేసిన ఆరోపణలు రుజువు చేయలేకపోయారు... అదే నా నిబద్ధత
- అధికారంలో ఉండగా అరాచకం.... ఓటమి చెందాక కుట్రలు గొడ్డలి పార్టీ విధానం
- అరాచకాలు భరించలేక గొడ్డలి పార్టీ అధ్యక్షుణ్ని తండ్రే దూరం పెట్టారు
- నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలు తీశారు... ఏపీపీఎస్సీలో అక్రమాలతో యువతను మోసం చేశారు
- గొడ్డలి పార్టీ కుట్రలకు ప్రజలే బుద్ధి చెప్పాలి
- పి.గన్నవరం పర్యటనలో గొడ్డలి పార్టీ కుట్రలను ప్రజలకు వివరించిన ముఖ్యమంత్రి

ప్రజాభూమి ప్రతినిధి,పి.గన్నవరం: రాజకీయ కక్షలకు తాను ఎన్నడూ ప్రాధాన్యం ఇవ్వనని... ప్రజల కోసం... రాష్ట్రాభివృద్ధి కోసం సహనంతో.. ఓపిగ్గా ఉండడం తనకు అలవాటని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. విలువలతో కూడిన రాజకీయం, పేద ప్రజలకు మెరుగైన జీవితం, తెలుగుజాతి అభివృద్ధి కోసం తాను నిరంతరం ఆలోచిస్తానని స్పష్టం చేశారు. మీ భూమి-మీ హక్కు కార్యక్రమంలో భాగంగా బుధవారం కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం పండువారిపేటలో నిర్వహించిన సభలో ప్రసంగించారు. దీంట్లో భాగంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి అచ్చెన్నాయుడు కొన్ని కీలకాంశాలను ప్రస్తావించారు. మూడేళ్ల క్రితం సీఎం చంద్రబాబును నాటి ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసిందని... ఆ అక్రమ అరెస్ట్ జరిగి సెప్టెంబర్ 9కి సరిగ్గా మూడేళ్లు అయిందంటూ నాటి సంగతులను ఆవేదనతో ప్రస్తావించారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా నాడు జరిగిన అంశాలను బహిరంగ సభలో గుర్తు చేసుకున్నారు.

నంద్యాలలో సాగునీటి ప్రాజెక్టుల పరిశీలన సమయంలో మూడేళ్ల క్రితం సెప్టెంబరు 9న అర్ధరాత్రి వచ్చి తనను అరెస్టు చేస్తామని చెప్పారని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. ఏ తప్పు చేయకపోయినా అర్ధరాత్రి పూట తనను అరెస్టు చేశారని తెలిపారు. తనపై ఉన్న ఆరోపణలు ఏమిటని ప్రశ్నిస్తే.. అరెస్టు చేసిన తర్వాత చెబుతామని చెప్పారని అన్నారు. ముఖ్యమంత్రిగా పని చేసిన తనను ఉన్నపళంగా అరెస్టు చేసి రాజమహేంద్రవరం జైలుకు తరలించారని పేర్కొన్నారు. తన జీవితంలో ఎన్నడూ ఊహించని ఆ సంఘటన ఓ దుర్మార్గమైన వ్యక్తి ఆలోచనల వల్ల జరిగిందని వ్యాఖ్యానించారు. తాను 48 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, 31 ఏళ్ల క్రితమే తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు

2 - పేజీలో..



# మీకోసమే వస్తున్నా..

## పాలకుడంటే చిత్తశుద్ధి ఉండాలి..

- వచ్చే ఏడాది సెప్టెంబరు లేదా అక్టోబరులో పాదయాత్ర ప్రారంభం
- "స్థానిక ఎన్నికల్లో గట్టిగా నిలబడాలి. పోరాడాలి
- ఎన్నికలు నిజాయితీగా జరిగితే మనదే విజయం
- మాజీ ముఖ్యమంత్రి ,వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి,తాడేపల్లి : చూస్తుండగానే రెండున్నర ఏళ్లు గడిచిపోయాయని, మరో ఏడాది కూడా అలాగే గడిచిపోతుందని, ఆ సమయంలోనే.. అంటే వచ్చే ఏడాది సెప్టెంబరు లేదా అక్టోబరులో తన పాదయాత్ర మొదలవుతుందని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు.


2 పేజీలో..

## గరివిడి వెటర్నరీ కళాశాలపై మాట్లాడే

# నైతిక హక్కు వైసీపీకి లేదు


## ఐదేళ్లు అధికారంలో ఉండి ఒక్క బోధనా పోస్టు కూడా భర్తీ చేయలేదు

- కళాశాలను ఏర్పాటు చేసింది టీడీపీ.. నిర్వీర్యం చేసింది వైసీపీ
- గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో వచ్చిన సమస్యకు కూటమి ప్రభుత్వాన్ని ఎలా నిందిస్తారు?
- ఆరు నెలల్లో 253 బోధనా పోస్టుల భర్తీ.. వీసీఐ అనుమతుల పునరుద్ధరణ
- వైసీపీ నేతలు ముందు తమ ఐదేళ్ల పాలనపై ఆత్మపరిశీలన చేసుకోవాలి: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: గరివిడి వెటర్నరీ కళాశాలకు వీసీఐ అనుమతులు లభించకపోవడంపై వైసీపీ నేతలు మాట్లాడటం చూస్తుంటే... అసలు వారికి ఆ అంశంపై మాట్లాడే నైతిక హక్కు ఎవరు ఇచ్చారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. ఐదేళ్లు అధికారంలో ఉండి కళాశాల అభివృద్ధిని పట్టించుకోని వారు, ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. ఉత్తర కోస్తా ఆంధ్ర ప్రజలకు మెరుగైన పశువైద్య సేవలు అందించడంతో పాటు, ఈ ప్రాంతంలో వెటర్నరీ విద్యను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో 2016లో గరివిడిలో వెటర్నరీ కళాశాలను ఏర్పాటు చేసింది తెలుగుదేశం ప్రభుత్వమే అని అచ్చెన్నాయుడు తెలిపారు.2017 ఏప్రిల్‌లో రూ.81.72 కోట్లతో పరిపాలనా అనుమతులు మంజూరు చేశామని, 2018 ఫిబ్రవరిలో సుమారు 90 ఎకరాల భూమిని కేటాయించి నిర్మాణ పనులు ప్రారంభించామని వివరించారు. కళాశాల అభివృద్ధికి అవసరమైన ఐదేళ్ల సమయం అధికారంలో ఉన్న వైసీపీ ఏం చేసింది? అని మంత్రి నిలదీశారు.

వివరాలు 2లో..



## సీఎం చంద్రబాబు అధ్యక్షతన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు

- జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర సచివాలయంలో రెండు రోజుల పాటు సమావేశం
- జీఎస్డీపీ, సూపర్ 6, తాగునీరు, గృహనిర్మాణం, జలధార, జిల్లాల బెస్ట్ ప్రాక్టీసెస్‌పై మొదటిరోజు చర్చ
- 2వ రోజు ఇ-గవర్నెన్స్, ఫైళ్ల పరిష్కారం, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, కేంద్ర నిధుల వినియోగంతో పాటు పలు అంశాలపై సమీక్ష

- మిగతా 2లో..

## తెలుగు రాష్ట్రాలకు

# రైల్వే శుభవార్త..

## కొత్త లైన్లకు కేంద్రం ఆమోదం

- దేశవ్యాప్తంగా రైల్వే మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం
- ఘట్‌కేసర్-కాజీపేట మధ్య నాలుగో లైన్‌కు గ్రీన్ సిగ్నల్
- అరక్కోణం-రేణిగుంట మధ్య 3వ, 4వ లైన్ల నిర్మాణానికి ఆమోదం
- మూడు ప్రాజెక్టుల కోసం రూ. 10,021 కోట్లు కేటాయింపు
- ఏపీ, తెలంగాణలో రైల్వే సామర్థ్యం పెంచడమే లక్ష్యం

న్యూఢిల్లీ : రైల్వే వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగు రాష్ట్రాల్లోని రద్దీ మార్గాలతో సహా దేశవ్యాప్తంగా పలు మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఈ వివరాలను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం మీడియాకు వెల్లడించారు. కేబినెట్ నిర్ణయం ప్రకారం, తెలంగాణలోని ఘట్‌కేసర్-కాజీపేట సెక్షన్‌లో నాలుగో లైను నిర్మాణానికి ఆమోదం లభించింది. 110 కిలోమీటర్ల ఈ ప్రాజెక్టుకు రూ. 2,419 కోట్లు అవుతుందని అంచనా ఉంది. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ మీదుగా సాగే అరక్కోణం-రేణిగుంట మార్గంలో 3వ, 4వ లైన్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.



ఈ ప్రాజెక్టుల పూర్తితో ఆయా మార్గాల్లో రైళ్ల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి.నాలుగు రాష్ట్రాల్లోని 17 జిల్లాల పరిధిలో నాలుగు లైన్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 10,021 కోట్లుగా కేంద్రం పేర్కొంది. దీంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక పరిధిలో ఐదు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు రాబోతున్నాయి.కొత్త లైన్ల నిర్మాణం ద్వారా రైల్వే నెట్‌వర్క్ సామర్థ్యం పెరగడమే కాకుండా, సరుకు రవాణా, ప్రయాణికుల రైళ్ల వేగం కూడా పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వీటిని 2029-30 నాటికి పూర్తి చేయాలని ప్రణాళిక వేసింది.



ప్రజాభూమి ప్రతినిధి,మంగళగిరి : వచ్చే ఎన్నికల్లో ఎన్డీయేను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని, తెలుగుజాతిని నెం.1గా చేసే బాధ్యత సమిష్టిగా తీసుకుందామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎన్ఆర్ఐ టీడీపీ సెంట్రల్ కమిటీ కార్యవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమానికి మంత్రి లోకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఎన్ఆర్ఐ టీడీపీ సెంట్రల్ కమిటీ సభ్యులతో ఎన్ఆర్ఐ ఎంపవర్ మెంట్ అండ్ రిలేషన్స్ మినిస్టర్ కొండపల్లి శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయించారు.

# ఎన్నారైలే కొండంత అండ

## చంద్రబాబు గారి అక్రమ అరెస్ట్ సమయంలో ఎన్ఆర్ఐలు అండగా నిలిచారు

- ప్రజాప్రభుత్వం అధికారంలోకి రావడంలో ఎన్ఆర్ఐల కృషి మరువలేనిది
- తెలుగుజాతి ఆత్మగౌరవం ఎన్టీఆర్ - తెలుగు జాతిని నెం.1గా చేసే బాధ్యత తీసుకుందాం
- 2029 ఎన్నికల్లో ఎన్డీయేను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉంది
- ఎన్ఆర్ఐ టీడీపీ సెంట్రల్ కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమంలో మంత్రి లోకేష్

గ్లోబల్ ఎన్ఆర్ఐ టీడీపీ అధ్యక్షుడిగా డా.పి.గురురాజా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ప్రపంచంలో తెలుగువారు లేని దేశం లేదు. ఏ దేశానికి వెళ్లినా తెలుగులో మాట్లాడితే కనీసం 20మందైనా స్పందిస్తారు.

2 లో..



## ఉత్తరాంధ్రలో రానున్న మూడు రోజులు

# వర్షాలు

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : ఉత్తర బంగాళాఖాతంలో నేడు అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉండటంతో దాని ప్రభావంతో ఉత్తరాంధ్రలో రానున్న మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) తెలిపింది. పలు జిల్లాల్లో ఉరుములు, పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

- మిగతా 2లో..

## ఏపీలో స్థానిక ఎన్నికల పోలింగ్

# షెడ్యూల్ ఖరారు

## సెప్టెంబర్ 11న ఫొటో సహిత ఓటర్ల జాబితా ప్రదర్శన

- 15వ తేదీన పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా రూపకల్పన
- 19న ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోలింగ్ కేంద్రాల తుది జాబితా రూపకల్పన



ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ దిశగా రాష్ట్ర ఎన్నికల సంఘం వడివడిగా అడుగులు వేస్తోంది. రాబోయే ఎన్నికలకు సంబంధించి ఫొటోలతో కూడిన పూర్తిస్థాయి ఓటర్ల జాబితాలను తక్షణమే సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో ఎటువంటి లోపాలకు తావులేకుండా పక్కాగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

వివరాలు లోపల పేజీలో

## సీఎం చంద్రబాబు అధ్యక్షతన
# 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు

**ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి :** నేడు, రేపు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు జరగనుంది. రాష్ట్ర సచివాలయంలో రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు జిల్లా కలెక్టర్లతో పాటు మంత్రులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, విభాగాధిపతులు పాల్గొననున్నారు. 7వ కలెక్టర్ల సదస్సులో తీసుకున్న నిర్ణయాలపై చేపట్టిన చర్యల నివేదికతోనే మొదటి రోజు సమావేశాలు ప్రారంభమవుతాయి. ఆర్థిక వృద్ధి, సంక్షేమం, మానవాభివృద్ధి, సాంకేతికత, పెట్టుబడులు, శాంతిభద్రతలు లాంటి కీలక విభాగాల వారీగా సమీక్షించనున్నారు. అలాగే ప్రభుత్వ సేవలు, వివిధ పథకాల అమలు వంటి వాటిపై క్షేత్రస్థాయి పరిస్థితులపై ముఖ్యమంత్రి కలెక్టర్లకు దిశా నిర్దేశం చేయనున్నారు.

**రెండు రోజులు..19 అంశాలు :** మొదటి రోజున జీఎస్డీపీ, స్వర్ణాంధ్ర విజన్‌కు జిల్లాస్థాయి రోడ్‌మ్యాప్‌లపై సమీక్షిస్తారు. అదే విధంగా సూపర్ సిక్స్ పథకాలు, తాగునీరు, గృహనిర్మాణం, ఆరోగ్యం, విద్యా రంగంలో పురోగతి, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, జలధార, జిల్లాల బెస్ట్ ప్రాక్టీసెస్ సదస్సులో పలువురు కలెక్టర్లు ప్రదర్శిస్తారు. ఇక రెండో రోజు సదస్సులో ఇ-గవర్నెన్స్, ఫైళ్ల పరిష్కారం, ఆర్టీజీఎస్, ప్రజా సమస్యల పరిష్కార వేదిక, జిల్లాల వారీ ర్యాంకింగ్స్, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగం, నైపుణ్యాభివృద్ధి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమం, శాంతిభద్రతలపై సమీక్షించి... అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేయనున్నారు.

## గరివిడి వెటర్నరీ కళాశాలపై మాట్లాడే
## నైతిక హక్కు వైసీపీకి లేదు

ఐదేళ్లలో ఒక్క బోధనా పోస్టునైనా భర్తీ చేశారా? అవసరమైన ప్రయోగశాల పరికరాలు సమకూర్చారా? వీసీఐ ప్రమాణాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించారా? నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేశారా? కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారా? ఈ ప్రశ్నలకు వైసీపీ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 2024 ఆగస్టు నాటికి పూర్తికావాల్సిన నిర్మాణ పనులు గత ప్రభుత్వ హయాంలో పూర్తి కాలేదని, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు కూడా ముందుకు సాగలేదని తెలిపారు. పెండింగ్ బిల్లులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిష్కరించిందని స్పష్టం చేశారు. గరివిడి వెటర్నరీ కళాశాలలో మౌలిక వసతుల విషయంలో ఎలాంటి ప్రధాన లోపాలు లేవని తాజా వీసీఐ పరిశీలన స్పష్టం చేసిందని అచ్చెన్నాయుడు తెలిపారు. వీసీఐ జూలై 27, 28 తేదీల్లో కళాశాలను తనిఖీ చేసిందని, భవనాలు, ప్రయోగశాలలు, ఇతర మౌలిక వసతులు సంతృప్తికరంగా ఉన్నాయని నివేదికలో పేర్కొన్నట్లు తెలిపారు. ఒక వెటర్నరీ కళాశాలకు వీసీఐ అనుమతులు రావాలంటే ఎలాంటి ప్రమాణాలు పాటించాలో మీకు తెలుసా? ఐదేళ్లలో కళాశాలకు అవసరమైన ల్యాబ్ పరికరాలు సమకూర్చారా? మౌలిక సదుపాయాలు కల్పించారా? అవసరమైన భవనాలు నిర్మించారా? కనీసం ఒక్క బోధనా పోస్టునైనా భర్తీ చేశారా? కేవలం 4 ప్రొఫెసర్లు, 8మంది అసోసియేట్ ప్రొఫెసర్ల కొరత కారణంగానే అనుమతి నిరాకరించబడిందని తెలిపింది. ఇది కూడా వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఏర్పడిన సమస్య కాదా? అని మంత్రి ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవసరమైన ప్రయోగశాల పరికరాలు సమకూర్చడంతో పాటు అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, క్లినికల్ కాంప్లెక్స్, బాలురు, బాలికల వసతిగృహాల నిర్మాణ పనులను పూర్తి చేసిందన్నారు. వీసీఐ ప్రమాణాలకు అనుగుణంగా దాదాపు 99 శాతం మౌలిక వసతుల పనులు పూర్తయ్యాయని తెలిపారు. కళాశాలలో సిబ్బంది కొరతను పూర్తిగా పరిష్కరించేందుకు ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు కలిపి మొత్తం 253 బోధనా పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి పొందామని మంత్రి తెలిపారు. ఇప్పటికే వీసీఐ సూచనల మేరకు కాంట్రాక్ట్ అధ్యాపకులను నియమించి మొత్తం బోధనా సిబ్బంది సంఖ్యను 77కు పెంచామని చెప్పారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల రెగ్యులర్ నియామక ప్రక్రియలో ఆలస్యం జరిగిందని, అయితే ఆరు నెలల్లో నియామక ప్రక్రియను పూర్తి చేసి వీసీఐ అనుమతులను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడటం గత ప్రభుత్వానికి అలవాటుగా మారిందని మంత్రి మండిపడ్డారు. గత పాలనలో వదిలివేసిన సమస్యలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా పరిష్కరిస్తోందన్నారు. తాము చేసిన తప్పులకు కూడా కూటమి ప్రభుత్వాన్ని బాధ్యులను చేస్తే ప్రజలు నమ్ముతారని వైసీపీ నేతలు భావించవద్దని హెచ్చరించారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, ఎవరు ఏం చేశారో ప్రజలకు తెలుసన్నారు. గరివిడి వెటర్నరీ కళాశాలకు వీసీఐ అనుమతుల పునరుద్ధరణ కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అవసరమైన బోధనా సిబ్బంది నియామకాలను పూర్తి చేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని స్పష్టం చేశారు. ఇకనైనా వైసీపీ నేతలు విమర్శలు చేసే ముందు తమ ఐదేళ్ల పాలనను ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని అచ్చెన్నాయుడు సూచించారు.

## ఉత్తరాంధ్రలో రానున్న
## మూడు రోజులు వర్షాలు

గురువారం శ్రీకాకుళం, మన్యం, అల్లూరి, పోలవరం, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. శుక్రవారం ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు కాకినాడ, కోనసీమ జిల్లాల్లో ఉరుములు, పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. మిగతా జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని ఏపీఎస్డీఎంఏ పేర్కొంది. శనివారం విజయనగరం, మన్యం, అల్లూరి, పోలవరం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉరుములు, పిడుగులతో వర్షం కురిసే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఈదురుగాలులు వీచే సమయంలో చెట్ల కింద, భారీ హోర్డింగ్స్ సమీపంలో నిలబడవద్దని హెచ్చరించారు.

## ఏపీలో స్థానిక ఎన్నికల పోలింగ్ షెడ్యూల్ ఖరారు

**ఎన్నికల సంఘం షెడ్యూల్ వివరాలు :**

**సెప్టెంబర్ 11:** ఫొటో సహిత ఓటర్ల జాబితాల ప్రదర్శన

**సెప్టెంబర్ 14:** పోలింగ్ కేంద్రాల ముసాయిదా (ఐత్ఖట్) జాబితా రూపకల్పన

**సెప్టెంబర్ 15:** పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా అధికారిక ప్రచురణ

**సెప్టెంబర్ 15, 16:** పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు, మార్పులు-చేర్పుల వినతుల స్వీకరణ

**సెప్టెంబర్ 16:** రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల కమిషన్ అధికారుల సమన్వయ సమావేశం

**సెప్టెంబర్ 18:** పోలింగ్ స్టేషన్ల జాబితాకు జిల్లా కలెక్టర్ల ఆమోదం

సెప్టెంబర్ 19: ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోలింగ్ కేంద్రాల తుది జాబితా ప్రచురణ.

# మీకోసమే వస్తున్నా...

పర్చూరు నియోజకవర్గం మీదుగా కూడా తన యాత్ర సాగుతుందని ఆయన వెల్లడించారు. బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గానికి చెందిన వైయస్సార్‌సీపీ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, నాయకులు, ముఖ్య కార్యకర్తలతో పార్టీ కేంద్ర కార్యాలయంలో వైయస్ జగన్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలు ప్రస్తావించిన ఆయన, స్థానిక ఎన్నికల్లో బలంగా నిలబడాలని, పోరాడాలని పిలుపునిచ్చారు. ఎన్నికలు నిజాయితీగా జరిగితే విజయం తప్పకుండా వైయస్సార్‌సీపీదే అని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో శ్రీ వైయస్ జగన్ మాట్లాడుతూ "చూస్తుండగానే కళ్లు మూసుకుని తెరిచేసరికి దాదాపు రెండున్నర ఏళ్లు గడిచాయి. ఇప్పుడు సెప్టెంబరు నెలలో ఉన్నాం. మళ్లీ కళ్లు మూసుకుని తెరిచేలోగా ఏడాది గడిచి మళ్లీ సెప్టెంబరు వస్తుంది. వచ్చే ఏడాది సెప్టెంబరు లేదా అక్టోబరులో నా పాదయాత్ర మొదలవుతుంది. పర్చూరు మీదుగా కూడా నా యాత్ర జరుగుతుంది. మన 5 ఏళ్ల పాలన, చంద్రాబాబుగారి రెండున్నర ఏళ్ల పాలనలో ఎంతో తేడా ఉంది. దీనిపైనే ప్రతి ఇంట్లో చర్చ జరుగుతోంది. ఆ ఐదు సంవత్సరాల మన పరిపాలనలో నిజంగా ప్రతి కార్యకర్త కాలర్ ఎగరేసుకుని ఫలానావాడు మా నాయకుడు, ఫలాని పార్టీ మా పార్టీ అని చెప్పి గర్వంగా ఫీల్ అయ్యి చెప్పుకోగలిగే పరిస్థితి. కారణం రాష్ట్ర చరిత్రలో బహుశా ఎప్పుడూ జరగని విధంగా ఒక మ్యానిఫెస్టోకు అర్థం తీసుకొచ్చిన పార్టీ ఏదైనా రాష్ట్ర చరిత్రలో కానీ, దేశ చరిత్రలో కానీ ఉందంటే అది ఒక్క వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని సగర్వంగా చెప్పగలుగుతాము. మన ప్రభుత్వ హయాంలో గవర్నమెంట్ స్కూళ్లు, ప్రైవేటు స్కూళ్లకు పోటీగా మారాయి. ఇంగ్లీష్ మీడియం చదువులు తీసుకురావడం, మూడో తరగతి నుంచి టోఫెల్ పీరియడ్, సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్ అమలు చేయడం, నాడు--నేడు మనబడితో ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలు పూర్తిగా మార్చడం, ఆరో తరగతి నుంచి ప్రతి క్లాస్ రూమ్‌లోనూ డిజిటలైజ్డ్ బోధన తీసుకొచ్చేలా డిజిటలైజ్డ్ క్లాస్ రూమ్స్ చేయడం, గోరుముద్ద అనే పేరుతో పిల్లలు ఏం తింటున్నారో, తినే ఆ తిండి బాగుందా లేదా అని పట్టించుకునే ముఖ్యమంత్రి బహుశా దేశ చరిత్రలో ఎవరైనా ఉంటారో లేదో తెలియదు కానీ జరిగింది ఒక వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే. నష్టాల్లో ఉన్న రైతు. ఎప్పుడూ రైతు బ్రతుకంతా కూడా కష్టమే. పండించిన పంటకు గిట్టుబాటు ధర రాని పరిస్థితి రైతుకు ఉంటుంది అన్న పరిస్థితి నుంచి, రైతును పట్టించుకునే నాథుడు ఉండడు అన్న పరిస్థితి నుంచి, మొట్టమొదటిసారిగా రైతును చెయ్యి పట్టుకొని నడిపించాలని తపన పడిన ప్రభుత్వం ఎప్పుడైనా ఉంది అని అంటే అది ఒక్క వైయస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే. ఇలాంటి పరిస్థితుల మధ్య ఎన్నికలు జరగబోతున్నాయి. అయితే చంద్రబాబునాయుడుగారు ఆ ఎన్నికలు పెడతాడో లేదో తెలియదు. కానీ మేకపోతు గాంభీర్యం మాత్రం ప్రదర్శిస్తున్నాడు. ఎందుకంటే ఆయన నిజంగా స్థానిక ఎన్నికలు పెట్టే వాడే అయితే, బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ఇచ్చే వాడు కాదు. దీనికి సంబంధం నాడు మన హయాంలో ఇచ్చిన జీఓను కోర్టు కొట్టేసింది. అయినా అంతకన్నా ఎక్కువ పదవులు మనం బీసీలకు ఇచ్చాం. ఆ జడ్జిమెంట్ ఇప్పుడు కనిపిస్తోంది. ఆ బీసీ రిజర్వేషన్లు తెలంగాణాలోనూ కొట్టేశారు. అందుకే ఇప్పుడు ఇక్కడ కూడా ఆ అవకాశం ఉందని తెలిసినా, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అంటూ చంద్రబాబు డ్రామా చేస్తున్నాడు. ఎందుకంటే ఈ ఎన్నికలు జరగకూడదు. వాయిదా పడాలన్నదే ఆయన కుట్ర. మరొకటి 'సర్' (ఓటర్ల జాబితాల సమగ్ర సవరణ) వీళ్ళే అంటున్నారు ఇక్కడ 44 లక్షల ఓట్లు లేవు అని. మరి చంద్రబాబునాయుడు ఎన్నికలు పెట్టాలని చూస్తున్నాడా? పెట్టకూడదని చేస్తున్నాడా? ఈ మేకపోతు గాంభీర్యం కాకపోతే ఇదంతా ఏమిటి? సరే, ఏదైనా కానీ, చంద్రబాబుగారు స్థానిక ఎన్నికలు పెడతాడని అనుకుని, ముందుకు పోదాం. అందరికీ నేను ఒకటే చెబుతున్నాను. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉండగా ఎన్నికలు సాఫీగా జరుగుతాయని నేను అనుకోవడం లేదు. చంద్రబాబునాయుడు అనే వ్యక్తి, తనను ప్రశ్నించే వ్యక్తి గొంతు వినడానికి సిద్ధంగా లేని మనిషి. చంద్రబాబునాయుడుని ఎవరు ప్రశ్నించినా వారి మీద అక్రమ కేసులు పెట్టడం, వాళ్ళని పోలీస్ స్టేషన్ చుట్టూ తిప్పడం, నిర్బంధించడం, ప్రలోభాలు పెట్టడం, దిగజారిన రాజకీయాలు చేయడం మనం చూస్తూనే ఉన్నాం. చంద్రబాబునాయుడుగారి హయాంలో మనం చూస్తోంది రోజుకో డ్రామా. రోజుకో నటన. రోజుకో డైవర్షన్. ఇది కాక రెడ్‌బుక్ రాజ్యాంగం. వీటన్నింటి నేపథ్యంలో ఎన్నికలు సాఫీగా జరుగుతాయని అనుకోవడం లేదు. కానీ మీ అందరికీ నేను ఒకటే చెబుతున్నాను. ఎన్నికలు ఎలా జరిగినా ప్రజలకు తోడుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉంటుంది అన్న భరోసా మాత్రం కచ్చితంగా ఇవ్వడం. ఎన్నికలు కనుక సాఫీగా జరిగితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఎక్కడైనా సరే విజయం సాధిస్తారు. ఒకవేళ ఎన్నికలు సాఫీగా జరగకపోయినా, ప్రజలకు తోడుగా పోటీలో గట్టిగా మనం నిలబడదాం. ఇప్పటి ఈ ఎన్నికల కంటే కూడా రేపు పొద్దున జరగబోయే కురుక్షేత్రం ముఖ్యం. ఈ ఎన్నికల్లో చిన్న ప్రాణులను ఓడించడం కోసం చంద్రబాబు చేసిన అధికార దుర్వినియోగం, పోలీసు బలగాల ప్రయోగంపై కసి అన్నది ఆ ఎన్నికల్లో రావాలి. అలాంటి కాసి కార్యకర్తలకు రావాలి. ఆ కార్యకర్తకు పార్టీ అన్ని రకాలుగా తోడుగా అండగా నిలబడుతుంది. ఇది కార్యకర్తల కోసం జరుగుతున్న ఎన్నికలు. మనం కార్యకర్తలకు తోడుగా ఉండాల్సిన ఎన్నికలు. ప్రజలకు తోడుగా కార్యకర్త నిలబడతాడు. కార్యకర్తకు తోడుగా పార్టీ నిలబడుతుంది అన్న సంకేతం ఈ ఎన్నికల ద్వారా మనం ఇవ్వాలి. పాలకుడు అనే వాడు ఎప్పుడైనా కూడా మంచి చేసి ఫలాన మంచి నేను చేశాను కాబట్టి నాకు ఓటు వేయండి అని చెప్పి అడిగే నిబద్ధత, చిత్తశుద్ధి పాలకుడు అనే వాడికి ఉండాలి. అప్పుడే దేవుడు ఆశీర్వదిస్తాడు. ప్రజలు తోడుగా నిలబడతారు. కానీ ఈ మాదిరిగా అబద్ధాలు చెప్పడం, మోసం చేయడం, దౌర్జన్యాలు చేయడం, డైవర్షన్స్ చేస్తూ ఉంటే, దేవుడు కరుణించడు. ప్రజలు హర్షించరని"వైయస్ జగన్ స్పష్టం చేశారు.

## నా సహనాన్ని
# పరీక్షించారు..

చేపట్టానని చంద్రబాబు అన్నారు. విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని, పేద ప్రజలకు, తెలుగు జాతికి న్యాయం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నానని తెలిపారు.

తనపై అనేకమంది ఆరోపణలు చేశారని, కోర్టులకు వెళ్లారని, అయితే తనపై చేసిన ఆరోపణలను రుజువు చేయలేకపోయారని చెప్పారు. అదే తన నిబద్ధతకు నిదర్శనమన్నారు. రాజకీయాలపై కుటుంబం ఆధారపడకూడదనే ఉద్దేశంతో 36 ఏళ్ల క్రితమే కుటుంబ వ్యాపారాన్ని ప్రారంభించామని చంద్రబాబు తెలిపారు. తాను ఆర్థిక మంత్రిగా, ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించిన సమయంలో కుటుంబ వ్యాపారాన్ని తన సతీమణికి అప్పగించానన్నారు. తనకు ధన వ్యామోహం లేదని, తెలుగు జాతి బాగుండాలన్నదే నిరంతరం తన ఆలోచన అని స్పష్టం చేశారు.

**నాటి సంఘీభావాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటా :** జైలులో ఉన్న సమయంలో తనకేం జరుగుతుందోనన్న ఆందోళనతో తెలుగు జాతి మొత్తం రోడ్లపైకి వచ్చిందని ముఖ్యమంత్రి అన్నారు. నేను జైల్లో ఉన్నప్పుడు నాకు సంఘీభావం తెలిపిన వారిని... నా గురించి ఆందోళన చెందిన వారిని జీవితాంతం గుర్తుంచుకుంటానని తెలిపారు. రాజమండ్రి జైల్లో ఉన్న తనను కలిసేందుకు... సంఘీభావం తెలిపేందుకు కొందరు అడ్డుపడినా హైదరాబాద్‌లో టెకీలు సైతం ముందుకు వచ్చి నిరసనలు తెలిపారని సీఎం చంద్రబాబు చెప్పారు. దేశవిదేశాల్లోని తెలుగు వారంతా స్పందించారన్నారు. ఇక నాడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపిన మద్దతును ఎన్నటికీ మరిచిపోలేనన్నారు. తనకు సంఘీభావం తెలిపేందుకు వస్తుంటే ఆయననూ అడ్డుకున్నారని చంద్రబాబు అన్నారు. అయినా ఏమాత్రం వెనక్కి తగ్గకుండా పవన్ కల్యాణ్ తనకు సంఘీభావం తెలిపారని గుర్తుచేశారు. గత పాలకులు పెట్టిన కేసులను కోర్టులు కొట్టేశాయని, ఈడీ వంటి సంస్థలు కూడా ఇందులో ఏమీ లేదని తేల్చాయని ముఖ్యమంత్రి తెలిపారు. గతంలో అచ్చెన్నాయుడు వంటి నేతలను బలవంతంగా అరెస్టు చేసి వేధించారని, పవన్ కల్యాణ్ విశాఖ వెళ్లినప్పుడు ఆయన్ను అక్కడి నుంచి బలవంతంగా వెనక్కి పంపించారని అన్నారు. ఇలాంటి ఘటనలు గత పాలనలో ఎన్నో జరిగాయని సీఎం పేర్కొన్నారు.

**రాజకీయ కక్షలకు దూరంగా....** తాను ముఖ్యమంత్రి అయ్యాక ప్రతీకారం తీర్చుకోవాలంటే ఒక్క నిమిషం చాలని చంద్రబాబు అన్నారు. కానీ తాను ఆ పని చేయలేదని స్పష్టం చేశారు. తాను సహనంగా... ఓపిగ్గా ఉంటానని వెల్లడించారు. గత పాలకులు అంతగా వేధించినా... ఏం చేయలేకపోతున్నానని చాలా మంది అనుకుంటారని.. కానీ అది తన విధానం కాదన్నారు. తెలుగు జాతికి న్యాయం జరగాలన్న లక్ష్యంతోనే పని చేస్తానని.. రాజకీయ కక్షలకు దూరంగా ఉంటానని సీఎం చంద్రబాబు చెప్పారు. తనపై నక్సల్స్ దాడి చేసినా తన సిద్ధాంతాలను... తన లక్ష్యాన్ని మరిచిపోలేదన్నారు సీఎం చంద్రబాబు. ప్రజల కోసం పనిచేయడంలో వెనక్కి తగ్గబోనని స్పష్టం చేశారు. తాను గతంలో నక్సల్స్ సిద్ధాంతాన్ని వ్యతిరేకించానని చంద్రబాబు తెలిపారు. అలిపిరిలో తనపై క్లైమోర్ మైన్లతో దాడి జరిగినా ప్రజల కోసమే పనిచేశానని గుర్తుచేశారు. శాంతిభద్రతల విషయంలో తాను ఎప్పుడూ కఠినంగానే ఉంటానని అన్నారు. ముఠా కక్షల విషయంలో మాట వినని తన పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలను సైతం అరెస్టు చేయించిన చరిత్ర తనదని పేర్కొన్నారు. సీఎంగా తాను సమర్థంగా పనిచేయకపోతే రాష్ట్రానికి నష్టం జరుగుతుందని చంద్రబాబు అన్నారు. అందుకే ప్రతి అంశాన్ని బాధ్యతగా తీసుకుని పనిచేస్తున్నానని తెలిపారు. ప్రజలు ఆనందంగా, ఆరోగ్యంగా, మంచి జీవన ప్రమాణాలతో ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ ఆలోచన అని ముఖ్యమంత్రి చెప్పారు.

**నాడు-నేడు కేరాఫ్ బెంగళూరే :** ఇదే సమయంలో గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జగన్ నైజాన్ని... ఆయన కుటుంబ సభ్యులే చెప్పిన విషయాల ద్వారా అర్థం చేసుకోవాలని చంద్రబాబు వ్యాఖ్యానించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి ఆయన కుమారుడి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తాను అప్పట్లోనే చెప్పానని గుర్తుచేశారు. జగన్‌ను వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చదువుకోవడానికి అమెరికా పంపిస్తే.. తిరుగుటపాలో వచ్చేశాడని స్వయంగా వైఎస్ చెప్పిన విషయాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తన కుమారుడిని ఎప్పుడూ ఏపీకి రానీయలేదని చంద్రబాబు అన్నారు. కొడుకుతో ఇబ్బందులు భరించలేక జగన్‌ను బెంగళూరులోనే ఉంచారని ఆయన తల్లి విజయమ్మ మాజీ ముఖ్యమంత్రి రోశయ్యకు చెప్పుకుని బాధపడ్డారని చంద్రబాబు నాటి సంగతులను గుర్తు చేశారు. తర్వాత కాలంలో ఈ విషయాన్ని రోశయ్య స్వయంగా చెప్పారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి తన కుమారుడిని బెంగళూరు లాంటి చోట ఉంచాల్సిన పరిస్థితి వచ్చిందంటే.. గొడ్డలి పార్టీ అధ్యక్షుడి నైజం ఎలాంటిదో ప్రజలు అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్యను కూడా చంద్రబాబు ప్రస్తావించారు. బాబాయి వివేకాను గొడ్డలి వేటుతో కిరాతకంగా చంపేశారని అన్నారు. తెల్లవారితే ముఖ్యమంత్రిగా ఉన్న తనపై నిందలు వేస్తూ వారి పత్రికలో రాయించారని ఆరోపించారు. తన చెల్లి సునీతను కూడా గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జగన్ ఏమార్చారని వ్యాఖ్యానించారు. ఆ రోజే దోషులందరినీ అరెస్టు చేసి ఉంటే ఇప్పుడు పరిస్థితి ఇంత దూరం వచ్చేదా అని ప్రశ్నించారు. ఇప్పుడు తల్లిని, చెల్లినీ కూడా ఆస్తి కోసం మోసం చేస్తున్నారని చంద్రబాబు ఆరోపించారు. అలాంటి వ్యక్తులతో రాజకీయాలు చేయాల్సిన దుస్థితి రాష్ట్రానికి వచ్చిందని అన్నారు.

**విభజన కంటే 2019--24లోనే ఎక్కువ నష్టం :** 2019--24 మధ్య కాలంలో రాష్ట్ర విభజన కంటే ఎక్కువ నష్టం ఏపీకి జరిగిందని చంద్రబాబు అన్నారు. గత పాలనలో రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని ఒక్కొక్కటిగా సరిచేసుకుంటూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. పోలవరం డయాఫ్రమ్ వాల్‌ను కక్షతో గోదాట్లో కలిపేశారని ఆరోపించారు. రాజకీయ కక్షతో కాంట్రాక్టర్‌ను మార్చకుండా ఉండి ఉంటే 2021కే పోలవరం ప్రాజెక్టు పూర్తై ఉండేదని అన్నారు. ఇప్పుడు ఎల్ నినో లాంటి కరవు పరిస్థితుల్లో పోలవరం పూర్తై ఉంటే ఆ ప్రాజెక్టే ఏపీని ఆదుకుని ఉండేదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 30 ఏళ్ల క్రితం శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టును మళ్లీ తానే ప్రారంభించాల్సి వచ్చిందని అన్నారు. వెలిగొండ నుంచి నీళ్లు వచ్చినప్పుడు ఆ ప్రాంత ప్రజలకు ఎంత ఆనందం కలిగిందో.. తనకూ అంతే ఆనందం కలిగిందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు నీరిచ్చినప్పుడూ ఎంతో సంతోషించానన్నారు. గత పాలనలో బయటకు రావాలన్నా, మాట్లాడాలన్నా ప్రజలు భయపడే పరిస్థితి ఉండేదని సీఎం విమర్శించారు. ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల పేపర్లను ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లతో దిద్దించి అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో నాసిరకం మద్యం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని సర్వనాశనం చేశారని చంద్రబాబు అన్నారు. కల్తీ మద్యం కారణంగా 30 వేల మంది చనిపోయారని, అనేకమంది ఆరోగ్యాలు కోల్పోయారని పేర్కొన్నారు. వైసీపీ ప్రజల జీవితాలతో ఆడుకుందని చంద్రబాబు అన్నారు. అందుకే 2024లో ప్రజలు విజ్ఞతతో ఆలోచించి కూటమికి మద్దతు ఇచ్చారని తెలిపారు. 2024లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన మద్దతు ఢిల్లీలోనూ సంజీవనిలా పనిచేసిందని చంద్రబాబు అన్నారు. రాష్ట్రానికి ఎక్కువ నిధులు తెచ్చుకోగలుగుతున్నామని, పోలవరం, అమరావతి నిర్మాణాలను చేపట్టగలిగామని తెలిపారు. రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి బాటలోకి తీసుకెళ్లేందుకు కేంద్రం సహకారంతో అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని సీఎం చెప్పారు.

**అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించాలి :** ఓవైపు అభివృద్ధి చేస్తుంటే... గొడ్డలి పార్టీ అడుగడుగునా కుట్రపూరితంగా అడ్డంకులు సృష్టిస్తుందని సీఎం చంద్రబాబు వెల్లడించారు. మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తే 350 కేసులు వేసి అడ్డుకునేందుకు ప్రయత్నించారని చంద్రబాబు అన్నారు. ఏడాది తర్వాత ఆ ఉపాధ్యాయుల కుటుంబాల్లో చిచ్చుపెట్టేందుకు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కేసులు వేసినా సరైన ఆధారాలు లేవని కోర్టులు కూడా చీవాట్లు పెట్టాయని తెలిపారు. అసెంబ్లీకి వచ్చి ప్రజల సమస్యలపై చర్చించమంటే అసెంబ్లీకి వచ్చేదే లేదని గొడ్డలి పార్టీ నేతలు మొండికేస్తున్నారని చంద్రబాబు అన్నారు. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు బయటకు వస్తే చాలు.. ఎక్కడికి వెళ్లినా హింసే కనిపిస్తోందని ఆరోపించారు. రప్పా రప్పా అంటూ రౌడీయిజం, ఫ్లెక్సీలకు పొట్టేళ్లను బలి ఇవ్వడం వంటి చర్యలతో రాజకీయ పార్టీగా ప్రజలకు ఎలాంటి సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. సామాజిక మాధ్యమాల్లో తమ కుటుంబాల గురించి అసభ్యంగా రాయిస్తున్నారని సీఎం ఆరోపించారు. ఎన్ని కుట్రలు చేసినా గొడ్డలి పార్టీకి తాము బెదిరేది లేదని, గట్టిగానే పోరాడతామని స్పష్టం చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఇన్ని రకాలుగా ఆలోచించి ప్రజలకు మేలు చేసేలా ప్రయత్నిస్తుంటే ఆ పార్టీ చేస్తున్న కుట్రలపై ప్రజలు ఆలోచించాలని కోరారు. ప్రజలకు ఏ విధంగా మంచి చేయాలన్న అంశంపై రెండు రోజుల పాటు సమావేశాలు నిర్వహించి పార్టీ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశామని తెలిపారు. జిల్లా కలెక్టర్లతోనూ సమావేశాలు నిర్వహించి క్షేత్రస్థాయిలో పౌరసేవలు మెరుగ్గా అందేలా స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న పాలనపై ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించి ఎప్పటికప్పుడు లోపాలను సరిచేసుకుంటున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

# ఎన్నారైలే కొండంత అండ

తెలుగువారి ఆత్మగౌరవం స్వర్గీయ ఎన్టీఆర్. రాజకీయాల్లో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారు. రాజకీయాల్లో చదువుకున్న వారికి, మేధావులకు అవకాశం కల్పించారు. సమాజంలో మార్పు కోసం కృషిచేసిన వ్యక్తి అన్న ఎన్టీఆర్. ఆయన ఆశయాలను చంద్రబాబు గారు ముందుకు తీసుకెళుతున్నారు. 2024 ఎన్నికల్లో తొలిసారిగా 50శాతం స్థానాల్లో యువకులు గెలుపొందారు. ఏడుగురు ఎన్ఆర్ఐలకు కూడా అవకాశం కల్పించిన పార్టీ తెలుగుదేశం పార్టీ. పెమ్మసాని చంద్రశేఖర్ గుంటూరు ఎంపీగా విజయం సాధించి కేంద్ర మంత్రిగా పనిచేస్తున్నారు.

**చంద్రబాబు గారి అరెస్ట్ సమయంలో ఎన్ఆర్ఐలు అండగా నిలిచారు**

2019-24 మధ్య రాష్ట్ర ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడారు. ఆనాడు అమరావతి ఉద్యమానికి ఎన్ఆర్ఐలు మద్దతుగా నిలిచారు. కేసులు పెట్టినా భయపడలేదు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడారు. చంద్రబాబు గారిని అక్రమంగా అరెస్ట్ చేసినప్పుడు 50 దేశాల్లో 200 పట్టణాల్లో ఎన్ఆర్ఐలు కార్యక్రమాలు నిర్వహించారు. నారా బ్రాహ్మణి మనకు రాజకీయాలు అవసరమా అని ప్రశ్నించారు. అలాంటి సమయంలో నిర్వహించిన 'ఐయామ్ విత్ సీబీఎన్' కార్యక్రమం మా కుటుంబానికి కొండంత బలంగా నిలిచింది. మళ్లీ ప్రజలకు సేవ చేయాలని నిర్ణయించుకున్నాం. ఐదు వేల డాలర్లు ఖర్చుపెట్టి ఓటు వేయడానికి రాష్ట్రానికి వచ్చారు. కొన్ని నెలల పాటు ఉద్యోగాలకు సెలవు పెట్టి గ్రామాల్లో తిరిగారు. ప్రజలను చైతన్య పరిచారు. ప్రజాప్రభుత్వ ఏర్పాటులో భాగస్వాములయ్యారు.

**ఎన్ఆర్ఐలు అంటే మోస్ట్ రిలయబుల్ ఇండియన్స్**

ఎన్ఆర్ఐలు అంటే మోస్ట్ రిలయబుల్ ఇండియన్స్. మంచి ఉద్యోగాలు చేస్తున్నా.. నమ్ముకున్న పార్టీ కోసం, తెలుగుజాతి కోసం నిలబడ్డారు. మీ పిల్లలకు అద్భుతమైన తెలుగు నేర్పిస్తున్నారు. తెలుగుతనం ఏనాడూ మర్చిపోలేదు. సొంత గ్రామాలపై మమకారం, సేవాభావం ఎక్కువ. మీరు చదువుకున్న పాఠశాలల అభివృద్ధికి కోట్ల రూపాయలు వెచ్చించారు. అదీ మీ కమిట్ మెంట్. ఇందుకు హృదయపూర్వక నమస్కారాలు తెలియజేస్తున్నా.

**తెలుగుజాతిని నెం.1గా చేసే బాధ్యత తీసుకుందాం**

తెలుగుజాతి గురించి ఆలోచించే పార్టీ తెలుగుదేశం పార్టీ. టీడీపీ అధికారంలో ఉన్నా, లేకపోయినా ఉత్తరాఖండ్ వరదల సమయంలో ప్రత్యేక విమానం పెట్టి తెలుగువారిని రక్షించాం. ఉక్రెయిన్ పై దాడుల సమయంలో తెలుగువారికి అండగా సీబీఎన్ నిలిచారు. గతేడాది సంక్షోభం కారణంగా నేపాల్ లో చిక్కుకుపోయిన తెలుగువారి కోసం ప్రత్యేక విమానం ఏర్పాటుచేసి వారిని సురక్షితంగా ఇళ్లకు తరలించాం. ఎన్ఆర్ఐలు తెలుగుజాతికి బ్రాండ్ అంబాసిడర్లు. తెలుగుజాతిని నెం.1గా చేసే బాధ్యత తీసుకుందాం. ఇందుకు అందరం కలిసికట్టుగా పనిచేద్దాం. మీరు పనిచేసే కంపెనీలు ఏపీకి వచ్చేందుకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలి. దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వస్తున్నాయి. ఏపీ అభివృద్ధిలో ఎన్ఆర్ఐలు భాగస్వామ్యం కావాలి.

**ఎన్ఆర్ఐ సభ్యత్వం తీసుకురావాలి**

ప్రజాప్రభుత్వం అధికారంలోకి రావడానికి మీరు చేసిన కృషి మరువలేనిది. ఎన్ఆర్ఐ సభ్యత్వాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉంది. మీరంతా 'మై టీడీపీ యాప్' తో అనుసంధానం కావాలి. 2019-24 మధ్య అనేక మంది న్యూట్రల్స్ కు ఫోన్ చేసి ఎన్నికల్లో గెలుపునకు కృషిచేశారు. తిరిగి ఆ కార్యక్రమాన్ని ప్రారంభించాలి. డాక్టర్ గురురాజా గారిపై బాధ్యత పెరిగింది. ఏ దేశంలో పది మంది ఉన్నా ఎన్ఆర్ఐ టీడీపీ కమిటీ ఉండాలని కోరుతున్నా. పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమం జయప్రదం చేయాలి. రాబోయే 30 రోజుల్లో ఇప్పుడున్న కమిటీలను పూర్తిచేద్దాం. కష్టపడిన వారికి కమిటీల్లో స్థానం కల్పించాలి.

**2029 ఎన్నికల్లో ఎన్డీయేను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉంది**

చంద్రబాబు గారిని అక్రమంగా అరెస్ట్ చేసి నేటికి మూడేళ్లు. దొంగ కేసు పెట్టి అర్ధరాత్రి అరెస్ట్ చేశారు. రూ.3వేల కోట్ల అవినీతి అన్నారు. తర్వాత మూడొందల కోట్లు, తర్వాత 3 కోట్లు అన్నారు. చివరకు ఒక్క రూపాయి అవినీతిని నిరూపించలేకపోయారు. ఐటీ, ఈడీ, కోర్టు క్లీన్ చిట్ ఇచ్చింది. చంద్రబాబు గారు ఏ తప్పూ చేయలేదు. ఆయన అభివృద్ధి చేసిన జైల్లోనే నిర్బంధించారు. మనమంతా 24 గంటలు పోరాడాం. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ లో తెలుగువారు రోడ్లపైకి వచ్చారు. అదే మా కుటుంబానికి కొండంత బలం. ఈ రోజు రాత్రి ఇళ్లలో, కలిసికట్టుగా 53 రోజుల అక్రమ నిర్బంధానికి గుర్తుగా 53 క్యాండిల్స్ వెలిగిద్దాం. అక్రమ అరెస్ట్ ను జ్ఞాపకం చేసుకుందాం. చంద్రబాబు గారు ఎప్పుడూ తెలుగుజాతి నెం.1గా ఉండాలని ఆలోచించే వ్యక్తి. అలాంటి నాయకుడికి అందరం అండగా నిలవాలి. 2029 ఎన్నికల్లో ఎన్డీయేను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు.

# ప్రజాభూమి

ఎన్టీఆర్, కృష్ణా

గురువారం, సెప్టెంబర్ 10, 2026




# సాగరతీరాన భక్తి వైభవం.. 63 అడుగుల విజయ గణపతి!

## 11 రోజుల పాటు ఆధ్యాత్మిక వేడుకలు.. 630 కిలోల బందరు లడ్డు ప్రత్యేక ఆకర్షణ
## మహాగణపతిని దర్శించుకునేందుకు 10 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం:మంత్రి కొల్లు రవీంద్ర



ప్రజాభూమి ప్రతినిధి,మచిలీపట్నం: మంగినపూడి సాగరతీరంలో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేస్తున్న 63 అడుగుల మట్టి విజయ గణపతి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వ హించి విజయవంతం చేయాలని రాష్ట్ర గనులు, భూగర్భ మైనింగ్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. స్థానిక వేడుక ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఉత్సవాల నిర్వహ ణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సమా వే శంలో ఉత్సవ ఏర్పాట్లు, భక్తులకు కల్పిం చాల్సిన సౌకర్యాలు, భద్రతా చర్యలు తదితర అంశాలపై చర్చించారు.మంగినపూడి సముద్రతీరంలో వినాయక చవితి సందర్భంగా మట్టితో అపురూ పంగా రూపొందిస్తున్న 63 అడు గుల విజయ గణపతిని ఈ నెల 14 నుంచి 11 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో కొలువు దీర్చనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ 11 రోజు ల్లో దాదాపు పది లక్షల మంది భక్తులు విజయ గణపతితో పాటు సమీ పంలోని ఉప ఆలయాలను దర్శించుకునే అవకా శం ఉంద న్నారు. మచిలీపట్నం నగరానికి ప్రత్యే క వన్నె తెచ్చేలా ఉత్సవాలను అత్యద్భుతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొ న్నారు.

**విజయ గణపతి చేతిలో 630 కిలోల బందరు లడ్డు:**మచిలీపట్నం పేరును దేశవ్యాప్తంగా చాటిచెప్పిన ప్రసిద్ధ బందరు లడ్డుకు మరో అరుదైన గౌరవం దక్కనుందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. 63 అడుగుల విజయ గణపతి చేతిలో ఏకంగా 630 కిలోల భారీ బందరు లడ్డును ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. లడ్డు తయారీకి బందరు ఎంతో ప్రసిద్ధి చెందిందని అందువల్ల బందరులోనే లడ్డును తయారు చేయడం జరుగుతుందని అన్నారు. ఆ బాధ్యత మల్లయ్య స్వీట్స్ అధినేత గౌర వెంకటేశ్వరరావు తీసుకున్నారన్నారు. మచిలీపట్నం బందరు లడ్డుకు ఉన్న చారిత్రక, ప్రత్యేక గుర్తింపును ప్రతిబింబించేలా ఈ భారీ లడ్డును మల్లయ్య స్వీట్స్ అధినేత గౌర వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తయారు చేసి గణపతి చేతిలో ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 63 అడుగుల విజయ గణపతి–630 కిలోల బందరు లడ్డు కలయిక మంగినపూడి సాగరతీర మహాగణపతి ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. భారీ లడ్డును దర్శించుకునేందుకు భక్తులు, నగర ప్రజలు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందన్నారు.ఉత్సవ కమిటీ అధ్యక్షులు చలమలశెట్టి నరసింహారావు మాట్లాడుతూ బందరు లడ్డు రుచి, నాణ్యత, ప్రత్యేకతకు ఎంతోకాలంగా ప్రసిద్ధి చెందిందన్నారు. ఇప్పుడు 630 కిలోల భారీ లడ్డును గణపతి చేతిలో ఏర్పాటు చేయడం ద్వారా బందరు లడ్డుకు మరింత ప్రత్యేక గుర్తింపు లభించనుందని తెలిపారు. ఉత్సవ కమిటీ చక్కని ఏర్పాట్లు చేస్తోందన్నారు. బందరు వైభవాన్ని పునఃప్రతిష్టించేలాగా రాజకీయాలకు, కుల మతాలకు అతీతంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు.విష్ణుభట్ల సూర్యనారాయణ శర్మ మాట్లాడుతూ సాగరతీర మహాగణపతి ఉత్సవాల్లో 630 కిలోల బందరు లడ్డు భక్తులకు ప్రత్యేక దర్శనంగా నిలవనుందని అన్నారు. భక్తుల కు ఆధ్యాత్మిక ఆనందంతో పాటు మచిలీపట్నం ప్రత్యేకతను చాటిచెప్పేలా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వినాయకుని సన్నిధిలో భక్తి పరిమ ళాలు వెదజల్లేలా, సాగర అలల సాక్షిగా ఆధ్యా త్మిక వాతా వరణం వెల్లివిరియనుంది. గణనాథుని దర్శనంతో భక్తుల హృదయాల్లో భక్తి భావం మరింత పెంపొందనుంది. విఘ్నేశ్వరుని కృపతో మచిలీపట్నం ప్రజలకు సుఖశాంతులు, సిరిసంపదలు చేకూరాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. సాగరతీర మహాగణపతి ఉత్సవాలు నగర ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలవనున్నాయి.ఉత్సవ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ 63 అడుగుల విజయ గణపతి కి 630 కిలోల బందరు లడ్డు అనే అరుదైన కలయిక మంగిన పూడి సాగరతీర గణపతి ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని పేర్కొన్నారు. అనంత రం మల్లయ్య స్వీట్స్ అధినేత గౌర వెంకటేశ్వరరావును శాలు వాతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మద్దుల గిరీష్, బులియన్ జ్యువెలరీ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఉడత్తు కిషోర్, నగర ప్రముఖులు, విద్య, డీఆర్డీఏ, రెవెన్యూ, పోలీస్ శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రియుడి ఇంట్లో వివాహిత మృతి.. హత్య ఆరోపణలతో పోలీసులకు ఫిర్యాదు



ప్రజా భూమి ప్రతినిధి అవనిగడ్డ వివాహిత మృతి ఘటన కలకలం రేపింది. కోడూరు మండలం మందపాకల గ్రామానికి చెందిన బెల్లంకొండ నాగరమ్య (33) అద్దంకి నాగరాజు నివాసం వద్ద ఉరివేసుకున్న స్థితిలో మృతి చెందినట్లు సమాచారం.మృతురాలికి ముగ్గురు పిల్లలు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నాగరమ్య మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న ఆమె భర్త బెల్లంకొండ నాగ మల్లేశ్వరరావు, తన భార్య మృతికి అద్దంకి నాగరాజే కారణమని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవనిగడ్డ ఏరియా ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ కె. చాణిక్య తెలిపారు. పోస్టుమార్టం నివేదిక, దర్యాప్తులో వెలువడే వివరాల ఆధారంగా మృతికి గల అసలు కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు.

## చల్లపల్లి సీయోను వృద్ధాశ్రమంలో అన్నదానం



ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు కుమారుడు శరత్ చంద్ర పుట్టిన రోజుని పురస్కరించుకుని బుధవారం చల్లపల్లి సీయోను వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



ఈ సందర్భంగా శరత్ చంద్ర పుట్టినరోజు కేక్‌ను కట్ చేసి, వృద్ధాశ్రమంలోని వృద్ధుల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వృద్ధులకు అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో కొల్లూరి వెంకటేశ్వరరావు దంపతులతో పాటు చల్లపల్లి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## దానయ్య కుటుంబానికి గ్లోబల్ ఎన్ఆర్ఐ టీడీపీ ఫోరం ఆర్థిక సహాయం

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి:

పలాసలో జరిగిన విషాదకర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దుబ్బ దానయ్య కుటుంబానికి గ్లోబల్ ఎన్ఆర్ఐ టీడీపీ ఫోరం అండగా నిలిచింది. దానయ్య కుటుంబాన్ని ఆదుకునేందుకు గ్లోబల్ ఎన్ఆర్ఐ టీడీపీ ఫోరం ప్రతినిధులు సురేష్ పుట్టగుంట, ఫర్హాద్ షాల సహకారంతో రూ.1,50,000 ఆర్థిక సహాయాన్ని బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో అందజేశారు. ఇటీవల పలాసలో మాజీ మంత్రి అప్పలరాజు కుమారుడు చేసిన బైక్ ప్రమాదంలో దుబ్బ దానయ్య మృతి చెందిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంలో దానయ్య మృతి చెందడం ఎంతో విషాదకరమని, ఈ ఘటనతో కుటుంబ పెద్దను కోల్పోయిన దానయ్య కుటుంబానికి ఆర్థికంగా, మానసికంగా అండగా నిలవాల్సిన అవసరం ఉందని ఫోరం ప్రతినిధులు సురేష్ పుట్టగుంట, ఫర్హాద్ షాలు అన్నారు. ఈ నేపథ్యంలో తమ వంతు బాధ్యతగా ఈ సహాయాన్ని అందిస్తున్నామని వారు పేర్కొన్నారు.

**ప్రమాణ స్వీకారం చేసిన రోజే సేవా కార్యక్రమానికి శ్రీకారం**

గ్లోబల్ ఎన్ఆర్ఐ టీడీపీ ఫోరం ప్రతినిధులు ప్రమాణ స్వీకారం చేసిన రోజునే దానయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడం విశేషం. ప్రజా సేవ, సామాజిక బాధ్యతే లక్ష్యంగా ముందుకు సాగుతామని ప్రతినిధులు స్పష్టం చేశారు. సమాజంలో ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం, అవసరమైన వారికి చేయూత అందించడం కోసం గ్లోబల్ ఎన్ఆర్ఐ టీడీపీ ఫోరం భవిష్యత్తులోనూ తన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తుందన్నారు. దానయ్య కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా గ్లోబల్ ఎన్ఆర్ఐ టీడీపీ ఫోరం ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎమ్మెల్యే గౌతు శిరీష, టీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షురాలు గుడిసే కృష్ణమ్మ, ఫోరం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# స్కిల్ మంథన్ వేదికపై మన రైజ్..!




- గ్రామీణ మహిళా సాధికారతలో వినూత్న చొరవకు గుర్తింపు
- జాతీయస్థాయి గౌరవం సమష్టి కృషికి దక్కిన ఫలితం
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ: గ్రామీణ మహిళలకు స్థిరమైన జీవనోపాధి అవకాశాలు కల్పిస్తూ, వారిని నైపుణ్యవంతులుగా తీర్చిదిద్ది స్వయం ఉపాధి, పారిశ్రామిక రంగాల వైపు ప్రోత్సహించేందుకు జిల్లాలో అమలుచేస్తున్న రూరల్ ఇంక్యుబేషన్, స్కిల్లింగ్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ (రైజ్) కార్యక్రమానికి జాతీయస్థాయిలో గుర్తింపు లభించడం సంతోషకరమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఈ గుర్తింపు జిల్లా యంత్రాంగం, స్వయం సహాయక సంఘాల మహిళలు, భాగస్వామ్య సంస్థల సమష్టి కృషికి దక్కిన ఫలితమని పేర్కొన్నారు. విజయవాడలోని జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ బుధవారం అధికారులతో కలిసి కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కిల్ మంథన్ వెబినార్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

మహిళలకు స్థిరమైన జీవ నో పాధి అవకాశాలు కల్పించడం, నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, మహిళలను స్వయం ఉపాధి, పారిశ్రామిక రంగాల వైపు ప్రోత్స హించడం లక్ష్యంగా ఈ వెబినార్‌ను నిర్వహిం చారు. నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, వ్యవస్థాపకత రంగాల్లో జిల్లాల స్థాయిలో అమలవుతున్న వినూత్న కార్యక్రమాలు, ఉత్తమ విధానాలను జాతీయ స్థాయిలో పరస్పరం పంచుకునేందుకు 'స్కిల్ మంథన్'ను వేదికగా రూపొందించారు. ఈ వెబినార్‌ను మహిళలకు స్థిరమైన జీవనోపాధి నిర్మాణం అనే అంశంపై నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో మహిళల జీవనోపాధి, నైపుణ్యాభివృద్ధి కోసం అమలుచేస్తున్న వినూత్న కార్యక్రమాలను ప్రదర్శించారు. అందులో ఎన్టీఆర్ జిల్లాకు చెందిన రైజ్ కార్యక్రమాన్ని కూడా ప్రముఖంగా ప్రస్తావించారు. వెబినార్ అనంతరం కలెక్టర్ లక్ష్మీ శ మాట్లాడుతూ ముఖ్యమంత్రి, ఉప ముఖ్య మంత్రి దార్శనికతకు అనుగుణంగా ఒక కుటుంబం – ఒక పారిశ్రామికవేత్త ఆలోచనకు అను గు ణంగా మహిళలను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్ది, వారి సామర్థ్యాలను ఆదాయ వనరులుగా మలచే దిశగా గుంటుపల్లిలోని రైజ్ కేంద్రం పనిచేస్తోందన్నారు.

నీతి ఆయోగ్, సెర్ప్ తదితర శాఖల సహకారంతో విజయవంతంగా మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిం చేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రైజ్ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా అమలు చేస్తూ, ఎన్టీఆర్ జిల్లాను మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు.సమావేశంలో డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఏఎన్వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.



## సర్వీస్ ఇనాం భూములపై బేషరతుగా నిషేధం ఎత్తివేయాలి

### రాష్ట్ర రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ధరణికోట వెంకటరమణ డిమాండ్ చెవిలో పువ్వులతో ఈనామ్ భూ భాదితుల నిరసన



జగ్గయ్యపేట, ప్రజాభూమి

రాష్ట్ర ప్రభుత్వం సర్వీస్ ఇనాం భూములపై విధించిన నిషేధాన్ని బేషరతుగా ఎత్తివేయాలని రాష్ట్ర రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు, విద్యావేత్త, ప్రముఖ జియాలజిస్ట్ ధరణికోట వెంకట రమణ డిమాండ్ చేశారు. పదేళ్లుగా ఇనాం బాధితులు ప్రభుత్వ నిర్ణయంలో జాప్యం కారణంగా పడుతున్న మానసిక వేదనకు పరిహారం కూడా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం జగ్గయ్యపేట ఎన్టీఆర్ సర్కిల్లో ఇనాం భూ బాధితుల సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న మూడో రోజు రిలే నిరాహార దీక్షలను ధరణికోట జగ్గయ్యపేట రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ధారా వినోద్ బాబు, సెక్రటరీ మరియదాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రభుత్వం చేసిన తప్పిదానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించి భూముల నిషేధంపై ఎత్తివేయాలని డిమాండ్ చూశారు. పదేళ్లుగా బాధితులు ప్రభుత్వాలు చుట్టూ తిరుగుతున్న స్పందించకపోవడంతో రోడ్డు పైకి వచ్చి ఆందోళన చేయాల్సిన దీనస్థితికి రావటం దారుణ మని, ప్రజాస్వామ్యంలో ఈ తరహా పాలనకు చోటు లేదని చెప్పారు. జగ్గయ్యపేటలోని 900 రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాల మద్దతు ఉంటుందని వారు చెప్పారు.

**చెవిలో పువ్వుతో నిరసన**

పదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వాలు తమ సమస్యను పరిష్కరిస్తాయని నమ్మామని వారు మాత్రం తమ చెవులో పూలు పెట్టి మభ్యపెట్టి కాలహరణం చేశారని ఇనాం భూభాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు . చెవిలో పువ్వులు పెట్టుకొని వినూత్నంగా నిరసన తెలిపారు. ప్రభుత్వానికి ఆర్థికంగా ఎలాంటి నష్టం లేకున్నా కోటి మంది బాధితుల సమస్యను పరిష్కరించేందుకు మనసు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.కార్యక్రమంలో రాష్ట్ర సర్వీస్ ఇనాంబు బాధితుల సంఘం ప్రతినిధులు ఎలవర్తి అచ్యుతురామయ్య, గద్దె సుధీర్, కాకరపర్తి వెంకట రమేష్, కుక్కడపు ప్రసాద్, నూకల బాలకృష్ణ, కళ్యాణం మురళి, యలవర్తి శరత్, రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ బి వి సత్యనారాయణ, సెక్రటరీ శ్రీకాంత్, ఉపాధ్యక్షులు జీవరత్నం, సభ్యులు దానయ్య, భాగ్యరాజా, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలం

### రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి ప్రభుత్వానికి గుణపాఠం ఖాయం గడపగడపకు ప్రజా పోరు బాటలో తన్నీరు నాగేశ్వరరావు



జగ్గయ్యపేట, ప్రజాభూమి

ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు అన్నారు.జగ్గయ్యపేట పట్టణంలోని 22వ వార్డు నాగమయ్య బజార్‌లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకు ప్రజా పోరుబాట కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పాల్గొన్నారు. వార్డులోని ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయ కుండా సాకులు చెబుతూ కాలయాపన చేస్తోందని విమర్శించారు.

కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధా నాలు, అరాచకాలను ప్రజలకు వివరిస్తూ వైఎస్ఆర్ సీపీ ఆధ్వర్యంలో ప్రజా పోరుబాట కొనసాగిస్తున్నామని తెలిపారు.22వ వార్డు నాగమయ్య బజార్‌లో తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారని ఆయన తెలిపారు. బ్రాహ్మణ బజార్ నుంచి నాగమయ్య బజార్ వరకు సుమా రు 130 మీటర్ల పైపులైన్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత ప్రజల తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందని పేర్కొన్నారు. ఇంత చిన్న సమస్యను కూడా పరిష్కరించకుండా మున్సిపల్ అధికా రులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు.అదేవిధంగా వార్డులో ట్రాన్స్‌ఫార్మర్ కింద స్థాయిలో ఉండటం వల్ల ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు త మ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ప్రజల భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని ట్రాన్స్ ఫార్మర్‌ను తగిన ఎత్తులో ఏర్పాటు చేయడానికి విద్యుత్ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన మున్సిపల్, విద్యుత్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రజల కనీస అవసరాలైన తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల విషయంలో ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం చేయడం తగదన్నారు.ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుందని స్పష్టం చేశారు ప్రజా సమస్యలను పరిష్కరించకపోతే అధికారుల తీరుపై ప్రజలతో కలిసి మరింత బలమైన పోరాటాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు పటాన్ ఫిరోజ్ ఖాన్, జిల్లా కార్యదర్శి షేక్ జుబేర్ , మాజీ వార్డు కౌన్సిలర్ నీలం నరసింహారావు, చావా పిచ్చయ్య, వైఎస్ఆర్ సీపీ నాయకులు కార్యకర్తలు వార్డు నాయకులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

ఏలూరు, పశ్చిమగోదావరి **4**

గురువారం 10 సెప్టెంబరు 2026


## జాతీయ వాటర్ పోలో పోటీలకు ఏలూరు విద్యార్థి ఎంపిక

**ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు**



ఏలూరులోని శ్రీ శర్వాణి జు.వీ. హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్న షేక్ హకీమ్ 52వ జూని యర్ నేషనల్ ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్-2026లో నిర్వహిం చనున్న వాటర్ పోలో పోటీలకు ఎంపికయ్యాడు.ఈ జాతీయ స్థాయి పోటీలు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో సెప్టెంబర్ 6వ తేదీ నుంచి 13వ తేదీ వరకు నిర్వహిం చనున్నారు.వివిధ రాష్ట్రాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకా రులు ఈ పోటీల్లో పాల్గొననున్నారు.ఈ ప్రతిష్టాత్మక పోటీలకు షేక్ హకీమ్ ఎంపిక కావడం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు,తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సం దర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్ రావు షేక్ హకీమ్‌ను అభినందిస్తూ,జాతీయ స్థాయి పోటీ ల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, ఏలూరుకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు.ఉపాధ్యాయులు కూడా హకీమ్‌ను అభినందించి, పోటీల్లో విజయం సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు.

## సిపిఐ ఆధ్వర్యంలో ధరల పెరుగుదలపై ఆందోళన

**పెంచిన నిత్యావసర ధరలను తగ్గించాలి**

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్**



**ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు**

పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో ఏలూరు అర్బన్ మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు.అనంతరం తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.పెట్రోల్, డీజిల్, గ్యాస్‌తో పాటు నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో సామాన్య ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందన్నారు.16 రకాల నిత్యావసర వస్తువులను రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీపై అందించాలని కోరారు.ధరలను తగ్గించకపోతే భవిష్యత్తులో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.సిపిఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అధిక ధరల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజలకు ఉపాధి కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు,ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్,సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్ పాల్గొన్నారు.

## పంట నమోదు చేసుకోండి.. రైతు విశిష్ట సంఖ్య పొందండి



**ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**

ఈదర గ్రామంలో బుధవారం మండల వ్యవసాయ అధికారిణి జె. భవాని ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భవాని మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ నెల 15వ తేదీతో పంట నమోదు గడువు ముగియనున్నందున రైతులు వెంటనే తమ రైతు సేవా కేంద్రాలను సంప్రదించి నమోదు చేసుకోవాలని కోరారు. వరి పంటలో నీటి యాజమాన్యంపై వివరిస్తూ దుబ్బు చేయడం పూర్తయ్యే వరకు పొలంలో 2 నుంచి 3 సెంటీమీటర్ల మేర పలుచగా నీరు ఉంచాలని, అధికంగా నీరు ఉంటే పైరు బాగా దుబ్బు చేయదని తెలిపారు. చిరుపొట్ట దశ నుంచి గింజ గట్టిపడే వరకు 5 సెంటీమీటర్ల లోతు వరకు నీరు ఉంచి, కోతకు పది రోజుల ముందు నుంచి నీటిని క్రమంగా తగ్గించి పొలాన్ని ఆరబెట్టాలని సూచించారు. రైతులందరూ తప్పనిసరిగా రైతు విశిష్ట సంఖ్య పొందాలని, అది లేకపోతే ధాన్యం విక్రయ సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా అందే వివిధ ప్రయోజనాలు పొందేందుకు కూడా రైతు విశిష్ట సంఖ్య అవసరమని భవాని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు రక్షిత, విక్టర్ శామ్ పాల్, రైతులు పాల్గొన్నారు.

## రెండో విడత 17 గ్రామాలలో దోమ తెరలు పంపిణీ

- జిల్లా కలెక్టర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆదేశాల అనుసారం..
- మూడో విడతలో మిగతా గ్రామాలకు పంపిణీ..

**ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం**

మండలంలోని ఈ క్రింది తెలిపిన గ్రామాల్లో దోమ తెరలు పంపిణీ కార్యక్రమం జరుగును కలెక్టర్ పోలవరం,జిల్లా,,ప్రాజెక్టు ఆఫీసర్ చింతూరు వారి, ఆదేశాల ప్రకారం జిల్లా మలేరియా అధికారి మరియు డిప్యూటీ డి ఎం హెచ్‌ఓ ఆధ్వర్యంలో కూనవరం మండల కమిటీ సభ్యుల సమక్షంలో దోమ తెరల పంపిణీ కార్యక్రమం జరుగును ముఖ్యంగా మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో మొదటి విడత దోమ తెరలు పంపిణీ కార్యక్రమం పూర్తయింది ఇప్పుడు రెండో విడత లో భాగంగా ఈ కింది గ్రామాల్లో రేపటినుండి దోమల ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, డెంగీ నివారణ చర్యలలో భాగంగా క్రిమి సంహిత దోమ తెరల పంపిణీ కార్యక్రమం స్థానిక పెద్దలు మాజీ సర్పంచ్, ఎంపీపీ జడ్పిటిసి ఎంపీటీసీ వారి సహకారంతో జరుగును. దోమ తెరలు పంపిణీ కార్యక్రమం మండల కమిటీ ( ఎంపిడీఓ - చైర్మన్, ఎంపీపీ,జడ్పీటీసీ, హానరబుల్ మెంబర్స్, మెడికల్ ఆఫీసర్, నోడల్ ఆఫీసర్,ఎస్ యు ఓ మలేరియా ఆర్గనైజర్, ఈ ఓ పి ఆర్ డి, సీడీపీఓ, ఎం ఎం ఎస్ మెంబర్స్) ఆధ్వర్యంలో జరుగును. 10.9.26.న కరకగూడెం,ఆర్కూరు కోడేరు,కోతులగుట్ట 11.9.26 న కూల్లపాడు, పోలిపాక, తాళ్ల గూడెం, రాయి గూడెం,, 12.9.26 న బోజ్రాయి గూడెం, రేపాక కాలనీ ,15.09.26 న పైడిగూడెం, ముల్లూరు, శబరి కొత్తగూడెం, 17.09.26. గొమ్ముగూడెం, 18.09.26 దూగుట్ట, కరకగూడెం, కోళ్లపాడు, మొదలగు గ్రామాల్లో దోమతెరలు పంపిణీ కార్యక్రమం జరుగును కావున గ్రామ పెద్దలు మండల స్థాయి కమిటీ సభ్యులు ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరుచున్నాము.

# బెదిరింపులు కాదు.. దెందులూరు అభివృద్ధిపై లెక్కలతో చర్చకు రండి

### మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి

**ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు**

ప్రతిపక్షం ధర్నా చేస్తే "మక్కెలు విరగ్గొడతాం" అంటూ బెదిరించడం ప్రజాస్వామ్య పద్ధతి కాదని దెందులూరు నియోజకవర్గ వైసీపీ ఇన్ చార్జ్, మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు.బుధవారం దెందులూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్‌మీట్ లో ఆయన మాట్లాడారు.చింతమనేని ప్రభాకర్ బెదిరింపులకు తాను, వైఎస్సార్‌సీపీ శ్రేణులు భయపడబోమని స్పష్టం చేశారు. మక్కెలు విరగ్గొడతామనే మాటలు కాకుండా దెందులూరు నియోజకవర్గ అభివృద్ధిపై లెక్కలతో బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు.తమ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలోని సుమారు 150 ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరిచామని, డిజిటల్ స్క్రీన్లు, తాగునీరు, విద్యా సామగ్రి,ట్యాబ్‌లు వంటి సౌకర్యాలు కల్పించామని తెలిపారు.మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఉన్న చింతమనేని నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిపై లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు.తాము నిర్మించిన పెదపాడు సచివాలయ భవనాన్ని ప్రస్తుతం పోలీస్ స్టేషన్‌గా ఉపయోగించడంపై కూడా ఆయన ప్రశ్నలు సంధించారు.

**డీఎస్సీ నియామకాలపై స్వతంత్ర దర్యాప్తు చేయాలి**

డీఎస్సీ నియామకాల్లో స్పోర్ట్స్ కోటా సర్టిఫికెట్లు, మెరిట్ జాబితా,సర్టిఫికెట్ వెరిఫికేషన్,



పోస్టుల కేటాయింపు తదితర అంశాలపై ఆరోపణలు వస్తున్నాయని అబ్బయ్య చౌదరి పేర్కొన్నారు.న్యాయంగా మెరిట్‌తో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదని, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు.అక్రమాలు లేవని ప్రభుత్వం చెబుతున్నట్లయితే స్వతంత్ర దర్యాప్తుకు ఎందుకు వెనుకాడుతోందని ప్రశ్నించారు.విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ ఆరోపణలపై ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.2019లో రాజకీయ సన్యాసం అంటూ చేసిన చింతమనేని వ్యాఖ్యలను గుర్తుచేస్తూ,ఇప్పుడు మళ్లీ రాజీనామా సవాళ్లు చేయడం ఎందుకని ప్రశ్నించారు.రాజీనామా డైలాగులు,బెదిరింపులు పక్కనపెట్టి ప్రజల ముందుకు వచ్చి దెందులూరు అభివృద్ధి, డీఎస్సీ అంశాలపై ఆధారాలతో సమాధానం చెప్పాలని అబ్బయ్య చౌదరి అన్నారు.ప్రజల కోసం, నిరుద్యోగుల న్యాయం కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## పదవీకాలం ముగుస్తున్న ఎంపీటీసీలు, ఎంపీపీకి ఘన సన్మానం

**ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు**



మండల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి రివ్యూ సమావేశం సందర్భంగా ఎంపీటీసీలు, ఎంపీపీ పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ నెల 23వ తేదీతో ప్రస్తుత ఎంపీటీసీలు,ఎంపీపీ పదవీకాలం పూర్తవుతున్న సందర్భంగా వారికి ఘనంగా వీడ్కోలు సన్మానం నిర్వహించారు.మండల పరిధిలోని ఎంపీటీసీలతో పాటు ఎంపీడీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందిని ఎంపీపీ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ మండల అభివృద్ధికి కృషి చేసిన ఎంపీటీసీలు, ఎంపీపీలు,అధికారులు, సిబ్బంది సేవలను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు.అలాగే ఏలూరు మండలం మాదేపల్లి గ్రామ ఎంపీటీసీ నరహరిశెట్టి నాగమణి, మాదేపల్లి వైస్ ప్రెసిడెంట్ నరహరిశెట్టి రాధాకృష్ణ కుటుంబ సభ్యులను కూడా ఎంపీపీ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వారికి శాలువాలు కప్పి సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి,ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఎంపీటీసీలు, ఎంపీపీలు కీలక పాత్ర పోషించారని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాసరాజు,ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, ఎంపీడీవో కార్యాలయ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదివాసీల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి

**ఎఎస్‌పిరాష్ట్ర అధ్యక్షుడు కాకి మధు.**

**ప్రజా భూమి ప్రతినిధి-బుట్టాయగూడెం**



రెడ్డిగూడెం ఆదివాసీల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, జాతీయ ఎస్టి కమిషన్ ఇచ్చిన ఆదేశాలను అధికారులు నిర్లక్ష్యం చేయడం తగదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు కాకి మధు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని కన్నాపురం అటవీ శాఖ అధికారి కార్యాలయం ఎదుట బుధవారం ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీలతో ధర్నా నిర్వహించారు ఈ ధర్నా కార్యక్రమాన్ని ఉదేశించి మధు మాట్లాడుతూ ఆదివాసీలు పూర్వికుల నుండి ఎండ,వానలను లెక్క చెయ్యకుండా కష్టపడి జీవనభృతి కొరకు పోడు కొట్టి పోడు భూమిని సాగు చేస్తున్నారని అన్నారు. గిరిజనేతరులకు తొత్తులుగా వ్యవహరించే కొంతమంది అధికారులు ఆదివాసీల కష్టార్జితమైన పోడు భూములను గిరిజనేతరులకు కట్టబెట్టాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసీలను భూముల నుండి బలవంతంగా బయటకు పంపడానికి ప్రయత్నించడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం కొరకు జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్‌ని ఆశ్రయించగా, ఆ భూములను ఆదివాసీలకు అప్పగించాలని ఇచ్చిన ఆదేశాలను అమలు చెయ్యడంలో సంబంధిత అధికారులు విఫలమయారని ఆరోపించారు. సమస్య లతో కూడిన వినతి పత్రాన్ని అటవీ శాఖ రేంజ్ అధికారికి అందించారు. తక్షణమే రెడ్డి గూడెం ఆదివాసీల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని లేనిపక్షంలో అధికారులపై న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుంజా కృష్ణంరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు సోదేం ముక్కయ్య, మండల కార్యదర్శి పొడియం కోవడయ్య డివిజన్ కార్యదర్శి మండల సభ్యులు లచ్చిరెడ్డి, దుర్గారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీలో మద్యం దుకాణాల లైసెన్సుల రెన్యువల్ ఉపసంహరించుకోవాలి

**హైకోర్టును ఆశ్రయిస్తాం గిరిజన సంఘం మండల కార్యదర్శి తెల్లం తమ్మయ్య..**




**ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం**

మండలంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో మద్యం దుకాణాల పాత లైసెన్సులను రెన్యువల్ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి తెల్లం తమ్మయ్య డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాలకు వర్తించే రాజ్యాంగపరమైన రక్షణలు, గిరిజన హక్కులకు విరుద్ధంగా మద్యం దుకాణాల లైసెన్సులను రెన్యువల్ చేయడం సరికాదన్నారు.భారత రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ ప్రకారం ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల హక్కులు, ప్రయోజనాలకు ప్రత్యేక రక్షణలు ఉన్నాయని తెలిపారు. గ్రామసభల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా మద్యం దుకాణాల లైసెన్సులను ఏకపక్షంగా రెన్యువల్ చేయడం గిరిజనుల హక్కులను విస్మరించడమేనన్నారు.1/70 చట్టం స్ఫూర్తికి విరుద్ధంగా గిరిజన ప్రాంతాల్లో గిరిజనేతరులు, బినామీలకు మద్యం దుకాణాల నిర్వహణకు అవకాశం కల్పించడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. మద్యం విక్రయాల నియంత్రణ, దుకాణాలకు అనుమతులు వంటి అంశాల్లో స్థానిక గ్రామసభల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.మైదాన ప్రాంతాలతో సమానంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఎక్సైజ్ విధానాలను అమలు చేయడం సరికాదన్నారు. ఏజెన్సీ ప్రత్యేక పరిస్థితులు, గిరిజన రక్షణ చట్టాలు, రాజ్యాంగ నిబంధనలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.మద్యం దుకాణాల లైసెన్సుల రెన్యువల్ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో హైకోర్టును ఆశ్రయించడంతో పాటు ప్రజా ఉద్యమాలు, ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని తెల్లం తమ్మయ్య హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు బాబు బొర్రయ్య, పాయం సీతారామయ్య, మడకం పొద్దయ్య, నాగమణి, ఉయిక కన్నయ్య, పైద శ్రీకాంత్, శీలం పిచ్చయ్య, నూప రాజు, తదితరులు పాల్గొన్నారు..

## పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ




**ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**

వట్టిగుడిపాడు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గతంలో పనిచేసిన కీర్తిశేషులు మర్రివాడ శేషగిరిరావు, శ్రీలక్ష్మీ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు, కుమార్తెలు రూ.40 వేల విలువైన కంప్యూటర్‌తో పాటు విద్యార్థులకు స్టేషనరీ సామగ్రిని బహూకరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు జి.వేద ప్రభ మాట్లాడుతూ దాతల సహకారం అభినందనీయమని, విద్యార్థులు కంప్యూటర్‌ను సద్వినియోగం చేసుకుని సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. దాతలు మాట్లాడుతూ తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం, విద్యార్థుల సాంకేతిక అభివృద్ధి కోసం కంప్యూటర్ అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## హెచ్ పి వి వ్యాక్సిన్ పై విద్యార్థినిలకు అవగాహన



**ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.**

స్తానిక విఆర్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనీ విద్యార్థినీలకు ఏ ఏ ఎఫ్ ఏ ఆధ్వర్యంలో హెచ్ పి వి వ్యాక్సిన్ పై బుధవారం అవగాహన కల్పించారు."నేటి ఒక వ్యాక్సిన్ మన కుమార్తె భవిష్యత్తుకు రక్షణ" అనే సందేశంతో అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ (ఏ ఏ ఎఫ్ ఏ) చేపట్టిన సేవా కార్యక్రమంలో భాగంగా, విఆర్ పురం జడ్పీ హై స్కూల్లో సెప్టెంబర్ 8, 9 తేదీలలో హెచ్ పి వి (హ్యూమన్ పాపిల్లోమావైరస్) వ్యాక్సిన్ అవగాహన డ్రైవ్-2 కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యా సంస్థలలో బాలికల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో, క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధుల నుంచి రక్షణ పొందడంలో హెచ్ పి వి టీకా ప్రాముఖ్యతను విద్యార్థినులకు, ఉపాధ్యాయులకు వివరించారు. బాలికలకు చిన్న వయస్సులోనే వ్యాక్సిన్ అందిస్తే భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సెర్వికల్ క్యాన్సర్) బారిన పడకుండా పూర్తి రక్షణ లభిస్తుందని తెలియజేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఏ ఏ ఎఫ్ ఏ సభ్యులు దుర్గేష్ పవన్, ఫణి, భార్గవ్, అభిరామ్, మనోహర్, దుర్గాప్రసాద్, ప్రశాంత్, సతీష్, జయంత్, వెంకటేష్, శ్రీకాంత్, రాము మరియు దుర్గలు పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సమాజ శ్రేయస్సు కోరి ఇటువంటి సామాజిక స్పృహ కలిగిన కార్యక్రమాలు చేపట్టిన అల్లు అర్జున్ అభిమానుల చొరవను పాఠశాల యాజమాన్యం, స్థానికులు కొనియాడారు.

## పోషణ్ మహ్ -2026 గోడప్రతులను ఆవిష్కరించిన జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి.

**ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.**



ఏలూరు, జిల్లా కలెక్టరేటు గౌతమీసమావేశ మందిరంలో బుధవారం జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పోషణ్ మహ్ -2026 గోడప్రతులను జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ పిల్లలు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికల్లో పోషక ఆహారంపై అవగాహన పెంపొందించడమే పోషణ్ మహ్-2026 ప్రధాన లక్ష్యమని అన్నారు. సమతుల్య ఆహారం, పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యం, తల్లిపాలు, చిన్నారులు ఆరోగ్యసంరక్షణ వంటి అంశాలుపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు ద్వారా పోషకాహార కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, పోషకాహార లోపం ఉన్న చిన్నారులను గుర్తించి వారికి అవసరమైన వైద్య, పోషక సహాయం అందించాలని అన్నారు. ప్రతి కుటుంబం పోషకాహారం, ఆరోగ్యం పట్ల బాధ్యతగా వ్యవహరించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పోషణ్ మహ్-2026 సందర్భంగా జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను భాగస్వాములను చెయ్యాలని జిల్లా కలెక్టరు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె. అభిషేక్ గౌడ, ఇంచార్జి డిఆర్వో, ఎస్సీ కార్పొరేషన్ ఇడి యం.ముక్కంటి, విజిలెన్స్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎల్.దేవ కీదేవి, ఐసిడిఎస్ పిడి పి.శారద, జిల్లా గృహనిర్మాణ శాఖ పిడి. జి.సత్యనారాయణ, నగర పాలక సంస్థ కమీషనరు ఏ.భాను ప్రతా ప్, జిల్లా పంచాయతీ శాఖ అధికారి జి.వి. కె.మల్లిఖార్జునరావు, జిల్లా విద్యాశాఖ అధికారి యం.వెంకటలక్ష్మమ్మ, డిఆర్డిఏ పిడి టి.వి.విజయలక్ష్మి, నోడల్ అధికారి ఇ.తులసి, సిడిపివో ఏ.పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాభూమి

కాకినాడ, తూర్పుగోదావరి 5

గురువారం 10 సెప్టెంబరు 2026


# కుయ్యేరు హైస్కూల్లో మూలనపడ్డ ఆర్వో ప్లాంట్.

## త్రాగునీరు కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు.

**ప్రజాభూమి ప్రతినిధి-కాజులూరు.**

గత ప్రభుత్వ హయాంలో నాడు- నేడు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు స్వచ్ఛమైన తాగు నీరు అందించాలనే సంకల్పంతో అందించిన ఆర్వో ప్లాంట్ కు సంబంధించిన మోటర్ పాడై గత మూడు నెలల నుంచి పనిచేయక పోవడంతో మూలన పడింది. దీంతో హైస్కూల్ విద్యార్థులకు మూడు నెలల నుంచి నిత్యం త్రాగునీరు బయటినుంచి ప్రత్యామ్నాయంగా కొని సరఫరా చేయాల్సిన పరిస్థితి నెలకొంది.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కనీస మౌలిక వసతులు కల్పించాల్సిన అధికారులు ఈవిషయంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. కాజులూరు మండలం కుయ్యేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి కోసం పాఠశాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ నిరుపయోగంగా మారి మూలన పడడంతో విద్యార్థులు స్వచ్ఛమైన తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల లో మూలన పడి ఉన్న ఆర్ఓ ప్లాంట్ మరమ్మత్తుల కోసం ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించకపోవడంతో మూడు నెలలు కావస్తున్న మూలన పడ్డ ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు నోచుకోలేదు, సంబంధిత అధికారులు సైతం ఈఆర్ ఓ ప్లాంట్ విషయంపై స్పందించకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పాఠశాలల్లో తాగునీటి సదుపాయాలకు ప్రాధాన్యత ఇస్తున్నప్పటికి ఇక్కడ పాఠశాలలో పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆర్వో ప్లాంటు తక్షణమే మరమ్మతులు చేయించి, విద్యార్థులకు నిరంతరాయంగా స్వచ్ఛమైన తాగునీరు అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

**త్రాగునీరు బయట నుంచి కొనితెస్తున్నాం :హెచ్ఎం ప్రసన్నకుమార్.**

పాఠశాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ మరమ్మత్తుల కారణంగా పనిచేయకపోవడంతో బయట నుండి విద్యార్థులకు తాగునీరు కొనితెస్తున్నామని కుయ్యేరు హైస్కూల్ హెచ్ ఎం డి. ప్రసన్నకుమార్ తెలియజేశారు.





ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ ఉన్న ఆర్వో ప్లాంట్ పాడైందని దీంతో సంబంధిత మెయింటినెన్స్ వారికి ఎన్ని సార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదని గతంలో కొద్దిపాటి సమస్యలు ఉన్నప్పటికీ మూడు పరిహారాలు తామే బాగు చేయించామని హెచ్ఎం పేర్కొన్నారు . అయితే ప్రస్తుతం ఆర్ఓ ప్లాంట్ మోటార్ చెడిపోవడంతో భారీ బడ్జెట్ కారణంగా తాము ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నామని అయితే విద్యార్థులకు మాత్రం ఎటువంటి ఇబ్బందులు లేకుండా రోజు త్రాగునీరు బయట నుంచే కొని తీసుకువస్తున్నామని హెచ్ఎం ప్రసన్నకుమార్ తెలియజేశారు. పాఠశాలలో సుమారు 275 మంది విద్యార్థినీ విద్యార్థులు ఉన్నారని, గత సంవత్సరం నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించామని హెచ్ఎం పేర్కొన్నారు. అయితే పాఠశాలకు రెండు సోషల్ రెండు హిందీ పోస్టులు ఉండాలని కేవలం ఒక్కొక్క పోస్టు మాత్రమే మంజూరు చేసి మరో సోషల్, హిందీ ,పోస్టులు మంజూరు కావాల్సి ఉందన్నారు. అలాగే ఇక్కడ విద్యార్థులు సంఖ్యకు తగ్గట్టుగా బాత్రూములు సరిపోవటం లేదని పెంచాల్సిన అవసరం ఉందని హెచ్ఎం ప్రసన్నకుమార్ ఈసందర్భంగా తెలియజేశారు.

## కోనసీమ తిరుమల వాడపల్లిలో సెప్టెంబర్ 11న సామూహిక వరలక్ష్మి వ్రతాలు

-మహిళా భక్తులు గోత్రనామాలు ముందస్తుగా నమోదు చేసుకోవాలని దేవస్థానం విజ్ఞప్తి.



**ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట.**

శ్రావణమాసాన్ని పురస్కరించుకుని కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈ నెల 11వ తేదీ (శుక్రవారం) ఉదయం 9 గంటలకు సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో పాల్గొనదలచిన మహిళా భక్తులు ముందుగా దేవస్థానం కౌంటర్ వద్ద తమ గోత్ర నామాలు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సామూహికంగా నిర్వహించే ఈ వరలక్ష్మి వ్రతంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారి అనుగ్రహాన్ని పొందాలని దేవస్థానం కోరింది. శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాల కోసం భక్తులు దేవస్థానం కౌంటర్‌ను సంప్రదించాలని ఆలయ అధికారులు సూచించారు.

## బాధిత కుటుంబానికి అండగా తెలుగుదేశం పార్టీ



**ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**

సూరవరం గ్రామ మాజీ సర్పంచ్ కోసూరి సుబ్బరాజు తల్లి కోసూరి భారతమ్మ పెద్దకర్మకు మంత్రి కొలుసు పార్థసారథి హాజరై నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. భారతమ్మ మృతి కుటుంబానికి తీరని లోటని, ఆమె సేవలు మరువలేనివని తెలిపారు. కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని, తనవంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎన్. వేణు, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# రామచంద్రపురంలో ముగిసిన మహిళా బాస్కెట్ బాల్ అండర్-13 శిక్షణ శిబిరం

## విజేతలకు ఘనంగా సెండాఫ్ పలికిన వాసంశెట్టి సత్యం

**ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం**

విజయవాడలో ఈ నెల 27 నుండి అక్టోబర్ 3వ తేదీ వరకు నిర్వహించనున్న నేషనల్ బాస్కెట్ బాల్ కాంపిటీషన్ ను పురస్కరించుకుని, స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో ఆగస్టు 31 నుండి ఈ నెల 10వ తేదీ వరకు నిర్వహిస్తున్న బాస్కెట్ బాల్ అండర్-13 క్యాంప్ నుండి మహిళా విభాగం ఎంపిక విజయవంతంగా ముగిసింది. బాస్కెట్ బాల్ అసోసియేషన్ స్టేట్ సెక్రటరీ చక్రవర్తి, కోచ్‌లు వివేక్, బాబీల ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణ శిబిరంలో తూర్పు గోదావరి, కోనసీమ, పశ్చిమ గోదావరి, కృష్ణా, చిత్తూరు, వైజాగ్, గుంటూరు, కర్నూలు, ప్రకాశం జిల్లాల నుండి మొత్తం 24 మంది బాలురు, 24 మంది బాలికలు పాల్గొన్నారు.ఈ శిక్షణ పొందిన వారి నుంచి విజయవాడలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు 12 మంది బాలురు, 12 మంది బాలికలను ఎంపిక చేయనున్నట్లు అసోసియేషన్ స్టేట్ సెక్రటరీ చక్రవర్తి తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటికే బాలికల విభాగం నుండి 12 మంది ఎంపిక పూర్తయిందని ఆయన వెల్లడించారు.ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తూ మంగళవారం నిర్వహించిన సెండాఫ్ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశాల మేరకు సీనియర్ కూటమి నాయకులు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ రామచంద్రపురంలో ఈ శిక్షణ శిబిరాన్ని అద్భుతంగా నిర్వహించిన సెక్రటరీ చక్రవర్తి, కోచ్‌లు తదితరులను కొనియాడారు. జాతీయ పోటీలకు ఎంపికైన ప్రతిభావంతులు మెరుగైన ప్రదర్శనతో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని





ఆకాంక్షించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలు మానసిక వికాసానికి, భవిష్యత్తుకు తోడ్పడతాయని సూచించారు. పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహిస్తూ వచ్చిన తల్లిదండ్రులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.క్యాంప్ నిర్వహిస్తున్న గ్రౌండ్‌లో లైటింగ్ సమస్యను గుర్తించి, ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేసినందుకు వాసంశెట్టి సత్యంకు అసోసియేషన్ సెక్రటరీ చక్రవర్తి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, రామచంద్రపురం బాస్కెట్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ సి. రామారావు, ఏపీ రాష్ట్ర బాస్కెట్ బాల్ సెలక్షన్ కమిటీ చైర్మన్ ఎన్. అప్పలరాజు, టీడీపీ క్లస్టర్ ఇంచార్జి కంచుమర్తి బాబురావు, టీడీపీ నాయకులు కట్టా నాగేశ్వరరావు, దాసు, తూర్పు గోదావరి జిల్లా బాస్కెట్బాల్ జాయింట్ సెక్రటరీ ం కోనసీమ జిల్లా సెక్రటరీ ఎస్. గంగాధర్, కాకినాడ జిల్లా ట్రెజరర్ రాకేష్, వైస్ ప్రెసిడెంట్ ఐ. గోపాలకృష్ణ, ఈసీ మెంబర్ శంకర్, రామచంద్రపురం అసోసియేషన్ ట్రెజరర్ డాక్టర్ సతీష్, నాయుడు మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట

-సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బడేటి చంటి

**ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు**




పేద ప్రజల ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని టీడీపీ జిల్లా అధ్యక్షులు,ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు.ఏలూరు పవర్‌పేట లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అనారోగ్యంతో బాధపడుతున్న 31 మంది బాధితులకు రూ.17.12 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, మరో 9 మందికి రూ.15.34 లక్షల విలువైన ఎల్‌వోసీ కాపీలను ఎమ్మెల్యే అందజేశారు.బాధితులకు భరోసా కల్పిస్తూ, భవిష్యత్తులో అవసరమైన వైద్య సహాయం అందించేందుకు అండగా ఉంటానన్నారు.ఏలూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు 729 మందికి రూ.5.71 కోట్ల విలువైన సీఎం సహాయ నిధి చెక్కులు, 88 మందికి రూ.2.42 కోట్ల విలువైన ఎల్‌వోసీ కాపీలు అందించినట్లు తెలిపారు.మొత్తంగా 818 మంది బాధితులకు రూ.7.44 కోట్ల మేర ఆర్థిక భరోసా కల్పించినట్లు వెల్లడించారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న సంజీవని కార్యక్రమాన్ని కూడా సమర్థవంతంగా అమలు చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు.కార్యక్రమంలో ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, టీడీపీ నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, కార్యదర్శి రెడ్డి నాగరాజు, పలువురు తంగిరాల సురేష్,మాజీ కార్పొరేటర్లు, క్లస్టర్,డివిజన్ ఇంచార్జిలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సమావేశానికి శాఖలు వారీగా అభివృద్ధి, పురోగతిపై ప్రజెంటేషన్ రూపొందించాలి

### అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమీక్ష.

**ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా**

ఏలూరు జిల్లా కలెక్టరేటు గౌతమీసమావేశం మందిరంలో బుధవారం ముఖ్యమంత్రి అధ్యక్షతన జరగనున్న 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు ఈ నెల ( రేపటి నుండి) 10,11 తేదీలు జరిగే సమావేశానికి శాఖలు వారీగా పూర్తిస్థాయి నివేదికలు సాయంత్రానికి అందించాలని సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టరుతో పాటు జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె. అభిషేక్ గౌడ పాల్గొన్నారు. వివిధ శాఖలు పరిధిలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ ప్రాధాన్యతా అంశాలు, పురోగతిలో ఉన్న పనులు తదితర అంశాలుపై శాఖల వారీగా జిల్లా కలెక్టరు సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్యక్షతన జరగనున్న 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు ఈ నెల ( రేపటి నుండి) 10,11 తేదీల్లో అమరావతి వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో జరగనున్నదని అన్నారు. ఇప్పటివరకు సాధించిన ప్రగతి, రానున్న రోజుల్లో చేపట్టబోయే లక్ష్యాలు, మనకు కావసిన నిధులు శాఖలు వారీగా చక్కని ప్రజెంటేషన్, ఈ రోజు సాయంత్రానికి అందించాలని ఆదేశించామని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రెండు రోజులు సమావేశానికి ఏలూరు జిల్లా తరపున చక్కని ప్రజెంటేషన్ ఇవ్వడానికి దోహదపడుతుందని అన్నారు. ప్రతి శాఖకు సంబంధించిన తాజా వివరాలు, పురోగతి నివేదికలు, సాధించిన లక్ష్యాలు, పెండింగు అంశాలు తదితర సమాచారాన్ని ఒకటికి రెండు సార్లు వెరిఫై చేసుకుని అందించాలని అన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలు అమలులో ఎక్కడైనా సమస్యలు, ఇబ్బందులు ఉంటే



వాటిని గుర్తించి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అధికారులు తమ శాఖలకు సంబంధించిన అంశాలుపై పూర్తి అవగాహనతో, వాస్తవ గణాంకాలతో నివేదికలు సిద్ధం చెయ్యాలి అన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ జిల్లాకు సంబంధించిన అంశాలను సమర్థవంతంగా వివరించేలా అవసరమైన కార్యాచరణను సిద్ధం చేసి, మంచి ప్రజెంటేషన్ అందించాలని అన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు అమలు తీరుపై ఖచ్చితమైన గణాంకాలతో కూడిన నివేదికలను పవర్ పాయింటు ప్రజెంటేషన్ (పి పి టి) రూపంలో సిద్ధం చెయ్యాలని అన్నారు.ప్రభుత్వ ప్రాధాన్యతా అంశాలు పేదలు సంక్షేమం, విద్య, వైద్యం, వ్యవసాయం, మౌళిక వసతులు కల్పన వంటి రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలు క్షేత్రస్థాయి పురోగతిని విజయగాథగా పొందుపరచాలని అన్నారు. ?లక్ష్యాలు సాధనలో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాల్సిన ప్రాజెక్టులు, నిధులు వినియోగం, లబ్ధిదారులకు అందిన ప్రయోజనాకు వివరాలను పక్కాగా పొందుపరచాలని అన్నారు. శాఖలు మధ్య సమన్వయ లోపం లేకుండా, ఎక్కడా పొరపాట్లకు తావులేకుండా పూర్తిసమాచారాన్ని మరియొకసారి సరిచూసుకుని ప్రజెంటేషన్ అందించాలని అన్నారు.ఈ సమావేశంలో ఇంచార్జి డిఆర్వో, ఎస్సీ కార్పొరేషన్ ఇడి యం.ముక్కంటి, విజిలెన్స్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎల్.దేవకీదేవి, వివిధ శాఖలు అధికారులు పాల్గొన్నారు.

# 338 పతకాలతో విశాఖ రేంజ్ పోలీసుల చారిత్రాత్మక విజయం!

- తొలి ఏపీ స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కైవసం
- 197 స్వర్ణాలతో రాష్ట్రస్థాయిలో అగ్రస్థానం.. అనకాపల్లి పోలీసుల సత్తా

**ప్రజా భూమి ప్రతినిధి-విశాఖపట్నం**

తొలి ఏపీ స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్-2026 పోటీల్లో విశాఖ రేంజ్ పోలీసులు అద్వితీయ ప్రతిభ కనబరిచారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ప్రతిష్టాత్మక క్రీడా పోటీల్లో విశాఖ రేంజ్ పరిధిలోని జిల్లాలు, నగర పోలీసు విభాగాలు సమష్టిగా సత్తా చాటి మొత్తం 338 పతకాలు సాధించి ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నాయి. ఈ వివరాలను విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపినాథ్ జట్టి, తో పాటు రేంజ్ పరిధిలోని జిల్లా ఎస్పీలు బుధవారం విశాఖపట్నంలోని ఐజీ కార్యాలయంలో వెల్లడించారు. గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, మంగళగిరిలోని 6వ బెటాలియన్‌లో సెప్టెంబర్ 1 నుంచి 4వ తేదీ వరకు జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా వివిధ విభాగాల నుంచి సుమారు 1,900 మంది పోలీసు అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు. మొత్తం 15 క్రీడా విభాగాల్లో పోటీలు జరిగాయి. విశాఖ రేంజ్ పోలీసు క్రీడాకారులు 197 స్వర్ణాలు, 82 రజతాలు, 59 కాంస్యాలు సాధించి రాష్ట్రస్థాయిలో అగ్రస్థానంలో నిలిచారు.

**విశాఖ సిటీకి 109 పతకాలు**

విశాఖ రేంజ్ పరిధిలో అత్యధికంగా విశాఖపట్నం సిటీ పోలీసు విభాగం 70 స్వర్ణాలు, 22 రజతాలు, 17 కాంస్యాలతో మొత్తం 109 పతకాలు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. విజయనగరం జిల్లా 39 స్వర్ణాలు, 21 రజతాలు, 14 కాంస్యాలతో మొత్తం 74 పతకాలు సాధించింది.అనకాపల్లి జిల్లా పోలీసులు సైతం అద్భుత ప్రతిభ కనబరిచి 44 స్వర్ణాలు, 18 రజతాలు, 8 కాంస్యాలతో మొత్తం 70 పత కాలు సాధించారు. శ్రీకాకుళం జిల్లా 33 పతకాలు, పార్వతీపురం మన్యం జిల్లా 32 పతకాలు, అల్లూరి సీతారామరాజు జిల్లా 20 పతకాలు సాధించి విశాఖ రేంజ్ ఓవరాల్ ఛాంపియన్‌గా నిలవడంలో కీలక పాత్ర పోషించాయి.

**అనకాపల్లి పోలీసుల పతకాల పంట**



అనకాపల్లి జిల్లా పోలీసు క్రీడాకారులు రికార్డు స్థాయిలో 70 పతకాలు సాధించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇందులో 44 స్వర్ణాలు, 18 రజతాలు, 8 కాంస్యాలు ఉన్నాయి. దీంతో విశాఖ రేంజ్ విజయానికి అనకాపల్లి జిల్లా పోలీసులు బలమైన వెన్నుదన్నుగా నిలిచారు. రేంజ్ టీమ్ కెప్టెన్‌గా ఆర్ఐ ఎల్.మన్మధరావు జట్టును ముందుండి నడిపించడంతో పాటు ఫుట్‌బాల్, కో-కో, క్రికెట్ విభాగాల్లో మూడు స్వర్ణ పతకాలు సాధించారు.

**మహిళా పోలీసుల అద్వితీయ ప్రతిభ**

మహిళా పోలీసు సిబ్బంది కూడా పోటీల్లో అసాధారణ ప్రతిభ కనబరిచారు. డబ్ల్యూపీసీ వి.విజయ 4ఇ400 మీటర్లు, 5000 మీటర్లు, 1500 మీటర్లు, 800 మీటర్ల పరుగు పందెంతో పాటు కో-కోలో కలిపి ఐదు స్వర్ణ పతకాలు సాధించారు.డబ్ల్యూపీసీ కె.విజయలక్ష్మి 400 మీటర్ల హర్డిల్స్, 4ఇ100, 4ఇ400 రిలే, కో-కో, కబడ్డీ, బాక్సింగ్ విభాగాల్లో 6 స్వర్ణాలు, 3 రజతాలు, ఒక కాంస్యం సాధించారు.డబ్ల్యూపీసీ ఎల్.పావని కుమారి హైజంప్, 100 మీటర్ల హర్డిల్స్, రిలే, లాంగ్‌జంప్, కో-కో, కబడ్డీ విభాగాల్లో 7 స్వర్ణాలు, ఒక రజతం, రెండు కాంస్యాలు సాధించి ప్రత్యేక గుర్తింపు పొందారు.డబ్ల్యూపీసీ ఎం.నిర్మల యోగా, హ్యాండ్‌బాల్‌లో రెండు స్వర్ణాలు, మూడు రజతాలు సాధించగా, డబ్ల్యూపీసీ డి.రంజని వాలీబాల్, కబడ్డీలో రెండు స్వర్ణాలు, హ్యాండ్‌బాల్, బాక్సింగ్‌లో రెండు రజతాలు సాధించారు. డబ్ల్యూహెచ్‌సీ డి.లలిత వెయిట్‌లిఫ్టింగ్‌లో స్వర్ణంతో పాటు బాక్సింగ్, హ్యాండ్‌బాల్, కబడ్డీ, షటిల్ విభాగాల్లో పతకాలు సాధించారు.

పురుష క్రీడాకారులూ మెరిశారు.పురుషుల విభాగంలో హెడ్ కానిస్టేబుల్ జి.మధుబాబు స్విమ్మింగ్‌లో మూడు స్వర్ణాలు, ఒక రజతం సాధించారు. పీసీ జి.శ్రీనివాసరావు బాడీబిల్డింగ్‌లో రెండు స్వర్ణ పతకాలు సాధించారు. వాలీబాల్, హాకీ, ఫుట్‌బాల్ తదితర విభాగాల్లోనూ పలువురు పోలీసు కానిస్టేబుళ్లు స్వర్ణ పతకాలు సాధించి విశాఖ రేంజ్ విజయానికి తోడ్పడ్డారు.

**'క్రీడాస్ఫూర్తే పోలీసులకు నిజమైన బలం'**

ఈ సందర్భంగా రేంజ్ ఐజీ గోపినాథ్ జట్టి, మాట్లాడుతూ.. గెలుపు స్ఫూర్తినిస్తే, ఓటమి కొత్త అనుభవాన్ని నేర్పుతుందని అన్నారు. రెండింటినీ సమానంగా స్వీకరించడమే నిజమైన క్రీడాస్ఫూర్తి అని పేర్కొన్నారు. పతకాలు సాధించలేకపోయిన వారు నిరుత్సాహపడకుండా మరింత పట్టుదలతో సాధన చేయాలని సూచించారు.పోలీసుశాఖలో హోదాలు, ప్రాంతాలు వేరైనా అందరూ ఒకే కుటుంబంగా సమష్టి కృషితో పనిచేసినప్పుడే సమాజానికి అత్యుత్తమ రక్షణ, సేవలు అందించగలుగుతామని తెలిపారు. మారుతున్న నేరాల శైలిని సమర్థంగా ఎదుర్కొనేందుకు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక దృఢత్వం కూడా ఎంతో అవసరమన్నారు.ప్రతి పోలీసు ఉద్యోగి క్రీడలను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని ఐజీ సూచించారు. ముఖ్యంగా మహిళా పోలీసు సిబ్బంది మైదానంలో చూపిన అంకితభావం, ప్రతిభ అభినందనీయమని ప్రశంసించారు. త్వరలో జరగనున్న ఆల్ ఇండియా పోలీస్ గేమ్స్‌లోనూ విశాఖ రేంజ్ క్రీడాకారులు సత్తా చాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మరింత ఖ్యాతి తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారులు, పోలీసు సిబ్బందిని ఐజీ గోపినాథ్ జట్టి, అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, విజయనగరం జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి, శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర్ రెడ్డి తదితర పోలీసు అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

## నిజం గెలిచింది.. చంద్రబాబు పోరాటం ఫలించింది.



ప్రజా భూమి ప్రతినిధి-నాయుడుపేట

తెలుగుదేశం పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని 2023లో స్కిల్ డెవలప్మెంట్ కేసులో అరెస్టు చేసి రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉంచిన ఘటనను రాష్ట్ర ప్రజలు ఇప్పటికీ మరువలేదని టీడీపీ నాయకుడు దార్ల రాజేంద్ర అన్నారు. చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా సూళ్లూరుపేట నియోజకవర్గంలో 53 రోజుల పాటు వివిధ నిరసన కార్యక్రమాలు నిర్వహించి ఆయనకు మద్దతుగా నిలిచామని తెలిపారు. పెద్దలు కొండేపాటి గంగాప్రసాద్ సూచనలతో నియోజకవర్గ ఇన్‌చార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయుడు,నారా లోకేష్‌పై కేసులు,అరెస్టులు,హౌస్ అరెస్టుల పేరుతో అన్యాయం జరిగిందని దార్ల రాజేంద్ర ఆరోపించారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో కూడా టీడీపీ నాయకులు,కార్యకర్తలపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారని అన్నారు. చంద్రబాబు నాయుడు అరెస్టు సమయంలో 53 రోజుల పాటు తాము ఆయనకు అండగా నిలిచామని, ఆ పోరాటంలో టీడీపీ శ్రేణులు చూపిన ఐక్యత,ప్రజల మద్దతు మరువలేనిదని తెలిపారు. చివరకు అన్యాయం ఓడిపోయి నిజం గెలిచిందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పోరాటంలో మనమంతా గెలిచామని టీడీపీకి ప్రజల మద్దతు ఎప్పటికీ ఉంటుందని దార్ల రాజేంద్ర అన్నారు.

## హెచ్‌ఐవి/ఎయిడ్స్‌పై అవగాహన మరియు ఆరోగ్య ప్రచార రథం మరియు ర్యాలీ.



ప్రజా భూమి ప్రతినిధి-నాయుడుపేట.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మరియు దిశా విభాగం సహకారంతో బుధవారం నవజీవన్ ఆర్గనైజేషన్ -సి.సి-పి.యు ప్రాజెక్టు ఆధ్వర్యంలో " ఇంటెన్సిఫైడ్ ఐ.ఇ.సి క్యాంపెయిన్" లో భాగంగా ఆరోగ్య ప్రచార రథం ద్వారా సూళ్లూరుపేట లోని జెడ్.పి. బాయ్స్ హైస్కూల్, శ్రీ చైతన్య హైస్కూల్ మరియు ప్రభుత్వ హాస్పిటల్ నందు హెచ్‌ఐవి/ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెచ్‌ఐవి/ఎయిడ్స్ వ్యాప్తి కారకాలు, ఎలా వ్యాపించదు, హెచ్‌ఐవి/ఎయిడ్స్ లక్షణాలు, అవి రాకుండా ఉండాలంటే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, హెచ్‌ఐవి/ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత, చిన్న చూపు లేకుండా ఎలాగ సమాజంలో కలిసి జీవించాలి, హెచ్‌ఐవి/ఎయిడ్స్, క్షయ వ్యాధి సంబంధం గూర్చి, సుఖవ్యాధులు మరియు చికిత్స గురించి, డ్రగ్స్ వాడకం వలన కలిగే ఇబ్బందులు, కండోమ్ యొక్క ఉపయోగం గూర్చి, హెచ్‌ఐవి/ఎయిడ్స్ ఏక్ట్ 2017, ఎ.ఆర్.టి మందులు, ఏ.పి.శాక్స్ యాప్, టోల్ ఫ్రీ నెంబర్ 1097 గూర్చి చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమాలలో ప్రాజెక్టు మేనేజర్ కె. బాలాజి, ఓ.ఆర్.డ బ్ల్యూలు టి.నందిని, కె.మంజుల, ఎ.యన్.యమ్ జి.శ్రీలత, పి.ఇ లు, 250 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, మరియు 100 మంది సాధారణ ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం




ప్రజా భూమి ప్రతినిధి గూడూరు

గూడూరు మండలం కొండాగుంట మరియు కాంద్ర గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన గూడూరుమనుబోలు మండల వ్యవసాయ అధికారి వి రమేష్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎల్నినో పరిస్థితుల వలన నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా అక్టోబర్ నెలలో నార్లు పోయరాదని , రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని వర్షాభావ పరిస్థితులను , బెట్టను తట్టుకొనే ప్రత్యామ్నాయ పంటలను , తక్కువ కాల పరిమితి గల రకాలను ఎంపికచేసుకోవాలని తెలియజేశారు. ప్రతికూల వాతావరణ మార్పులకు అనుగుణంగా వేసుకోవలసిన ప్రత్యామ్నాయ పంటలు, అంతర పంటల సాగు , పంటల నిర్వహణపై చర్చించడం జరిగింది. అనంతరం విత్తన గుళికలు చల్లడం వలన ఎల్నినో పరిస్థితులలో భూమిలోని తేమను ఏ విధంగా సమతుల్యం చేయగలమో తెలుసుకుని పొలాల్లో విత్తన గుళికలు చల్లడం జరిగింది . ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు రాజు , గ్రామ వ్యవసాయ సహాయకులు అనిత, శంకరయ్య, నాచురల్ ఫార్మింగ్ మెంటార్ విజయలక్ష్మి , మరియు సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొనడం జరిగింది.



మోడీ,చంద్రబాబు ప్రభుత్వాలు అనుసరిస్తున్న

# విద్యార్థి వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

- చంద్రబాబు కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలి.
- ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల దోపిడీని అరికట్టాలి.
- యు.గనిరాజు, పిడిఎస్యు మాజీ రాష్ట్ర అధ్యక్షులు




ప్రజా భూమి ప్రతినిధి-గూడూరు

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై విద్యార్థి లోకం సమరశీలంగా ఉద్యమించాలని పి.డి.ఎస్.యు మాజీ రాష్ట్ర అధ్యక్షులు యు.గనిరాజు పిలుపునిచ్చారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యు) నెల్లూరు జిల్లా కార్యవర్గ సమావేశం బుధవారం నాడు నెల్లూరు టౌన్లో ఫత్తేఖాన్ పేటలో ఎస్ డి.ఫయాజ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన గనిరాజు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం-2020 పేరుతో విద్యారంగాన్ని కాషాయికరణ, కార్పొరేటికరణ, కేంద్రికరణ చేస్తుందని విమర్శించారు. విద్యారంగాన్ని మనువాద భావాజాలాంతో నింపడానికి పూనుకుంటుందని అన్నారు. యూనివర్సిటీలకు నిధుల కోత విధిస్తూ సంక్షోభంలో పెడుతుందని అన్నారు. యూనివర్సిటీలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందని విమర్శించారు. కొఠారీ కమిషన్ చేసిన సిఫారసుల ప్రకారం కేంద్ర బడ్జెట్లో 10%, రాష్ట్ర బడ్జెట్లో 30% నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వ హయాంలో 135 పేపర్లు లేకేజి కావడం దుర్మార్గమని అన్నారు. 2026 నీట్ ప్ర స్నాపత్రం లేకేజి కారణంగా 10 మందికి పైగా విద్యార్థులు బలైపోయారని అన్నారు. నీట్ లేకేజీపై, విద్యారంగ సమస్యలపై కాక్రోచ్ జనతా పార్టీ, లక్షలాది మంది విద్యార్థులు ఢిల్లీలో పెద్ద ఎత్తున ఉద్యమించిన ఫలితంగానే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేసాడని అన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం చెందిందని విమర్శించారు. రాష్ట్రంలో 6450 కోట్ల ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్ షిప్స్ బకాయిలను విడుదల చేయకుండా లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతుందని విమర్శించారు. యువగళం పాదయాత్రలో మంత్రి లోకేష్ 77 జిఓను రద్దు చేస్తామని ఇచ్చిన హామిని రెండున్నర సంవత్సరాలైనా ఎందుకు రద్దు చేయలేదని ప్రశ్నించారు. ూఇ, కౌ, దీఇ సంక్షే మ హాస్టల్ విద్యార్థుల మెస్, కాస్మోటిక్ చార్జీల ను పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచ కుండా ఈ వర్గాల విద్యార్థుల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని చూపుతుందని అన్నారు. సం క్షేమ హాస్టల్సలో సమస్యలు తిష్ట వేసి ఉంటే సమస్యలను పరిష్కరించకుండా, హాస్టల్స్ లోకి విద్యార్థి సంఘాలను రాకుండా జిఓ తీసుకురావడం దుర్మార్గమని అన్నారు. తక్షణమే ఈ జిఓను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నారాయణ, శ్రీ చైతన్య, భాష్యం వంటి కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న టీచర్, లెక్చరర్, ప్రొఫెసర్, వార్డెన్, మేట్రిన్, టీచింగ్ - నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. ఈ సమావేశంలో పి.డి.ఎస్.యు జిల్లా ప్రధాన కార్యదర్శి ూఖ. షారుక్, జిల్లా కోశాధికారి అన్వర్ మస్తాన్, జిల్లా నాయకులు ఎన్. సంతోష్, పి. హర్ష వర్దన్, జష్ట్ర. యస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# ధరల పెంపుకు వ్యతిరేకంగా సీపీఐ సమరం...

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో సామాన్యుడి జీవితం భారం..
- ప్రజలపై భారాలు మోపొద్దు
- ధరలను నియంత్రించి ప్రజలకు తక్షణ ఉపశమనం కల్పించాలి : సీపీఐ డిమాండ్
- గూడూరు టవర్ క్లాక్ వద్ద ధర్నా




ప్రజా భూమి ప్రతినిధి-గూడూరు

నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. పెరుగుతున్న ధరలతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జీ. శశి కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని విస్మరించి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి షేక్ జమాలుల్లా మాట్లాడుతూ బీజేపీ నాయకులు భారతదేశ ప్రతిపౌరుని ఖాతాలో రూ. 15 లక్షలు జమ చేస్తామని, నల్ల ధనాన్ని బయటకు తీస్తామని, ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీలిచ్చి పేద ప్రజలను మోసం చేసి అధికారం దక్కించుకున్నారన్నారు. మూడు సార్లు అధికారంలోకి వచ్చినా పేద ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఓ వైపు పన్నులపేరుతో మరో వైపు ధరల పెరుగుదలతో పేద సామాన్య ప్రజల జీవనం దుర్భరంగా మారిందన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేసి, సామాన్యులకు నిత్యావసర సరుకులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సిపిఐ పట్టణ కన్వీనర్ సునీల్ యాదాల మాట్లాడుతూ బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కార్ అని చెప్పుకుంటోందన్నారు. అది తుప్పు పట్టిన ఇంజన్ అని ఏద్దేవా చేశారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో తీవ్రంగా విఫలమైందని అగ్రహం వ్యక్తం చేశారు. ధరల పెరుగుదలతో కుటుంబాల నెలవారీ బడ్జెట్‌లు తారుమారవుతున్నాయన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను తక్షణమే తగ్గించాలని, ప్రజలపై అదనపు భారాలను మోపే విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధర తగ్గినప్పటికీ పెట్రో, డీజిల్, గ్యాస్ ధరలను అమాంతం పెంచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా నినాదాలు చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీపీఐ నాయకులు గుండాల రమేష్, మున్సిపల్ యూనియన్ నాయకులు రాఘవయ్య, బీకేఎంయూ నియోజకవర్గ కార్యదర్శి నందవనం శ్రీనివాసమూర్తి, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు చల్లా వెంకటేశ్వర్లు, రిజ్వాన్, ఆటో యూనియన్ నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక శంఖారావం ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన

ప్రజా భూమి ప్రతినిధి-గూడూరు




సామాజిక శంఖారావం ఆధ్వర్యంలో బుధవారం రోజు గూడూరు ఆర్డిఓ కార్యాలయం ఎదుట కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్)మరియు వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు ప్రజా సంఘాలు గూడూరు చుట్టుపక్కల గ్రామాల్లో దళితవాడలు, గిరిజన కాలనీల లో నివసించే ప్రాంతాల ప్రజల సమస్యలు పరిష్కరించాలంటూ కోరుతూ నిరసన చేపట్టడం జరిగింది. నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏడవ తేదీ నుండి 16వ తేదీ వరకు కొత్త పెన్షన్ దారుల ఆన్ లైన్ చేసుకోవాలని ప్రకటించడం జరిగిందన్నారు. సమయం చాలా తక్కువగా ఉన్నందున కుల,ఆదాయం సర్టిఫికెట్ ఇతర సర్టిఫికెట్లు అవసరం అవి ఇవ్వడానికి రెవెన్యూ అధికారులు రెండు మూడు రోజులు పడుతుందని చెబుతుండడంతో సమయం చాలా తక్కువగా ఉండటం వల్ల రెవెన్యూ అధికారులు కొత్త పెన్షన్ దారులకు ఇబ్బందులు కలిగించకుండా త్వరగా కులం ఆదాయం సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. ఆన్ లైన్ లో సర్వర్లు సరిగా పనిచేయకపోవడంతో ప్రభుత్వం ఆన్ లైన్ గడువు పెంచాలని వారు డిమాండ్ చేశారు. మరియు భూ సమస్యలు గ్రామాల్లో పరిష్కారానికి నోచుకోక చాలా సంవత్సరాలు తరబడి ఆగిపోయి ఉన్నాయని, అలాగే స్మశానాలకు దారులు ఆక్రమణలకు గురి అయ్యాయని,ప్రహరీ గోడలు, ఒకగది మంచినీటి బోర్లు ఏర్పాటు చేయాలని, అలాగే దళిత,గిరిజన కాలనెలలో వీధిలైట్లు, సిమెంట్ రోడ్లు, సైడు కాలువలు, ఇంటి స్థలాలు మంజూరు చేయాలని, గూడూరు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ ని అభివృద్ధి చేసి ప్రజలకు అన్ని వస్తువులు అందుబాటులోకి తేవాలని, గూడూరు ఒకటో పట్టణం నుండి రెండో పట్టణం నాకు కలుపు ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఎంతో కాలంగా అయి ఉందని వెంటనే పూర్తి చేయాలని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనము డి.ఎన్.ఆర్ కమ్యూనిటీ హాల్ పక్కన శంకుస్థాపన చేసి చాలా కాలమైందని దాన్ని వెంటనే పూర్తి చేయాలని, ఏడవ వార్డు అశోక్ నగర్ లో ఉన్న రీడింగ్ రూమును వెంటనే తెరిపించే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ ఏ.వోకి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏ.పీ వ్యవసాయ కార్మిక సంఘం కమిటీ సభ్యులు జోగి. శివకుమార్,కేవీపీఎస్ అధ్యక్ష,కార్యదర్శులు అడపాల ప్రసాద్, ఎంబేటి చంద్రయ్య,సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు పామంజి మణి,బి.వి. రమణయ్య,బి.చంద్రయ్య, జక్కా వెంకయ్య శ్రామిక నగర్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమల ఘాట్‌రోడ్డులో

# రవాణా శాఖ-పోలీసుల సంయుక్త తనిఖీలు

### నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలపై కేసులు - భక్తుల భద్రతకు ప్రాధాన్యత

ప్రజా భూమి ప్రతినిధి-తిరుపతి





తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని తిరుమల ఘాట్‌రోడ్డులో భక్తులు, ప్రయాణికుల రాకపోకలు పెరిగే నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు రవాణా శాఖ మరియు పోలీస్ శాఖల ఆధ్వర్యంలో తిరుమల ఘాట్ రోడ్ నందు ఈరోజు ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలకు జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళి మోహన్ సమన్వయం చేశారు. ఘాట్‌రోడ్డులో ప్రయాణిస్తున్న వివిధ రకాల వాహనాలను తనిఖీ చేసి, వాహనాల సామర్థ్యానికి మించి ప్రయాణికులను తరలించడం, సీట్‌బెల్ట్, హెల్మెట్ వంటి భద్రతా నిబంధనలు పాటించకపోవడం తదితర ఉల్లంఘనలను గుర్తించారు. ప్రత్యేకంగా పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న జీపులపై 8 కేసులు నమోదు చేశారు. అలాగే సీట్‌బెల్ట్ ధరించని, హెల్మెట్ ధరించని 20 వాహనదారులపై కూడా నిబంధనల మేరకు కేసులు నమోదు చేసి, వాహనదారులకు భద్రతా సూచనలు అందించారు. ఈ సందర్భంగా డి టి ఓ కొర్రపాటి మురళి మోహన్ మాట్లాడుతూ, తిరుమల ఘాట్ రోడ్డు నందు రక్షణాత్మకమైన డ్రైవింగ్ చేస్తూ , చిన్న పాటి నిర్లక్ష్యం కూడా చేయకుండా ప్రమాదాలకు దారితీసే ధోరణి విడిచి వాహనదారులు తగు జాగ్రత్త వహించాలి అని తెలియజేశారు. ముఖ్యంగా బ్రహ్మోత్సవాల సమయంలో దేశం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తిరుమలకు వచ్చే నేపథ్యంలో ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా వాహన సామర్థ్యానికి అనుగుణంగా మాత్రమే ప్రయాణికులను తీసుకెళ్లాలని, వేగ పరిమితులను పాటించాలని, సీట్‌బెల్ట్/హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని, ఘాట్‌రోడ్డులో ఓవర్‌టేకింగ్ మరియు నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. తిరుమలకు వచ్చే భక్తులు కూడా వాహనదారుల సూచనలు పాటిస్తూ, సురక్షితంగా శ్రీవారి దర్శనం చేసుకుని క్షేమంగా తిరిగి వెళ్లేలా సహకరించాలని రవాణా శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రత్యేక తనిఖీలలో వెంకటరమణ నాయక్, ప్రసాద్ వర్మ, ట్రాఫిక్ ఎస్ఐ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. భక్తుల ప్రయాణం సురక్షితం - తిరుమల ఘాట్‌రోడ్డులో ప్రతి ప్రయాణం బాధ్యతాయుతం" అనే లక్ష్యంతో బ్రహ్మోత్సవాల వరకు రవాణా మరియు పోలీస్ శాఖల సమన్వయంతో తనిఖీలు, రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు గారు తెలియజేశారు .

## రామయ్య పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి



ప్రజా భూమి ప్రతినిధి-శ్రీకాళహస్తి రూరల్

శ్రీకాళహస్తి మండలం,వాగివేడు గ్రామానికి చెందిన ఎన్ రామయ్య చెందిన ఆకస్మిక మృతి చెందారు. కావున నేడు వారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి. అనంతరం వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో వాసు రెడ్డి,రాజా రెడ్డి,నరసింహ రెడ్డి,మణి,ప్రసాద్ ఆచారి, హరినాథ్ రెడ్డి, బియ్యపు వెంకట సుబ్బా రెడ్డి,రమణయ్య, లోకేష్, చంద్ర రెడ్డి, పాపయ్య మణి, నాగరాజు రెడ్డి, మన్నవరం చెంచయ్య నాయుడు, సురేంద్ర యాదవ్,ప్రసాద్ యాదవ్, శంకర్ యాదవ్, మునిశేఖర్ గౌడ్, రమణయ్య, ఇలాగనూరు శివ ,పల్లం శీను, మనోహర్ యాదవ్, గంగయ్య యాదవ్, మోడీ రాజా యాదవ్, బాలవర్ధి యాదవ్, తదితరులు ఉన్నారు.

## తుమ్మలగుంటలో బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం

- ప్రత్యేక ఆకర్షణగా ముస్తాబవుతున్న ప్రధాన ఆలయం
- ఆలయం వద్ద చురుగ్గా సాగుతున్న పనులు.







ప్రజా భూమి ప్రతినిధి–తిరుపతి రూరల్

తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. ఆలయం లోపల, బయట ఏర్పాట్లు చురుగ్గా సాగుతుండటంతో ఆలయ వ్యవస్థాపకులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే గర్భాలయంను శుద్ధి చేసిన అర్చకస్వాములు ఆయలంలోని పరివార దేవతామూర్తుల ఆలయాలను పరిశుభ్రం చేశారు. అలాగే అలంకార మండపంలోని స్వామి వారి వాహనాలను, ఆలయ పుష్కరణిని సుంగభరిత ద్రవ్యాలతో శుభ్రం చేశారు. ఆలయం ముందు ప్రత్యేకంగా ఇనుప బ్యారికేడ్లతో క్యూలైన్లు, చలువ పందిళ్లు, రంగ వల్లులతో తీర్చిదిద్ది వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరణ పనులు చేస్తున్నారు. ప్రధాన ఆలయం, ధ్వజస్తంభం, పరివార దేవతామూర్తుల ఆలయాలకు జరిగే పుష్పాలంకరణకు దేశ, విదేశాల నుంచి పువ్వులను తీసుకువస్తున్నారు.

**శరవేగంగా సాగుతున్న పనులు**

ప్రధాన ఆలయంతో పాటు వాహన సేవలు జరిగే అన్ని దారుల్లో విద్యుత్తు దీపాల అలంకరణ పనులు శర వేగంగా పూర్తి చేస్తున్నారు. చలువ పందిర్లు ఇప్పటికే పూర్తి చేయగా విద్యుత్తు దీపాలంకరణ పనులు చేస్తున్నారు. అలాగే హారతి పాయింట్లలో వర్షం వచ్చినా తడవకుండా పటిష్టమైన పందిరిలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా తుమ్మలగుంట గ్రామానికి వెళ్లే ముఖ ద్వారం తెలుగుతల్లి విగ్రహం నుంచి శ్రీ శక్తి చాముండేశ్వరి అమ్మ వారి ఆలయం, ఉప్పరపల్లి క్రాస్ వరకు విద్యుత్తు దీపాలతో అలంకరణ పనులు చేస్తున్నారు. రహదారికి ఇరువైపులా దశావతార ప్రతిమలతో కూడిన విద్యుత్తు కటౌట్లను ఏర్పాటు చేశారు.

**కనువిందు చేయనున్న దశావతారాలు**

తుమ్మలగుంట గ్రామ శివార్లలో దశావతారాల విద్యుత్తు కటౌట్లు భక్తులకు కనువిందు చేయనున్నాయి. ఇప్పటికే విద్యుత్తు కటౌట్లను ఏర్పాటు చేయడానికి అవసరమైన ఎలక్ట్రికల్ పనులు ప్రారంభం కావడంతో రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో విద్యుత్తు వెలుగులు మద్యన దేవదేవుని దశావతారాలు భక్తులకు కనువిందు చేయనున్నట్టు సమాచారం.

## కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలి

- భక్తుల భద్రత, సౌకర్యాలు, స్వల్ప నిరీక్షణ సమయమే ప్రధాన లక్ష్యం:
- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్
- 21 రోజుల పాటు సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత – సీసీ కెమెరాలు, అంబులెన్స్‌లు, తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణాపై ప్రత్యేక దృష్టి
- పూతలపట్టు ఎమ్మెల్యే మురళి మోహన్

ప్రజాభూమి ప్రతినిధి–చిత్తూరు

కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలను ఎలాంటి అవాంతరాలు లేకుండా, భక్తుల భద్రత, సౌకర్యాలు, స్వల్ప నిరీక్షణ సమయమే ప్రధాన లక్ష్యంగా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కాణిపాకం దేవస్థానంలో బ్రహ్మోత్సవాల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో రెండో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత బ్రహ్మోత్సవాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అదనపు సీసీ కెమెరాలు, ఫైర్ సేఫ్టీ పరికరాలు, మూడు అంబులెన్స్‌లు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, లైటింగ్, రహదారులు, రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలని సూచించారు. 21 రోజుల పాటు సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ దర్శనంలో ఇబ్బందులు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. భక్తుల భద్రత కోసం ప్రస్తుతం ఉన్న 161 సీసీ కెమెరాలకు అదనంగా మరో 50 కెమెరాలు ఏర్పాటు చేసి సుమారు 210 ప్రాంతాల్లో నిఘా కొనసాగించనున్నట్లు, కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పోలీసు శాఖ పర్యవేక్షణ ఉంటుందని అధికారులు తెలిపారు. అత్యవసర పరిస్థితుల కోసం మూడు అంబులెన్స్‌లు, ప్రత్యేక ఫైర్ సేఫ్టీ వాహనం, అదనపు అగ్నిమాపక సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నారు. నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరాకు ముందస్తు ఏర్పాట్లు చేయడంతో పాటు పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ప్రతి రోజు పూజలు నిర్ణీత సమయాల్లో ప్రారంభమై ముగిసేలా ప్రణాళిక రూపొందించాలని, రాత్రి 11.30 గంటలకు కాణిపాకం నుంచి జిల్లా కేంద్రానికి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గ్రామాల నుంచి భక్తుల బృందాలకు నిబంధనల ప్రకారం తక్కువ ఛార్జీతో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసేందుకు ఆర్టీసీ అధికారులు అంగీకరించారు. వినాయక చవితి రోజున రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నట్లు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని కార్యక్రమానికి ఆహ్వానించినట్లు తెలిపారు. ప్రధాన ఉత్సవాల రోజుల్లో తగినంత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి 24 గంటల పాటు భద్రతా చర్యలు చేపడతామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. ఈ సమావేశంలో దేవస్థానం ఈఓ పెంచల కిషోర్, ఆలయ చైర్మన్ మణి నాయుడు, బోర్డు సభ్యులు, ఉభయదారుల సంఘం ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జె.వి.వి ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు భోజనాలు పంపిణీ



ప్రజా భూమి ప్రతినిధి–గూడూరు

నెల్లూరు జిల్లా గూడూరు స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వి.ఎస్.ఆర్ స్కూల్ కరస్పాండెంట్ నంది మండలం బాలకృష్ణం రాజు దాతృత్వంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వచ్చిన గర్భిణీ స్త్రీలకు ముఖ్య అతిథి డాక్టర్ షరీనా చేతుల మీదుగా భోజనాలు (వెజిటబుల్ రైస్, గుడ్డు, అరటిపండు) పంపిణీ చేయడం జరిగింది. అనంతరం డాక్టర్ షరీనా మాట్లాడుతూ జే.వి.వి వారు మా ఆసుపత్రికి 14 సంవత్సరముల నుండి గర్భిణీ స్త్రీలకు భోజనాలు పంపిణీ చేస్తున్నారని రాష్ట్రంలో ఎక్కడా ఈ విధంగా జరగలేదని ఒక్క గూడూరు జె.వి.వి వారికే సాధ్యమైందని కొనియాడారు. అంతేకాక కోవిడ్ టైం లో రక్తదానం కూడా చేశారని మరియు 120 ఆక్సిజన్ సిలిండర్లు మా ప్రభుత్వ ఆసుపత్రికి ఇచ్చారని అంతేకాకుండా ఆఫీసు సిబ్బందికి పలసరుకులు కూరగాయలు పంపిణీ చేయడం మా టెక్నికల్ స్టాఫ్ కి అవసరమైన ఎక్విప్మెంట్స్ ఇవ్వడం కూడా జరిగిందని వారి కార్యక్రమాలను ఎంత చెప్పినా తక్కువేనని అటువంటి సంస్థ మా ఆసుపత్రికి వచ్చి ఇలా సేవ చేయటం మా ఆసుపత్రి సిబ్బంది తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తెలిపారు నంది మండలం బాలకృష్ణం రాజుగారు ఎల్లవేళలా ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు ఈ కార్యక్రమంలో నాగరాజు చెంచు నారాయణ పురుషోత్తమరావు రామమోహన్ సుమన్ రెడ్డి రజనీకాంత్ సుబ్బారావు ఆనంద్ అరుణ్ కుమార్ ఇబ్రహీం రిటైర్డ్ డిప్యూటీ తహసిల్దార్ దాసు డివిడి కుమార్ శ్రీనివాస్ ఆచారి అక్కమ్మ రమణయ్య ఇబ్రహీం సాయి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు అక్రమ అరెస్టు రోజు సందర్భంగా నిరసన వ్యక్తం చేసిన టిడిపి సీనియర్ నేత జయచంద్ర నాయుడు..

ప్రజాస్వామ్యంలో చీకటి రోజని వ్యాఖ్య..ప్రజాస్వామ్యంలో చీకటి రోజు..



ప్రజా భూమి ప్రతినిధి–తొట్టంబేడు

వైసిపి ప్రభుత్వంలో ప్రతిపక్ష నేతగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబును అరెస్టు చేసిన సెప్టెంబర్ 9 సందర్భంగా శ్రీకాళహస్తిలో తొట్టంబేడు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ,టిడిపి సీనియర్ నేత జయచంద్ర నాయుడు నిరసన కార్యక్రమం చేపట్టారు.. ఈ సందర్భంగా టిడిపి నేతలతో కలిసి దీపం వెలిగించి అప్పటి చీకటి రోజును గుర్తు చేసుకున్నారు.ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో వైసీపీ ప్రభుత్వం అక్రమంగా నిర్బంధించిన ఘటనకునేటికీ మూడేళ్లు పూర్తయింది.. 2023 సెప్టెంబర్ 9న వైసిపి ప్రభుత్వం కక్షపూరితంగా చంద్రబాబును అక్రమ అరెస్టు చేసిన దానికి నిరసనగా శ్రీకాళహస్తిలో టిడిపి సీనియర్ నేత తొట్టంబేడు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జయచంద్ర నాయుడు నిరసన కార్యక్రమం చేపట్టారు.. దీపం వెలిగించి నిరసన వ్యక్తం చేశారు.. వైసిపి ప్రభుత్వం కక్షపూరితంగా నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా అర్ధరాత్రి వేళ ప్రజా నాయకుడిని అక్రమంగా నిర్బంధించిందని ఆవేదన వ్యక్తం చేశారు.. ఆంధ్రప్రదేశ్ ప్రజాస్వామ్ చరిత్రలోనే ఈరోజు అత్యంత చీకటి రోజు అని ఆవేదన వ్యక్తం చేశారు.. చంద్రబాబు అరెస్టు టిడిపి శ్రేణులతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ ఒక చేదు జ్ఞాపకంగా మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.. అనంతర పరిణామాల నేపథ్యంలో వైసిపి ప్రభుత్వాన్ని ప్రజలు ఓడించే 11 స్థానాలకు పరిమితం చేశానని గుర్తు చేశారు.. ఈ కార్యక్రమంలో జయ చంద్ర నాయుడుతోపాటు సీనియర్ నాయకులు సుధాకర్ యాదవ్ ,కంచనపల్లి మోహన్ ,ఉమాపతి యాదవ్ ,సూర్య , కార్యకర్త తదితరులు పాల్గొన్నారు

## మీడియా ప్రతినిధిపై దాడి దురదృష్టకరం - దండి నరేంద్ర

- మీడియా ప్రతినిధుల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత
- దాడులు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు



ప్రజా భూమి ప్రతినిధి–శ్రీకాళహస్తి టౌన్

శ్రీకాళహస్తిలో ప్రింట్ మీడియా పున్నమి న్యూస్‌కు చెందిన మీడియా ప్రతినిధి శివ పై వ్యక్తిగత, ఆస్తి వివాదాల నేపథ్యంలో ఆయన బంధువుల కుటుంబ సభ్యులు దాడి చేసిన ఘటన తెలిసి తీవ్రంగా ఖండిస్తున్నాను. సమాజానికి నిరంతరం సేవలందిస్తూ, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే మీడియా ప్రతినిధుల భద్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. ఏ వివాదమైనా పెద్దల సమక్షంలో చర్చించి సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలి కానీ, దాడులకు పాల్పడటం ఏమాత్రం సమర్థనీయం కాదు. ఈ ఘటన నేపథ్యంలో శ్రీకాళహస్తి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిని మర్యాదపూర్వకంగా సందర్శించి, శివ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నాను. అనంతరం మీడియా ప్రతినిధిపై దాడి దురదృష్టకరం – దండి నరేంద్రఆయన భార్య, కుమారుడితో మాట్లాడి వారికి ధైర్యం చెప్పి, మా నైతిక మద్దతును తెలియజేశాను. శివ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. మీడియా, న్యాయవాదులు, పోలీసులు, వైద్యులు, ప్రభుత్వ-ప్రైవేట్ ఉద్యోగులు, వ్యాపారులు, ఉపాధ్యాయులు, పండితులు వంటి సమాజానికి విలువైన సేవలందించే ప్రతి వర్గానికీ రక్షణ, గౌరవం కల్పించడం ద్వారా మాత్రమే నైతిక విలువలతో కూడిన మెరుగైన సమాజాన్ని నిర్మించగలం. మీడియా ప్రతినిధులపై దాడులను జనసేన పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించదు, అంగీకరించదు.

## బంగారుపాళ్యంలో ఘనంగా శ్రీకృష్ణుడి ఊరేగింపు - కృష్ణాష్టమి వేడుకలు ముగింపు






ప్రజా భూమి ప్రతినిధి–బంగారుపాళ్యం

త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి – ఇందూ జ్ఞాన వేదిక బంగారుపాళ్యం కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా ముగిశాయి. సెప్టెంబర్ 4న శుక్రవారం బంగారుపాళ్యం రాజావీధి సెంటర్ లో వేదిక నిర్మించి శ్రీకృష్ణుడి ప్రతిమను కొలువు తీర్చి, ప్రతిరోజు ఉదయం, సాయంత్రం నిత్య పూజలు, భగవద్గీత శ్లోక పారాయణం నిర్వహించారు. 6వ రోజైన బుధవారం శ్రీకృష్ణ ప్రతిమ ఊరేగింపు కార్యక్రమాన్ని మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించారు. రాజావీధి వేదిక నుండి ఓటికే రోడ్, పోస్టాఫీస్ వీధి, తగ్గువారిపల్లి, మేదర వీధి, నెహ్రూ వీధి మీదుగా తిరిగి రాజావీధి వరకు ఊరేగింపు జరిగింది. ముఖ్య అతిథులుగా మాజీ జెడ్పీటీసీ చైర్మన్ కుమార్ రాజా, ఎంఈఓ పి.నాగేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ సతీమణి గోమతి, టీడీపీ నాయకుడు రాధా కృష్ణ, జమీందార్ దానేష్ విచ్చేసి పూజలు చేసి పల్లకీ సేవను ప్రారంభించారు. సాయంత్రం 6 గంటలకు పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే మురళీ మోహన్ విచ్చేసి పల్లకీ సేవలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు పి.ధనుంజయ, డి.బాలాజీ, విమలమ్మ, వాణిశ్రీ, లత, చాముండేశ్వరి, చిట్టెమ్మ, సాయి, చటర్జీ, హర్షవర్ధన్, హేమంత్, మాధవ రెడ్డి, రామతులసి, భానుమతి, రెడ్డెమ్మ, శాంతమ్మ, భాస్కర్, అశోక్ బాబు, ఝాన్సీ, కిరణ్, మునిరత్నం, ఉదయ్, జ్యోతి, రేఖ, కళ్యాణి, గౌతమి తదితరులు పాల్గొన్నారు. కుప్పం, వి.కోట, పలమనేరు ప్రాంతాల నుండి సేవాసమితి సభ్యులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

### బంగారుపాళ్యం పట్టణంలో

## ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించిన బంగారుపాళ్యం పోలీసులు





ప్రజా భూమి ప్రతినిధి–బంగారుపాళ్యం

"సురక్షిత చిత్తూరు – మీ భద్రత మా బాధ్యత" కార్యక్రమంలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించిన ఇన్‌స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు గారు, మరియు పోలీసు సిబ్బంది జిల్లా ఎస్పీ శ్రీ తుషార్ డూడి, ఐపీఎస్ ఆదేశాల మేరకు "సురక్షిత చిత్తూరు – మీ భద్రత మా బాధ్యత" కార్యక్రమంలో భాగంగా బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని బంగారుపాళ్యం ప్రాంతంలో బంగారుపాళ్యం ఇన్‌స్పెక్టర్ శ్రీ కత్తి శ్రీనివాసులు గారు, మరియు వారి సిబ్బంది ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించి ప్రజలకు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ, ప్రజల భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. నేరాల నివారణలో పోలీసులతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో కీలకమని పేర్కొన్నారు. తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు, గుర్తు తెలియని వస్తువులు లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాలు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్–112కు సమాచారం అందించాలని సూచించారు.

అలాగే మహిళలు, చిన్నారుల భద్రతకు సంబంధించిన అంశాలపై అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాల బారిన పడకుండా అపరిచితుల ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు మరియు బ్యాంకు వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీటుబెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, మొబైల్ ఫోన్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలని సూచించారు. ప్రజల సహకారంతోనే నేరాలను సమర్థవంతంగా అరికట్టడంతో పాటు, పోలీసు–ప్రజల మధ్య సాన్నిహిత్యాన్ని మరింత బలోపేతం చేసి "సురక్షిత చిత్తూరు – మీ భద్రత మా బాధ్యత" లక్ష్యాన్ని విజయవంతంగా అమలు చేయగలమని అధికారులు తెలిపారు.

## మిట్టూరు జడ్పీ హైస్కూలును ఆకస్మికంగా పరిశీలించిన జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు.



ప్రజా భూమి ప్రతినిధి–రామచంద్రాపురం

రామచంద్రపురంమండలంలోని కమ్మ కండ్రిగ పంచాయతీ మిట్టూరులో ఉన్న చేకూరు నాగమ నాయుడు, ఎర్రమ్మల జిల్లా పరిషత్ ఉన్నత ప్లస్ వన్ పాఠశాలను ఉమ్మడి చిత్తూరు జిల్లా జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రవికుమార్ నాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధవారం జిల్లా ఉన్నత పాఠశాలలో ప్రహరీ గోడ నిర్మాణం, అదనపు తరగతి గదుల నిర్మాణానికి పరిశీలించారు. చేకూరు నాగమ నాయుడు ఎర్రమ్మల జిల్లా పరిషత్ ఉన్నత ప్లస్ వన్ పాఠశాలలో ఇంటర్ చదువుకునేందుకు సీఈసీతోపాటు ఎంపీసీ బైపీసీ గ్రూపులను కూడా నిర్వహించేందుకు ఇంటర్మీడియట్ బోర్డు నుండి అనుమతులు ఇప్పించాలని స్థానిక ప్రజలు కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఇంటర్ బోర్డు అధికారులకు తెలియజేస్తామన్నారు. పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి జిల్లా పరిషత్ నిధుల నుండి రూ.5 లక్షల రూపాయలు మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను, తరగతి గదులను పరిశీలించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులకు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేటు పాఠశాలల కన్నా విద్యార్థులకు మెరుగైన నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పులి రాంసింగ్, ఎంఈఓ వి మార్కండేయనాయుడు, ప్రధానోపాధ్యాయురాలు సుజాత, గ్రామస్తులు సుబ్రహ్మణ్యం నాయుడు, జగదీష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## నవోదయలో సువర్ణ అవకాశం : జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



ప్రజాభూమి ప్రతినిధి–చిత్తూరు

మదనపల్లి జిల్లాలో ఉన్న వలసపల్లి నందలి పి. యం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయలో 9, 11 తరగతుల్లో చేరడానికి 10-04-2027న జరగనున్న ప్రవేశ పరీక్షకు ఆన్లైన్ ద్వారా అప్లై చేసుకోవడానికి సెప్టెంబరు 30వ తేదీ చివరి తేదీ అని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌బుధవారం స్థానిక కలెక్టరేట్లోని ఆయన ఛాంబర్ నందు గోడ పత్రికను విడుదల చేశారు సారాంశం ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 2026-27 విద్యాసంవత్సరంలో ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 8,10 తరగతులు చదువుతూ ఉండాలని తెలియజేశారు. జిల్లాలోని అర్హులైన విద్యార్థులందరూ ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అత్యుత్తమమైన ఉచిత విద్యను పొందాలని, తల్లిదండ్రులు తమ పిల్లలకు అత్యుత్తమ విద్య అందించేందుకు ఇది ఒక గొప్ప అవకాశం అని తెలియజేశారు. ఈ సదవకాశాన్ని ప్రతి ఒక్క విద్యార్థి అందిపుచ్చుకోవాలని కలెక్టర్ ప్రకటన రూపంలో తెలిపారు

## జూలియన్ రాజును పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష

ప్రజాభూమి ప్రతినిధి–రేణిగుంట



రేణిగుంటలోని ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజును శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. గత కొన్ని రోజులుగా అనా రోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన జూలియన్ రాజు ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసు కుంటున్నారు. విషయం తెలుసుకున్న బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షిస్తూ జూలియన్ రాజుకు ధైర్యం చెప్పారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని భరోసా కల్పిం చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జడ్పీటీసీ సంధ్య, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్, మాజీ సర్పంచ్ నగేషం, మండల కోఆప్షన్ సభ్యుడు హుస్సేన్ సాహెబ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# నిజాయితీని అరాచకం చెరబట్టి మూడేళ్ళు

-డా.యం.ఉమేష్ రావు,రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి



**ప్రజాభూమి ప్రతినిధి-శ్రీ కాళహస్తి టౌన్**

ఆధునిక రాజకీయాలలో విలువలకు కట్టుబడి ఉంటూనే, ధర్మ పరిరక్షణే లక్ష్యంగా చేసుకొని గత ఐదు దశాబ్దాలుగా ప్రజాసేవ చేస్తున్న సియం చంద్రబాబు నాయుడు నిజాయితీని జగన్ రెడ్డి తాలూకా అరాచకం చెరబట్టి మూడేళ్ళయ్యిందని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు ఆవేదన వ్యక్తం చేశారు.

**రాజారెడ్డి రాజ్యాంగం అరాచక చర్య**

నాటి వైసిపి పాలనాకాలంలో ప్రజలను పట్టి పీడిస్తున్న జగన్ రెడ్డి యొక్క సైకో బృందాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి తరిమి వేయడానికి ప్రజలను చైతన్యవంతం చేస్తూ ముందుకు వెళుతున్న నాటి ప్రతిపక్ష నాయకుడు,నేటి సియం చంద్రబాబు నాయుడు ని ప్రజా క్షేత్రంలో లేకుండా చేయాలన్న కుట్రతో జగన్ రెడ్డి,తన తాత రాజారెడ్డి రాజ్యాంగాన్ని అనుసరించి నాడు అక్రమ కేసులు బనాయించి,జైలుకు పంపిన దుర్ఘటన జరిగి మూడేళ్ళు దాటిన సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం శ్రీకాళహస్తి పట్టణం, స్థానిక పూసల వీధి కూడలిలో రాజారెడ్డి రాజ్యాంగం బ్యానర్ ను తగలబెట్టి తమ ఆవేదనను వ్యక్తపరిచారు.జగన్ రెడ్డి దోపిడీకి అడ్డుపడ్డాడన్న కక్షతోతన తండ్రి వైయస్సార్ అధికారాన్ని అడ్డు పెట్టుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న సహజ వనరులని అడ్డగోలుగా దోచుకున్న జగన్ రెడ్డి వ్యవహారాన్ని బయటి ప్రపంచానికి తెలియ పరచి,అతనిని కోర్టు బోను ఎక్కించిన వ్యవహారానికి తెలుగుదేశం పార్టీ మరియు చంద్రబాబు నాయుడు ప్రధాన సూత్రదారులు అని కక్ష పెంచుకున్న జగన్ రెడ్డి, చంద్రబాబు నాయుడు గారిని కూడా ఒక్క రోజైనా జైలులో పెట్టాలన్న కుట్ర చేసి, అభూత కల్పనలతో, వ్యవస్థలను నిర్వీర్యం చేసి, అత్యంత భద్రతా ప్రమాణాలతో కూడిన జెడ్ ప్లస్ సెక్యూరిటీ కలిగిన అతికొద్ది మందిలో ఒకరైన నాటి ప్రతిపక్ష నేత, నిజాయితీకి నిలువుటద్దంగా భారతదేశ చరిత్రలో కీర్తిని గడించిన చంద్రబాబు నాయుడు ని అర్ధరాత్రి వేళ సుమారు ఐదు వందల మంది పోలీసు బలగాలతో దాడి చేసి,తప్పుడు విధానంలో అరెస్టు చేసిన సంఘటన రాష్ట్ర చరిత్రలో దుర్దినంగా నిలిచిందని పేర్కొన్నారు.

నిజం గెలిచింది.ఒక్క తెలుగు వారే కాకుండా,యావత్ ప్రపంచలోని కోట్లాది మంది ప్రజల హృదయాలను గెలుచుకున్న సంస్కరణ వాది,దార్శనికుడు అయిన చంద్రబాబు నాయుడు ని ఒక ఊహాజనితమైన ఆరోపణల ఆధారంగా,చట్టవిరుద్ధంగా అరెస్టు చేసినప్పటికీ, ఆయన అరెస్టు తర్వాత, రాష్ట్ర ప్రజలతో పాటు దేశవిదేశాల్లోని తెలుగు వారందరూ ఆయనకు మద్దతుగా తరలివచ్చారు. దేవుని సంకల్పం ప్రకారం ఆయన నిర్దోషిగా నిరూపించబడ్డారు,చివరికి నిజమే గెలిచిందని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు విశ్వబ్రాహ్మణ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ డా.జి.దశరథాచారి,వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి,శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ నాయుడు,బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు,తంగేళ్ళ పాలెం పిఏసియస్ ఛైర్మన్ బీమాల భాస్కర్, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్,శ్రీకాళహస్తి పట్టణ సహకార బ్యాంకు మాజీ ఛైర్మన్ డి.వి.నారాయణ, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్,తొట్టంబేడు మండల ప్రధాన కార్యదర్శి చిల్లకూరు మణి,తిరుపతి పార్లమెంటు నాయకులు పూల శేఖర్, శంకరయ్య, నూర్ మొహమ్మద్,బీమాల చంద్రబాబు,తుపాకుల ప్రసాద్,సులేమాన్, సుబ్రహ్మణ్యం,బిజెపి శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షుడు హరీష్ రెడ్డి,ఢిల్లీ,శేషు,గోపీ, జనసేన నాయకుడు సలీం తదితరులు పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధి గుర్తింపు సర్వే





**ప్రజా భూమి ప్రతినిధి-తిరుపతి**

కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కోసం ఈ నెల 11వ తేదీ నుండి 24వ తేదీ వరకు 14 రోజులపాటు తిరుపతి జిల్లాలో జరిగే ఇంటింటి సర్వే కార్యక్రమ విజయవంతనికి కృషి చేయాలని "లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్" కార్యక్రమం పై వైద్యాధికారుల శిక్షణా కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ వి బాలకృష్ణ నాయక్ తెలిపారు.ఈ శిక్షణా కార్యక్రమంలో ఫెసిలిటేటర్ శ్రీ సతీష్, జోనల్ కోఆర్డినేటర్, డి ఎఫ్ ఐ టి మాట్లాడుతూ కుష్టు వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించి పూర్తి చికిత్స తీసుకున్నట్లయితే ఈ వ్యాధి వల్ల కలిగే అంగవైకల్యాన్ని నివారించవచ్చని, చర్మంపై స్పర్శ లేని మచ్చలు, ముఖము, చెవులు, ఎద, వీపు మీద నొప్పి లేని బుడిపెలు, కనురెప్పలు మూతపడకపోవడం, అరిచేతులు అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం, చేతి వేళ్ళు కాలి వేళ్ళు వంకర్లుగా ఉండి అంగవైకల్యం రావడం మొదలగు లక్షణాలు ఉన్నవాళ్లు సర్వే బృందము ఇంటికి వచ్చినప్పుడు వారి దృష్టికి తీసుకువెళ్లడం లేదా దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, టీబీ, ఎయిడ్స్ నియంత్రణ అధికారిని డాక్టర్ శైలజ, డీఎన్ఎంఓ డాక్టర్ రాజా, లెప్రసీ వార్డ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహమ్మద్ రఫీక్, హెచ్ ఇ ఓ బాబు నెహ్రూ రెడ్డి, డి పి ఎం ఓ లు సుధాకర్ నాయక్, ముని సుబ్బరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## షికారుల సమస్యలను అడిగి తెలుసుకున్న కాంగ్రెస్ నేతలు



**ప్రజా భూమి ప్రతినిధి-శ్రీకాళహస్తి టౌన్**

శ్రీకాళహస్తి పట్టణంలోని సాయిరాం హాల్ సర్కిల్ వద్ద నివాసం ఉంటున్న షికారులను కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారి జీవన పరిస్థితులు, ఓటు హక్కు, ఇంటి స్థలాలకు సంబంధించిన సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.తమకు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, పాన్ కార్డు వంటి అన్ని గుర్తింపు పత్రాలు ఉన్నాయని షికారులు (నక్కల )తెలిపారు. అయితే ఇటీవల జరిగిన సర్ ప్రక్రియలో కొందరి పేర్లలో మార్పులు రావడంతో ఓటు హక్కు లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.అదేవిధంగా దాదాపు 45 సంవత్సరాలుగా శ్రీకాళహస్తి పట్టణంలోనే నివాసం ఉంటున్నామని, తమకు సొంతంగా ఇల్లు లేదా ఇంటి స్థలం లేదని, ప్రస్తుతం రోడ్డుపైనే జీవనం కొనసాగించాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు.మొత్తం 10 కుటుంబాలకు చెందిన 26 మందికి ఓటు హక్కు ఉందని వారు వివరించారు. వీరిలో ఒకరికి ఊరందూరు జగనన్న కాలనీలో ఇల్లు, మరొకరికి చంద్రన్న కాలనీలో అపార్ట్‌మెంట్ లభించిందని తెలిపారు. మిగిలిన 24 మందికి కూడా ఇంటి స్థలాలు, అదేవిధంగా వీరిలో కొందరికి పెన్షన్లు కూడా కల్పించాలని కాంగ్రెస్ నాయకులను కోరారు.వారి సమస్యలను విన్న కాంగ్రెస్ నాయకులు, ఈ విషయాన్ని తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలగురువం బాబు దృష్టికి, అలాగే శ్రీకాళహస్తి నియోజకవర్గం సమన్వయకర్త తలపా దామోదర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ షేక్ కరీముల్లా, జిల్లా మైనారిటీ సెల్ జనరల్ సెక్రటరీ కె.ప్రేమ సుందరం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత షేక్ సర్దార్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మొగిలి శ్వర స్వామి దేవస్థానం నందు హుండీ లెక్కింపు

### శ్రీ మొగిలీశ్వర స్వామి దేవస్థానంనందు హుండీ లెక్కింపు ద్వారా ఆదాయము రూ5,67,157



**ప్రజా భూమి ప్రతినిధి-బంగారుపాళ్యం**

చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం మొగిలి గ్రామంలో వెలసిన శ్రీ స్వయంభు మొగిలీశ్వర స్వామి దేవస్థానం నందు హుండీలు లెక్కింపు కార్యక్రమం ఆలయ వంశపారంపర్య ధర్మకర్త.ఎం బి.విజయకుమార్ ఆధ్వర్యంలో, చిత్తూరు దేవాదాయశాఖ తనిఖీదారు ఎస్. శ్వేత మరియు కార్యనిర్వహణాధికారి ఏ.మునిరాజ పర్యవేక్షణలో 110 రోజులుకు గాను ఆలయ హుండీలు ద్వారా రూ 4,74,049.00లు అన్నదానం హుండీలు ద్వారా రూ 93,108=00లు మొత్తం కలిసి రూ 5,67,157.00లు ఆదాయం వచ్చినది హుండీ లెక్కింపు కార్యక్రమమునకు భ్రమరాంబికా సేవాసమితి పుంగనూరు మరియు భక్తులు ప్రసాద్ నాయుడు, సోమశేఖర్ నాయుడు , ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రేణిగుంటలో ఘనంగా తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంకు 6వ శాఖ ప్రారంభం



**ప్రజా భూమి ప్రతినిధి-రేణిగుంట**

రేణిగుంటలో నూతనంగా ఏర్పాటు చేసిన తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంకు 6వ శాఖను బుధవారం ఘనంగా ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, మేయర్ శిరీష తదితరులు పాల్గొన్నారు .ఈ సందర్భంగా బ్యాంకు చైర్మన్ జయచంద్రారెడ్డి వారికి సాదర స్వాగతం పలికారు. శాఖ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి బ్యాంకును పరిశీలించి, ఖాతాదారులకు అందుతున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన స్వయంగా బ్యాంకులో ఖాతాదారుడిగా చేరారు.రేణిగుంట ప్రజలు, వ్యాపారులకు బ్యాంకు సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయమని మధుసూదన్‌రెడ్డి అన్నారు. స్థానికులు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గతంలో చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని శాఖ ఏర్పాటు చేసినందుకు చైర్మన్ జయచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో కో-ఆపరేటివ్ బ్యాంకు ఎండీ శివకుమార్‌రెడ్డి, మేనేజర్ వినోద్, బ్రహ్మానందం రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ సిద్ధగుంట సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్, ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జడ్పీటీసీ సంధ్యతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లోకేష్ సమక్షంలో ఎన్ఆర్ఐ ఆర్గనైజింగ్ సెక్రటరీగా వాకాడు వాసి బాలసుబ్రహ్మణ్యం ప్రమాణ స్వీకారం




**ప్రజాభూమి ప్రతినిధి-వాకాడు**

తెలుగుదేశం పార్టీ ఎన్ఆర్ఐ ఆర్గనైజింగ్ సెక్రటరీగా వాకాడు మండలానికి చెందిన అన్నమేటి బాలసుబ్రహ్మణ్యం అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు.విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వాకాడు మండలానికి చెందిన టిడిపి మైనార్టీ నాయకులు ఎస్.కె. రహమతుల్లా, అమీర్ బాషా, షేక్ బాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరై, నూతనంగా ఎన్ఆర్ఐ ఆర్గనైజింగ్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించిన అన్నమేటి బాలసుబ్రహ్మణ్యంను ఘనంగా అభినందించారు.ఆయనకు పార్టీ పరంగా మరింత ఉన్నత స్థానం దక్కాలని, పార్టీ అభివృద్ధికి విశేష సేవలు అందించాలని ఆకాంక్షించారు.అనంతరం మైనార్టీ నాయకుడు ఎస్.కె. రహమతుల్లా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం పార్టీ అభివృద్ధి, మైనార్టీల సంక్షేమం, స్థానిక రాజకీయ పరిస్థితులు తదితర అంశాలపై చర్చించినట్లు సమాచారం.వాకాడు ప్రాంతానికి చెందిన వ్యక్తి టిడిపి ఎన్ఆర్ఐ విభాగంలో కీలకమైన ఆర్గనైజింగ్ సెక్రటరీ పదవిని చేపట్టడం పట్ల మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.



## నిజం గెలిచింది కార్యక్రమాన్ని నిర్వహించిన ఎమ్మెల్యే పులివర్తి నాని



**ప్రజా భూమి ప్రతినిధి-తిరుపతి రూరల్**

తిరుపతి రూరల్ మండలం చంద్రగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో "నిజం గెలిచింది" కార్యక్రమాన్ని నిర్వహించిన ఎమ్మెల్యే పులివర్తి నాని నాయకులతో కలసి కొవ్వొత్తి చేతపట్టి చంద్రబాబు నాయుడు గారి పట్ల సంఘీభావాన్ని చాటుకున్నారు. ప్రజాస్వామ్య విలువలు న్యాయం ధర్మం ఎప్పటికీ గెలుస్తూనే ఉంటుందని అందుకు నిదర్శనం ఇదేనని ఎమ్మెల్యే తెలిపారు.మూడేళ్ల క్రితం గత వైసిపి పాలకులు ఇదే రోజు చంద్రబాబు నాయుడుని అక్రమ అరెస్టు చేసి నిర్బంధించారు.అప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగుజాతి మొత్తం 53 రోజులపాటు నిజం గెలవాలి అంటూ చంద్రబాబు నాయుడుకి అండగా నిలిచింది.నాటి చీకటి రోజులను గుర్తు చేస్తూ ... నిజం గెలవాలి అన్న నినాదంతో 53 కొవ్వొత్తులను వెలిగించి చంద్రబాబు నాయుడు కి మేమున్నామంటూ నినదించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

### చంద్రబాబు అక్రమ అరెస్టైన రోజును

## బ్లాక్ డే గా పాటించిన చిత్తూరు పార్లమెంటు సభ్యులు.



**ప్రజా భూమి ప్రతినిధి-చిత్తూరు**

ఇప్పుడున్న పరిస్థితితుల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చాలా అవసరమని ఉద్ఘాటించారు టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు..నవ్యంధ్రప్రదేశ్ సాధన కోసం అహర్నిశలు శ్రమించడం చంద్రబాబు పాలనాదక్షతకు నిదర్శనమని కొనియాడారు.టీడీపీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి అక్రమ అరెస్టుకు ళ2026 సెప్టెంబర్ 9ది నాటికి మూడేళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ (ఒఖా) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వినూత్న కార్యక్రమాలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో.. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ.., ఆ రోజుకు నిరసనగా బుధవారం బ్లాక్ డే పాటించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసు పేరుతో 2023 సెప్టెంబర్ 9న చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేయగా, ఆయన 53 రోజుల పాటు రాజమండ్రి సెంట్రల్ జైలులో నిర్బంధాన్ని ఎదుర్కొన్నారని గుర్తుచేసుకున్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, "రాజకీయ కక్ష సాధింపుల కోసమే నాడు చంద్రబాబును అక్రమ కేసులో నిర్బంధించారని వైకాపా తీరును తప్పుపట్టారు . నాడు తెలుగుజాతి మొత్తం 'నిజం గెలవాలి' అంటూ మద్దతుగా నిలిచిందనీ, ఇప్పుడు న్యాయస్థానాల్లో నిజం కూడా గెలిచిందనీ, అక్రమ కేసులన్నీ కొట్టుకుపోయాయని ఆయన తెలియజేశారు.ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న చంద్రబాబు నాయుడుకు మనమందరం అండగా నిలవాలని, ఆయన నాయకత్వాన్ని బలపరచాలని ఈ సందర్భంగా చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు కూటమి నాయకులకు కార్యకర్తలు, ప్రజలకు పిలుపునిచ్చారు.

# నిత్యావసర ధరల మంటల్లో సామాన్యుడి కుటుంబం!

### ఉప్పు నుంచి వంట నూనె వరకు.. పాలు నుంచి పెట్రోల్, డీజిల్, గ్యాస్ వరకు ధరల పెరుగుదలపై సిపిఐ ఆగ్రహం



**ప్రజా భూమి ప్రతినిధి-శ్రీ కాళహస్తి టౌన్**

సామాన్య ప్రజలపై నిత్యావసర వస్తువుల ధరల భారాన్ని మోపుతూ వారి కుటుంబ బడ్జెట్‌ను చిన్నాభిన్నం చేస్తున్న ప్రభుత్వ విధానాలకు నిరసనగా సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఈరోజు శ్రీకాళహస్తి పట్టణ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం ఎమ్మార్వో గారికి వినతి పత్రం అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా సిపిఐ రూరల్ మండల కార్యదర్శి మించల శివకుమార్, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి కోగిలి. మునిచందు మాట్లాడుతూ "సామాన్యుడి జేబులో డబ్బులు పెరగడం లేదు.. కానీ మార్కెట్‌లో ప్రతి వస్తువు ధర మాత్రం పెరుగుతూనే ఉంది. రోజూ కష్టపడి సంపాదించే కుటుంబం నిత్యావసర సరుకులు కొనడానికి వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది.ఉప్పు కొనాలన్నా ఆలోచించాలి.. పప్పు కొనాలన్నా ఆలోచించాలి.. వంట నూనె కొనాలన్నా ఆలోచించాలి.. పాలు, కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుంటే సామాన్య కుటుంబం ఎలా బతకాలి?" అని ప్రశ్నించారు.

ఒకవైపు ఆదాయం పెరగకపోగా.. మరోవైపు ప్రతి నెలా ఇంటి ఖర్చులు పెరుగుతున్నాయి. మార్కెట్‌కు వెళ్లిన ప్రతిసారి చేతిలో ఉన్న డబ్బుకు వచ్చే సరుకులు తగ్గిపోతున్నాయి. ఇది కేవలం ధరల పెరుగుదల కాదు.. సామాన్య ప్రజల జీవనంపై పెరుగుతున్న ఆర్థిక భారం.రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే నియంత్రించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను కూడా తక్షణమే తగ్గించాలని కోరారు. పెట్రోల్, డీజిల్ ధరల ప్రభావం రవాణా ఖర్చులపై పడటంతో చివరకు ఆ భారం కూడా సామాన్యుడి నెత్తినే పడుతోందని అన్నారు."ప్రజలు ఇప్పటికే ధరల భారంతో సతమతమవుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి ధరలను నియంత్రించాలి. ప్రజల సమస్యలపై ప్రభుత్వం సరైన రీతిలో స్పందించాలి. లేనిపక్షంలో ప్రజల పక్షాన రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపట్టడానికి సిపిఐ ఎక్కడా వెనుకాడదు" అని నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షురాలు చారులత, గంగాభవాని, మునెమ్మ, గంగమ్మ, గీత, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

తిరుపతి, చిత్తూరు 9

గురువారం 10 సెప్టెంబరు 2026


# మాతృత్వానికి భరోసాగా నవశక్తి సేవా సంస్థ సేవలు..చెన్నూరులో ఘనంగా పోషకాహార పంపిణీ

- ఏడాది పాటు ప్రతినెలా 9వ తేదీన గర్భిణులకు పౌష్టికాహారం: నవశక్తి సేవా సంస్థ కీలక నిర్ణయం
- చెన్నూరు ఆసుపత్రి అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తాం: టీడీపీ సీనియర్ నాయకులు ఎల్లసిరి శ్రీనివాసులు రెడ్డి



ప్రజా భూమి ప్రతినిధి-గూడూరు

మాతృత్వపు మధురిమలను ఆస్వాదించే క్రమంలో గర్భిణులు ఎలాంటి పోషకాహార లోపంతో బాధపడకూడదన్న సత్సంకల్పంతో నవశక్తి సేవా సంస్థ ముందుకు సాగుతోంది. నెల్లూరు జిల్లా గూడూరు మండలం చెన్నూరు లోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణీలకు సంస్థ ఆధ్వర్యంలో పౌష్టికాహార భోజనాన్ని ఘనంగా పంపిణీ చేశారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఎల్లసిరి శ్రీనివాసులు రెడ్డి, శ్రీకిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మాజీ సర్పంచ్ తోడేటి శివకుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేసి, గర్భిణులకు స్వయంగా తమ చేతుల మీదుగా భోజనాన్ని అందించారు.

**సంస్థ సేవలు అభినందనీయం**

ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకులు ఎల్లసిరి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ, సమాజంలో గర్భిణీల ఆరోగ్యం కోసం నవశక్తి సేవా సంస్థ చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో స్ఫూర్తి దాయకమని కొనియాడారు. భవిష్యత్తులో సంస్థ నిర్వహించే సేవా కార్యకలాపాలకు తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీనిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సహకారంతో చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధికి లేదా వైద్య సేవల పరంగా ఏవైనా అవసరాలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని వైద్య సిబ్బందికి సూచించారు.

**ఏడాది పొడవునా ప్రతినెలా 9న సేవా కార్యక్రమం**

గర్భిణీల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నవశక్తి సేవా సంస్థ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. రాబోయే ఏడాది పాటు ప్రతినెలా 9వ తేదీన చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి వైద్య పరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణీ స్త్రీలందరికీ పౌష్టికాహార భోజనం అందించనున్నట్లు ప్రకటించింది. ఈ కార్యక్రమానికి తమ విలువైన సమయాన్ని కేటాయించి హాజరైన ముఖ్య అతిథులకు, గర్భిణులకు భోజనాలు వడ్డించి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ సంస్థ నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ సత్కార్యానికి అడుగడుగునా సహకరిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

# చంద్రబాబుకు అండగా 53 కొవ్వొత్తులు..

## వాకాడులో ఘనంగా 'నిజం గెలిచింది' కార్యక్రమం





ప్రజా భూమి ప్రతినిధి - వాకాడు

ప్రజాస్వామ్య విలువలు, న్యాయం, ధర్మం ఎప్పటికీ గెలుస్తూనే ఉంటాయని చాటి చెప్పేందుకు వాకాడు మండలంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో 'నిజం గెలిచింది' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.వాకాడు మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు సన్నారెడ్డి విజయశేఖర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు చేతుల్లో కొవ్వొత్తులు పట్టుకుని మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడుకు సంఘీభావం తెలిపారు. 53 కొవ్వొత్తులను వెలిగిస్తూ నాటి పరిణామాలను గుర్తు చేసుకున్నారు. 'నిజం గెలవాలి.. నిజం గెలిచింది' అంటూ నినాదాలు చేస్తూ చంద్రబాబు నాయుడుకు తామంతా అండగా ఉన్నామనే సందేశాన్ని చాటారు.

**53 రోజుల పోరాటానికి గుర్తుగా 53 కొవ్వొత్తులు**

ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో న్యాయం, ధర్మం, సత్యం ఎప్పటికైనా విజయం సాధిస్తాయని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయుడిని అరెస్టు చేసి నిర్బంధించిన రోజులను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.నాడు చంద్రబాబు నాయుడికి మద్దతుగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగుజాతి మొత్తం 'నిజం గెలవాలి' అనే నినాదంతో 53 రోజుల పాటు సంఘీభావం తెలిపిందని పేర్కొన్నారు. ఆ చీకటి రోజులను గుర్తు చేసుకుంటూ వాకాడులో 53 కొవ్వొత్తులను వెలిగించి, నిజం, న్యాయం, ధర్మం పట్ల తమ విశ్వాసాన్ని చాటుకున్నామని తెలిపారు.చంద్రబాబు నాయుడిపై జరిగిన పరిణామాల సమయంలో పార్టీ శ్రేణులు, అభిమానులు ఎంతో ధైర్యంగా ఆయనకు అండగా నిలిచారని నాయకులు గుర్తుచేశారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సత్యం, న్యాయం చివరకు విజయం సాధిస్తాయని పేర్కొన్నారు.

**వాకాడులో టిడిపి శ్రేణుల సంఘీభావం**

టిడిపి నాయకుడు వేము దినకర్ బాబు మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు ప్రజాస్వామ్య పరిరక్షణకు, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేసిన నాయకుడని అన్నారు.నాడు ఆయనకు అండగా నిలిచిన పార్టీ శ్రేణుల ఐక్యతను మరోసారి చాటేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. టిడిపి కార్యకర్తలు ఎల్లప్పుడూ పార్టీ నాయకత్వానికి అండగా ఉంటారని పేర్కొన్నారు.కార్యక్రమంలో టిడిపి నాయకులు అజిత్ రెడ్డి, నందగోపాల్ రెడ్డి, హర్ష,టిడిపి మహిళా నాయకులు కవిత, బత్తిన ప్రమీల, తానా రమతో పాటు పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా వాకాడు మండలంలో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

# ఏర్పేడు వెలుగులో అసలేం జరుగుతోంది?

- లోన్ల మంజూరులో పారదర్శకత ఎక్కడ..?
- నచ్చునేరు అంకమ్మ సంఘం తీర్మానాలపై ప్రశ్నల వర్షం
- 20 ఏళ్లుగా పొదుపు చేస్తున్న మహిళల హక్కులపై ఎవరి పెత్తనం?
- ఏపీఎం, సీసీ సమాధానం చెప్పాల్సిందేనా..?
- ఉన్నతాధికారుల విచారణకు డిమాండ్.

ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.

తిరుపతి జిల్లా ఏర్పేడు మండలంలోని వెలుగు సంఘాల వ్యవహారశైలిపై పలు ప్రశ్నలు, ఆరోపణలు తెరపైకి వస్తున్నాయి. ముఖ్యంగా రుణాల మంజూరు, సంఘాల తీర్మానాలు, సభ్యుల హక్కులు, రికార్డుల నిర్వహణ విషయంలో పారదర్శకతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సభ్యులు తమ సంఘానికి సంబంధించిన లెక్కలు, తీర్మానాలు, రుణాల వివరాలు అడిగితే సమాధానం చెప్పాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై లేదా? అన్న ప్రశ్నలు ఇప్పుడు మండలంలో చర్చనీయాంశంగా మారాయి.ఏపీఎం, సీసీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇప్పటివరకు మండలంలో ఎన్ని సంఘాలకు రుణాలు మంజూరయ్యాయి? ఎంత మొత్తంలో రుణాలు ఇచ్చారు? ఎవరెవరు లబ్ధిదారులు? ఏ నిబంధనల ప్రకారం ఎంపిక జరిగింది? సంఘాల తీర్మానాలు ఎప్పుడు జరిగాయి? బ్యాంకు ఖాతాల నుంచి ఎప్పుడు నగదు డ్రా చేశారు? తీర్మానాలపై ఎవరెవరు సంతకాలు చేశారు? వంటి కీలక అంశాలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

**నచ్చునేరు అంకమ్మ సంఘం.. తీర్మానాల గుట్టు విప్పాల్సిందేనా?**

నచ్చునేరు గ్రామానికి చెందిన అంకమ్మ వెలుగు సంఘానికి సంబంధించిన వ్యవహారం ప్రస్తుతం ప్రధాన ప్రశ్నగా మారింది. సంఘానికి సంబంధించిన తీర్మానాలు ఎప్పుడు రాశారు? ఎవరి సమక్షంలో రాశారు? తీర్మాన పుస్తకంలో నమోదు ఎక్కడ జరిగింది? ఆ తీర్మానాల ఆధారంగా రుణం లేదా నగదు లావాదేవీలు ఎప్పుడు జరిగాయి? బ్యాంకు నుంచి డబ్బులు ఎవరి సంతకాలతో డ్రా అయ్యాయి? అనే వివరాలను సభ్యులకు అందుబాటులో ఉంచారా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.సంఘ సభ్యులే తమ సంఘానికి సంబంధించిన రికార్డులు అడిగితే వాటిని చూపించడంలో ఇబ్బంది ఏమిటి?తీర్మానాలు సక్రమంగా ఉంటే వాటిని బయటపెట్టడానికి వెనుకాడాల్సిన అవసరం ఏమిటి?రుణాల లెక్కలు పారదర్శకంగా ఉంటే స్వతంత్రంగా పరిశీలించడానికి అవకాశం ఇవ్వలేరా?అంటూ సభ్యులు ప్రశ్నిస్తున్నారు.

**ప్రశ్నలు అడిగినందుకే దూరం చేయడమా?**

తమ హక్కులు, సంఘ లావాదేవీలపై వివరాలు అడిగినందుకు ఒక కుటుంబాన్ని సంఘ వ్యవహారాల నుంచి దూరం చేసే పరిస్థితి ఏర్పడిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలు నిజమా? కాదా? అనే విషయాన్ని ఉన్నతాధికారులు స్వయంగా విచారణ చేసి తేల్చాలని సభ్యులు కోరుతున్నారు.ఎవరైనా సభ్యుడు సంఘంలో తన పొదుపు, రుణాలు, తీర్మానాలు, లావాదేవీల గురించి ప్రశ్నించడం సహజమేనని పలువురు అంటున్నారు. అయితే ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సిన చోట ఒత్తిడి లేదా భయపెట్టే పరిస్థితులు ఏర్పడుతున్నాయ నే ఆరోపణలు వస్తే.. వాటిపై అధికారులు మౌనం వహించడం సరికాదని పేర్కొంటున్నారు.

**20 ఏళ్ల పొదుపు.. ఒక్కసారిగా హక్కులు ప్రశ్నార్థకమా?**

వెలుగు సంఘాలపై ఆధారపడే పేద, మధ్యతరగతి మహిళలు ఏళ్ల తరబడి ప్రతి నెలా పొదుపులు చేస్తూ సంఘాలను బలోపేతం చేస్తున్నారని సభ్యులు గుర్తుచేస్తున్నారు. కొందరు సభ్యులు దశాబ్దాలుగా సంఘంలో కొనసాగుతున్నప్పటికీ, తమ డబ్బుకు సంబంధించిన లెక్కలు అడిగే హక్కు కూడా ప్రశ్నార్థకమైతే పరిస్థితి ఎక్కడికి దారితీస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు."20 ఏళ్లుగా పొదుపు చేసిన సభ్యురాలు తన సంఘం లెక్కలు అడగకూడదా?""తీర్మానాల వివరాలు తెలుసుకోవడం తప్పా?""రుణం ఎవరికిచ్చారో తెలుసుకునే హక్కు సభ్యులకు లేదా?"అనే ప్రశ్నలు ఇప్పుడు అధికారుల ముందుకు వస్తున్నాయి.

**ఏపీఎం.. సీసీ సమాధానం చెప్పాల్సిన అంశాలివే!**

ఏర్పేడు మండలంలో వెలుగు వ్యవస్థపై వస్తున్న ఆరోపణలకు తెరదించాలంటే సంబంధిత ఏపీఎం, సీసీ స్థాయిలోనే పూర్తి వివరాలు వెల్లడించాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.బాధ్యతలు చేపట్టిన తర్వాత మొత్తం ఎన్ని రుణాలు మంజూరు చేశారు? ఎంత మొత్తాన్ని విడుదల చేశారు?ఎన్ని సంఘాలకు ఇచ్చారు?లబ్ధిదారుల ఎంపిక ఎలా జరిగింది?ప్రతి రుణానికి సంబంధించి తీర్మానం ఉందా?తీర్మాన పుస్తకాలు సక్రమంగా నిర్వహిస్తున్నారా?బ్యాంకు లావాదేవీలకు సంఘ తీర్మానాలు సరిపోలుతున్నాయా?అనే అంశాలపై సమగ్రంగా పరిశీలన జరగాలని డిమాండ్ చేస్తున్నారు.

"అధికారం ఉందని ఇష్టానుసారం వ్యవహరించవచ్చా?"వెలుగు వ్యవస్థలో పనిచేసే అధికారులు, సిబ్బంది పేద మహిళలతో గౌరవంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉందని సభ్యులు అంటున్నారు. అధికారిక హోదా అనేది సభ్యులను భయపెట్టడానికి లేదా ప్రశ్నలను అణచివేయడానికి ఉపయోగించే అధికారం కాదని స్పష్టం చేస్తున్నారు."మీరు ఏం చేసుకుంటే చేసుకోండి" అన్న తరహా దురుసు వైఖరి నిజంగా ఉంటే.. అది అధికారిక వ్యవస్థకు తగినదేనా? అని ప్రశ్నిస్తున్నారు.అయితే సంబంధిత అధికారులపై వస్తున్న ఆరోపణలు వాస్తవమా? లేక అపోహలా? అనే విషయాన్ని కూడా విచారణ ద్వారానే తేల్చాలని పలువురు సూచిస్తున్నారు. రికార్డులు బయటపెడితే నిజం తేలిపోదా? నచ్చునేరు అంకమ్మ సంఘానికి సంబంధించిన తీర్మాన పుస్తకాలు, సమావేశ రిజిస్టర్లు, సభ్యుల పొదుపు వివరాలు, రుణాల రికార్డులు, బ్యాంకు లావాదేవీలు, నగదు ఉపసంహరణ వివరాలు తదితరాలను ఉన్నతాధికారులు పరిశీలిస్తే అసలు విషయం వెలుగులోకి వస్తుందని సభ్యులు చెబుతున్నారు.అందువల్ల కేవలం మౌఖిక సమాధానాలతో కాకుండా రికార్డుల ఆధారంగా విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరుతున్నారు.

**ఉన్నతాధికారులు స్పందించాలి**

ఏర్పేడు మండలంలోని వెలుగు సంఘాలపై వస్తున్న ఫిర్యాదులను జిల్లా స్థాయి అధికారులు తేలికగా తీసుకోకుండా ప్రత్యేకంగా పరిశీలించాలని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు. అవసరమైతే సంబంధిత గ్రామాలకు వెళ్లి సభ్యులతో నేరుగా మాట్లాడి, రికార్డులను తనిఖీ చేసి, బ్యాంకు లావాదేవీలను సరిపోల్చాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం ద్వారా పారదర్శకతను నిరూపించుకోవచ్చు. ఆరోపణలు తప్పైతే వాటిని ఖండించవచ్చు. కానీ విచారణ జరపకుండా మౌనం వహించడం వల్ల అనుమానాలు మరింత పెరిగే అవకాశం ఉంది.

**ఇక తేలాల్సింది ఒక్కటే..**

నచ్చునేరు అంకమ్మ సంఘం తీర్మానాలు సక్రమంగానే జరిగాయా?రుణాల మంజూరులో నిబంధనలు పాటించారా?సభ్యులపై ఎలాంటి ఒత్తిడి జరిగిందా?ఏర్పేడు మండలంలోని వెలుగు సంఘాల్లో రుణాల ప్రక్రియ ఎంతవరకు పారదర్శకంగా ఉంది?ఈ ప్రశ్నలకు జిల్లా స్థాయి విచారణ ద్వారా సమాధానం లభిస్తుందా? లేక ఫిర్యాదులు, ఆరోపణలు అలాగే కొనసాగుతాయా? అనేది వేచి చూడాల్సిందే.

# ఏర్పేడు పాఠశాలలో పోక్సో చట్టం, హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన సదస్సు.

ప్రజా భూమి ప్రతినిధి-ఏర్పేడు



జెడ్పీహెచ్ఎస్ ఏర్పేడు ప్లస్ పాఠశాలలో విద్యార్థులకు పోక్సో (పోక్సో ) చట్టం, అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లు 112, 1098 లపై ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రగతి సంస్థ ప్రతినిధి శిరీష మాట్లాడుతూ, టీనేజ్ వయస్సులో పిల్లలు చాలా జాగ్రత్తగా ఉండాలని, ముఖ్యంగా సోషల్ మీడియాకు వీలైనంత దూరంగా ఉండాలని సూచించారు.ఈ సందర్భంగా సీడీపీఓ కృష్ణ మంజూరి మాట్లాడు తూ, విద్యార్థులను వేధింపుల నుండి పరిరక్షించే పోక్సో చట్టం, దానిలోని ముఖ్యాంశాలను వివరంగా తెలియజేశారు. అనంతరం హెచ్ఎం మునిలక్ష్మి మాట్లాడుతూ, ఆడపిల్లల భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎస్సై మాట్లాడుతూ, విద్యార్థులు ఆపద సమయంలో 112, 1098 వంటి ఉచిత హెల్ప్‌లైన్ నంబర్లను ఉపయోగించి పోలీసుల మరియు చైల్డ్‌లైన్ సహాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమానికి పాఠశాల హెడ్‌మాస్టర్ మునిలక్ష్మి గారు, టీచర్లు, సిడిపిఓ (సీడీపీఓ ) కృష్ణ మంజూరి గారు, స్థానిక ఎస్సై ( మరియు ప్రగతి సంస్థ సిబ్బంది హాజరయ్యారు.

# వైభవంగా కట్ట పుట్టాలమ్మ జాతర ముగింపు

## నాగహారతికి పోటెత్తిన భక్తులు.. పురవీధుల్లో ఘనంగా ఊరేగింపు

ప్రజా భూమి ప్రతినిధి- రేణిగుంట.





రేణిగుంట మండలంలోని కరకంబాడి పంచాయితీలో కొలువైన శ్రీ కట్ట పుట్టాలమ్మ అమ్మవారి జాతర రెండు రోజులపాటు భక్తిశ్రద్ధలతో, కోలాహలంగా జరిగింది. జాతర ముగింపు సందర్భంగా బుధవారం తెల్లవారుజామున వంశపారంపర్య ధర్మకర్త రామచంద్రయ్య, వాసు ఇంటి వద్ద నాగహారతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం కోలాటాలు, వివిధ వేషధారణల్లో మహిళల నృత్యాలు, బ్యాండ్ వాయిద్యాలు, బాణసంచా నడుమ నాగహారతిని పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. దొడ్లమిట్ట, కరకంబాడి గ్రామాల్లో అడుగడుగునా భక్తులు నాగహారతికి పొర్లుదండాలు పెట్టి, కర్పూర నీరాజనాలు సమర్పించారు.నాగహారతి ఆలయానికి చేరుకున్న అనంతరం వంశపారంపర్య ధర్మకర్త సంప్రదాయ పద్ధతిలో అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి నాగహారతి పట్టారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తజన సందోహంతో కిటకిటలాడింది. జాతరకు తరలివచ్చిన భక్తులకు ఆలయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు పర్యవేక్షించారు. భక్తుల ఆధ్యాత్మిక సందడి, సంప్రదాయ కార్యక్రమాల మధ్య రెండు రోజులపాటు జరిగిన శ్రీ కట్ట పుట్టాలమ్మ జాతర ఘనంగా ముగిసింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజేంద్ర, కమిటీ సభ్యులు బుచ్చినాయుడు, సుధ, చలం,కూరకాలవ రామచంద్రయ్య, వాసు, సూరి రాయల్, ధనంజయలు , కమిటీ కమిటీ సభ్యులు జాతర మహోత్సవాన్ని విజయవంతంగా నడిపించారు.

# ఆర్సీపురంలో టిడిపి ఆధ్వర్యంలో నిజం గెలిచింది.

## సీఎం చంద్రబాబు అక్రమ అరెస్టుకు మూడేళ్లు: 53 కొవ్వూతులతో టిడిపి నిరసన..!



ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రాపురం

చంద్రగిరి నియోజకవర్గం రామచంద్రాపురం మండల కేంద్రంలో టిడిపి నాయకులు నిజం గెలిచింది కార్యక్రమం నిర్వహించారు. సోమవారం రాత్రి ఏడు గంటలకు వైకాపా ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలతో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడిని అక్రమంగా అరెస్టు చేసిన దుర్ఘటన జరిగి నేటికి సరిగ్గా మూడేళ్లు పూర్తయి. చంద్రబాబు నాయుడుని 53 రోజుల పాటు రాజమండ్రి కేంద్ర కారాగారంలో అన్యాయ నిర్బంధానికి నిరసనగా 53 క్యాండిలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్‌లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు అక్రమాలకు పాల్పడినట్లు సెప్టెంబర్ 9 2023న అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేయడం సైకో జగన్ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు కడిగిన ముత్యమని, నీతి నిజాయితీగా ప్రజలకు నిస్వార్ధంగా ప్రజా సేవ చేయడమే ఆయన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు అవినీతికి కేరాఫ్ అడ్రస్ జగన్మోహన్ రెడ్డి అని,..... అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి చంద్రబాబు నాయుడు కేరాఫ్ అడ్రస్ అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ టీ కేశవ నాయుడు, కే నరసింహారెడ్డి, బండి విజయ్ కుమార్ రెడ్డి, చేకూరు వెంకటప్రసాద్, కే గిరిధర్ రెడ్డి, ముని రామిరెడ్డి, సోమశేఖర్ నాయుడు, కోటేశ్వర్ రెడ్డి, ఎంపీటీసీ కే చంద్రశేఖర్ రెడ్డి, నాగ ముని యాదవ్, వెంకీ, జగదీష్ రాయల్, దళిత నాయకులు సి రవికుమార్, బాబయ్య, హరి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే నియంత్రించాలి

## తహసీల్దార్‌కు సీపీఐ వినతి పత్రం



ప్రజా భూమి ప్రతినిధి-ఏర్పేడు.

నిత్యావసర వస్తువుల ధరలను తక్షణమే నియంత్రించి, నల్లబజారు, అక్రమ నిల్వలు, కృత్రిమ కొరతను అరికట్టాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఏర్పేడు మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మండల రెవెన్యూ అధికారి (తహసీల్దార్)ను కలిసి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సీపీఐ ఏర్పేడు మండల కార్యదర్శి సర్దార్ శివకుమార్ మాట్లాడుతూ, సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. బియ్యం, పప్పులు, వంటనూనెలు, పాలు, చక్కెరతో పాటు కూరగాయలు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు పెరగడంతో పేదలు, కార్మికులు, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.నల్లబజారు, అక్రమ నిల్వలు, దళారుల దోపిడీ కారణంగా వినియోగదారులు అధిక ధరలకు నిత్యావసర సరుకులు కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆయన విమర్శించారు. మరోవైపు రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు తగిన గిట్టుబాటు ధర లభించక నష్టపోతున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని ప్రజా పంపిణీ వ్యవస్థ ను మరింత బలోపేతం చేయాలని, నిత్యావసర సరుకులను చౌక ధరలకు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సీపీఐ డిమాండ్ చేసింది.

**సీపీఐ ప్రధాన డిమాండ్లు**

నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలి.మండల పరిధిలోని మార్కెట్లు, గోదాములపై విస్తృత తనిఖీలు నిర్వహించి నల్లబజారు, అక్రమ నిల్వదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి నిత్యావసర సరుకులు సక్రమంగా అందేలా చూడాలి.రైతుల వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించి, దళారుల దోపిడీని అరికట్టాలి.ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు సత్యనారాయణ, గోవర్ధన్, నారాయణ, శ్రీనివాసులు రెడ్డి, లోకేశ్వరి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమే లక్ష్యం:ఎస్. టి. కమిషన్ చైర్మన్ బుజ్జి రెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం



రాష్ట్రంలోని గిరిజన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించ డమే ఎస్. టి. కమిషన్ ముఖ్య లక్ష్యం అని ఆంధ్రప్ర దేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సొల్ల బొజ్జిరెడ్డి తెలిపారు. జిల్లా పర్యటన భాగంగా స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఏర్పాటుచేసిన పాత్రికేయ సమావేశంలో వెల్ల డించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బుధ వారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలను పర్యటి స్తూ తండాలలో గిరిజన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నట్లు కమిషన్ చైర్మన్ తెలిపారు. నిన్నటి రోజున శ్రీ సత్య సాయి జిల్లా లోని కదిరి, నల్లచెరువు, ముదిగుబ్బ మండలాల్లో పర్యటించడం జరిగిందని ముఖ్యంగా తండావా సులు ఆయా తాండాలలో తాగునీటి సౌకర్యాలు తక్కువగా ఉన్నాయని బోర్లు వేసిన కూడా భూగర్భ జలాలు అడుగంటి పోయినందున నీటి కొరత ఏర్పడుతుందని అలాగే తమ కాలనీలకు రోడ్డు తదితర మౌలిక సదుపాయాలు సరిగా లేవని తమ దృష్టికి విన్నవించినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తాగునీటి సమస్యను పరిష్కరించే దిశగా ట్యాంకర్ల రూపంలో తాత్కాలికంగా చర్య లు తీసుకొని నీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నట్టు తెలిపారు. అలాగే ఎల్ నినో వర్ష బావ పరిస్థితుల వల్ల సకాలంలో వర్షాలు లేక రైతులు పెట్టిన పంటలు చేతికి అందక తీర నష్టం జరుగుతుందని అందువల్ల రైతులను కూలీలను ఆదుకోవాలని కరువు జిల్లాగా ప్రకటించాలని కోరు తూ గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరిం చడం జరిగిందన్నారు. వారు కోరుతున్నట్లు ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ గా తాను సమస్యలను పరిశీలించి పై విషయాలపై స్పంది స్తూ ఆయా సమస్యలను పరిష్కరించే దిశగా తగు చర్యలు తీసుకుంటానని తెలిపారు. అంతేగాక భూ వివాద సమస్యలు కూడా ఉన్నాయని, పట్టాల మంజూరులో పలు నిరు పేద గిరిజన కుటుంబాలకు అన్యాయం జరిగినట్లు తమ దృష్టికి ఫిర్యాదులు వచ్చాయని, గిరిజన ఆశ్రమ పాఠశాలలో కూడా మౌలిక సదుపా యాలు కల్పించాలని, గిరిజన ప్రజలకు సంబం ధించి స్మశాన వాటికలు కూడా లేవని, అక్రమ కేసులు రద్దు చేయాలని తదితర ఫిర్యాదులు అందినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా కమిషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక దృష్టిని సారించి గిరిజన ప్రజలు ఎదుర్కొంట్రా సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు మంజూరు చేసిన నిధులు సక్రమంగా వినియోగంలోకి రావాలని ఈ విషయంలో అధికారులు అంకితభావంతో పనిచేయాలని అలాగే అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందిం చేందుకు కృషి చేయాలని ఎస్టి కమిషన్ చైర్మన్ బుజ్జి రెడ్డి సూచించారు.

కమిటీ సభ్యులు పి. వెంకటప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎస్టీ కమిషన్ ద్వారా క్షేత్రస్థాయిలో గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆయా పథకాలు అర్హులకు అందుతున్నాయా లేదా అదే అంశాలను పరిశీలిస్తోందని తెలిపారు. ప్రభుత్వ శాఖ అధికారులు కూడా అర్హులకు సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేయా లని పేర్కొన్నారు. ఎక్కడైనా అర్హులకు అన్యా యం జరిగినట్లు రుజువైతే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గిరిజన విద్యా సంస్థల నిర్వహణ, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సభ్యులు కె. మల్లేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లో పేద గిరిజన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ఆయా సమస్యల పై తక్షణమే స్పందించి ఎస్టీ కమిషన్ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్డీవో ప్రేమాంథ్ కుమార్, డి టి డబ్ల్యూ శ్రీనివాసరావు, అర్బన్ తాసిల్దార్ డి .రాజా, రెవెన్యూ ఇన్స్పెక్టర్ తేజ, తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి గిరిజన ప్రజల నుండి పలు సమస్యలతో కూడినఅర్జీలను కమిషన్ బృందం స్వీకరించిందన్నారు.

# జిల్లాలో హెచ్ఐవీ/ఎయిడ్స్ అవగాహన కోసం కళాజాత

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం



ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి (APSACS) ప్రాజెక్టు డైరెక్టర్ వారి ఆదేశాల మేరకు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రజల్లో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన పెంపొందించేందుకు నిర్వహిస్తున్న కళాజాత కార్యక్రమాలను బుధవారం డిఎం అండ్ హెచ్ ఓ కార్యాలయంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు ఈరోజు పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, వ్యాధి నివారణ, ముందస్తు పరీక్షలు, సకాలంలో చికిత్స పొందడం, అలాగే హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తుల పట్ల వివక్షను నివా రించడం వం టి అంశాలపై ప్రజల కు అవగా హన కల్పించడం ఈ కార్యక్ర మం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. జిల్లా వ్యా ప్తంగా ఎంపిక చేసిన 26 ప్రాంతాల్లో రెండు కళాజాత బృందాలు వీధి నాటకాలు, పాటలు, సాం స్కృతిక ప్రదర్శనల ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు హెచ్ఐవీ/ఎయిడ్స్‌కు సంబంధించిన అవగాహన కల్పిస్తాయన్నారు . ఈ కార్యక్ర మాలు జిల్లాలోని సుమారు 20 మండలాల్లో నిర్వహించబడనున్నాయి.జిలా ఎయిడ్స్, టీబీ, కుష్ఠు వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ జయ లక్ష్మి మాట్లాడుతూ ప్రజలు హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవడం, అవసరమైన వైద్య సేవలను వినియోగించుకోవడం, అలాగే వ్యాధి పట్ల సానుకూల దృక్పథాన్ని పెంపొందించుకోవడం కోసం ఈ అవగాహన కార్యక్రమాలు దోహ ద పడతాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సూపర్వైజర్ జి.వి. రమణ, డా. శివరెడ్డి, లెప్రసీ నాగన్న, దిశ నారాయణ స్వామి , లింక్ వర్కర్స్ ప్రోగ్రాం డి.ఆర్.పీ. రమేష్ యాదవ్, టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ ప్రోగ్రాం సిబ్బంది, లింక్ వర్కర్స్ ప్రోగ్రాం సిబ్బంది, జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు చెందిన ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మొన్న బాలికలు... నేడు బాలురు...

# హాకీలో సత్తా చాటిన దురదకుంట విద్యార్థులు!





### జిల్లా స్థాయి హాకీ పోటీల్లో దురదకుంట ఉన్నత పాఠశాల బాలుర జట్టు ఘన విజయం

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

కళ్యాణ్ దుర్గం నియోజకవర్గంలో దురదకుంట ఉన్నత పాఠశాల విద్యార్థులు చదువుతో పాటే క్రీడల్లోనూ అదరగొడుతున్నారు. హాకీ స్టిక్ పట్టి మైదానంలో దిగితే తమకు తిరుగులేదని నిరూపి స్తున్నారు. మొన్న బాలికలు నేడు బాలురు అన్న ట్లుగా అనంతపురం జిల్లా స్థాయి హాకీ పోటీల్లో దురదకుంట విద్యార్థులు సత్తా చాటుతూ పాఠ శాలకు కీర్తిని తీసుకొస్తున్నారు. తాజాగా అనంత పురంలోని ప్రసిద్ధ ఆర్.డి.టి స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి బాలుర హాకీ పోటీలలో దురదకుంట ఉన్నత పాఠశాల బాలుర జట్టు అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించి ఛాంపి యన్లుగా అవత రించింది. ఫైనల్ పోరులో ప్రత్యర్థులపై పైచేయి సాధించి, విజేతలుగా నిలిచిన విద్యార్థులు జిల్లా విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా ప్రతిష్టాత్మక మైన విన్నింగ్ కప్‌ను సగర్వంగా అందుకు న్నారు. ఉపాధ్యాయుల హర్షం, అభినందనల వెల్లువజిల్లా స్థాయిలో తమ పాఠశాల విద్యార్థులు వరుసగా సత్తా చాటడం పట్ల పాఠశాల ఉపా ధ్యాయ బృందం తీవ్ర హర్షం వ్యక్తం చేసింది. ఈ అద్భుత విజయం సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు హిమ శేఖర్, వ్యాయామ ఉపాధ్యాయుడు (PET) రాజేంద్ర, ఇతర ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినం దించారు.విద్యార్థులను క్రీడల పట్ల ప్రోత్సహిస్తూ, వారికి తగిన మెళకువలు నేర్పిస్తూ నిరంతరం శ్రమిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు రాజేంద్ర కృషిని ఈ సందర్భంగా ప్రధానోపాధ్యా యులు మరియు తోటి ఉపాధ్యాయులు కొనియాడారు.భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లోనూ మన విద్యార్థులు ఇలాగే మరిన్ని కప్పులు సాధించి, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. హాకీలో దురదకుంట బ్రాండ్ క్రియేట్ చేసిన ఈ బాలుర మరియు బాలికల జట్లకు గ్రామస్తులు, తోటి విద్యార్థులు, క్రీడాభిమానుల నుండి కూడా విశేష స్పందన, శుభాకాంక్షలు వెల్లువెత్తుతు న్నాయి. ఈ కార్యక్రమంలో తోటి విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# బీడు భూములలో పిఎండిఎస్ వల్ల ఉపయోగాలు:డి పి ఎం లక్ష్మనాయక్

ప్రజా భూమి శింగనమల



మండల పరిధిలోని పెద్ద మట్లగొంది గ్రామంలో బీడు భూముల్లో పిఎం డిఎస్ వేయించడం జరి గింది చీఫ్ టెక్నా లజీ అండ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ (సి టి అండ్ ఐ ఓ), డిపిఎం లక్ష్మా నాయ క్ ఆధ్వర్యంలో రైతులు పార్న పల్లి వెంకట రాముడు రామాంజనే యులు 5 ఎకరాల బీడు భూమిలో ఐదు రకాల ప్రధాన పంటలు 20 రకాల బయో డైవర్సిటీ విత్తనాలను పెల్లటైజేషన్ చేసి పీఎండీఎస్ వేయడం జరిగింది. ఈ సందర్భంగా డిపిఎం లక్ష్మా నాయక్ రైతులతో మాట్లాడుతూ ప్రకృతి వ్యవ సా యం చేస్తూ పంటలను పండించడం ద్వారా మరియు 20 నుండి 30 రకాల విత్త నాలను భూమిలో వేయడం వల్ల నేలకు రకర కాల పోషకాలు అంది బయోమాస్ ఉత్పత్తి పెరుగు తుందని, నేల యొక్క స్వభావాన్ని మార్చవచ్చు అని ఘనజీ వామృతం ద్వారా ఆరోగ్యకరమైన పంటలను పండించి అధిక దిగుబడులను ,తీసుకోవచ్చని తెలియ జేశారు మరియు విత్తన శుద్ధి చేసి విత్తన గుళికలను తయారు చేసుకుని భూమిలో వేయడం వల్ల తేలికపాటి వర్షానికి కూడా విత్తనాలు మొలకెత్తి చీడపీడలను తట్టుకొని 365 రోజులు కూడా మనకు పంట యొక్క దిగుబడి తీసుకోవచ్చని తద్వారా సాగులో లేని బీడు భూములను మనము ఆరోగ్యకరమైన నేలలుగా సాగులోనికి తేవచ్చని ఆయన తెలియజేశారు. ప్రస్తుతం ఎలినో ప్రభావం రైతులపై తీరని నష్టం కలిగిస్తుందని దీనిని అధిగమిం చాలి అంటే పెల్లెటైజ్డ్ పీఎండీఎస్ వేయడం ఒక్కటే మార్గమని అన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ నవీన్ పవన్ ఎఫ్ ఎం టి రామచంద్ర ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొనడం జరిగింది

# ఆకాశానికి చేరిన నిత్యవసర వస్తువులు

**బ్లాక్ మార్కెట్, దళారీ దోపిడీని అరికట్టి ధరల భారాన్ని తగ్గించాలి**

**ఎం.మధుయాదవ్ సీపీఐ మండల కార్యదర్శి**

ప్రజా భూమి శింగనమల



మండల సమితి అద్వర్యము సీపీఐ రాష్ట సమితి పిలుపు మేరకు సీపీఐ మండల కార్య దర్శి మధుయాదవ్ ,సీపీఐ మండల సహ య కార్యదర్శులు చేనేత మధు, చికెన్, బాషా, అద్వర్యములో తహశీ ల్దార్ శేషారెడ్డి కీ వినతి పత్రము ఇచ్చారుఆకాశానికీ తాకు తున్ననిత్యావసర వస్తువుల ధరలతో పేదలు, కార్మికులు, రైతులు, ఉద్యోగులు, చిరు వ్యా పారులు, మధ్యతరగతి కుటుంబాల బతు కులు భారంగా మారాయని ఒకవైపు ప్రజల ఆదాయాలు అంతంతమాత్రాన ఉన్నాయి 2014తో పోలిస్తే నేడు నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగినట్లు కేంద్ర ప్రభుత్వ అధికారిక గణాంకాలే వెల్లడిస్తున్నాయని ఈశ్వరయ్య తెలిపారు. బియ్యం కిలో ధర ₹28.06 నుంచి ₹45.69కు పెరిగిందని, అంటే సుమారు 63 శాతం పెరుగుదల నమోదైందన్నారు. కందిపప్పు ధర ₹75.94 నుంచి ₹122.06కు పెరిగి సుమారు 61 శాతం పెరిగిందని తెలిపారు. సన్ఫ్ లవర వంటనూనె ధర ₹93.55 నుంచి ₹192.40కు పెరిగి 105 శాతం మేర పెరిగిందని, చక్కెర ధర ₹34.02 నుంచి ₹60.78కు పెరిగి సుమారు 79 శాతం, ఉల్లిపాయ ధర ₹26.46 నుంచి ₹50.19కు పెరిగి సుమారు 90 శాతం, టమాటా ధర ₹21.44 నుంచి ₹37.67కు పెరిగి సుమారు 76 శాతం పెంచి సామాన్యులు నడ్డివిరిచారు కావున తక్షణమే పెరుగుతున్న ధరలు తగ్గించాలని సీపీఐ ద్వారా డిమాండ్ చేస్తున్నాము.ఈకార్యక్రమములో వ్యవసాయకార్మికసంఘముమండలకార్యదర్శిముని స్వామి, సిపిఐ నాయకులు నారప్ప రామ సుబ్బారెడ్డి రూప్లో నాయక్, నాగబయన్న, రామకృష్ణ, రాజప్ప ,బాల్రెడ్డి ,షేక్షావలి, నాగరాజు ,తదితరులు పాల్గొన్నారు.



# దళారి దోపిడీ అరికట్టి నిత్యవసర ధరల భారాన్ని తగ్గించండి

### సిపిఐ మండల కార్యదర్శి డి. పెద్దయ్య

ప్రజాభూమి, పుట్లూరు

పుట్లూరు మండల కేంద్రంలోని బస్టాండ్ సర్కిల్ నందు బ్లాక్‌మార్కెట్, దళారీ దోపిడీని అరికట్టి నిత్యవసర ధరల భారాన్ని తగ్గించాలి అనిసీపీఐ పార్టీ ఆధ్వర్యంలో నిరసనన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగినది. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి డి, పెద్దయ్య మాట్లాడుతూ! ఆకాశా న్నంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో పేదలు, కార్మికులు, రైతులు, ఉద్యోగులు, చిరు వ్యాపా రులు, మధ్యతరగతి కుటుంబాల బతుకులు భారంగా మారాయి ఒకవైపు ప్రజల ఆదాయాలు ఆశించిన స్థాయిలో పెరగకపోగా, మరోవైపు రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు కుటుంబ బడ్జెట్లను ఛిద్రం చేస్తున్నాయి. కూరగాయలు కొనలేని పరిస్థితి, పప్పు వండాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి, వంటనూనె వినియోగించాలంటే జేబు చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్ప డింది. సామాన్యుడి వంటిల్లు నేడు అగ్నిగుండంగా మారింది. 2014తో పోలిస్తే నేడు నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగినట్లు కేంద్ర ప్రభుత్వ అధికారిక గణాంకాలే వెల్లడిస్తున్నాయి, బియ్యం కిలో ధర ₹28.06 నుంచి ₹45.69కు పెరిగిందని, అంటే సుమారు 63 శాతం పెరుగుదల నమోదైం దన్నారు. కందిపప్పు ధర ₹75.94 నుంచి ₹122.06కు పెరిగి సుమారు 61 శాతం పెరిగిందని



తెలిపారు. సన్‌ఫ్లవర్ వంటనూనె ధర ₹93.55 నుంచి ₹192.40కు పెరిగి 105 శాతం మేర పెరిగిందని, చక్కెర ధర ₹34.02 నుంచి ₹60.78కు పెరిగి సుమారు 79 శాతం, ఉల్లిపాయ ధర ₹26.46 నుంచి ₹50.19కు పెరిగి సుమారు 90 శాతం, టమాటా ధర ₹21.44 నుంచి ₹37.67కు పెరిగి సుమారు 76 శాతం పెరిగాయి.ముఖ్యంగా వంటనూనె ధర రెట్టింపుకుపైగా పెరగడం, ఉల్లిపాయ ధర దాదాపు రెట్టింపు కావడం, బియ్యం, కందిపప్పు, చక్కెర, టమాటా ధరలు గణనీయంగా పెరగడం ప్రజలపై పడుతున్న ధరల భారానికి నిదర్శనమన్నారు. ధరలు ఇంత భారీగా పెరుగుతుంటే ప్రజల ఆదాయాలు కూడా అదే స్థాయిలో పెరిగాయా? సామాన్యుడి కొనుగోలు శక్తి పెరిగిందా?రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కడం లేదని, అదే పంట మార్కెట్‌కు వచ్చేసరికి వినియోగదారుడు మాత్రం అధిక ధర చెల్లించాల్సి వస్తోందని అన్నారు. రైతు దగ్గర తక్కువ ధర, వినియోగదారుడి దగ్గర అధిక ధర ఉండగా, మధ్యలో దళారీ వ్యవస్థ భారీగా దండుకుంటున్నారు. రైతు నుంచి వినియోగదారుడి వరకు కొనసాగుతున్న ఈ దోపిడీ గొలుసును తెంచాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నది. కావుననిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గిం చాలని, బ్లాక్‌మార్కెట్, అక్రమ నిల్వలు, కృత్రిమ కొరతను అరికట్టాలని సిపిఐ పార్టీగా డిమాండ్ చేస్తున్నాం. నిత్యవసర సరుకులు చూస్తూ ఈ సరుకులు కొనలేమని ఉత్త అన్నం తింటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి, బాలు, దేవరాజు, డి హెచ్ పి ఎస్, మం" కార్యదర్శి, రాఘవేంద్ర, రాజు, డ్రైవర్ ఓబు లేస్,లక్ష్మయ్య, నారాయణ, లింగమయ్య, సురేంద్ర, ఓబులపతి తదితరులు పాల్గొన్నారు.

# తాడిపత్రిలో జర్నలిస్టుల శాంతియుత నిరసన

### నంద్యాల జిల్లాలో జర్నలిస్టులపై అక్రమ కేసులు, అరెస్టులకు నిరసన

ప్రజాభూమి, పుట్లూరు.తాడిపత్రి:



నంద్యాల జిల్లాలో జర్నలిస్టు లపై అక్రమ కేసులు నమో దు చేసి అరెస్టులు చేయ డాన్ని నిరసిస్తూ అనం తపు రం జిల్లా తాడిపత్రి పట్ట ణంలో జర్నలిస్టులు శాంతియుత నిరసన చేపట్టారు. తాడిపత్రి పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు గుమిగూడి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులపై కేసులు నమోదు చేయడం, అరెస్టులు చేయడం ద్వారా మీడియా స్వేచ్ఛను అణచివేయడం సరికాదన్నారు. జర్నలిస్టులపై వేధింపులను వెంటనే నిలిపివేయాలని, అక్రమంగా నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.అనంతరం గాంధీ సర్కిల్ నుంచి తాడిపత్రి పట్టణ పోలీస్ స్టేషన్ వరకు జర్నలిస్టులు ర్యాలీ నిర్వహించారు.

పోలీస్ స్టేషన్ వద్ద తాడిపత్రి టౌన్ సీఐ ఆరోహణరావుకు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులపై నమోదైన కేసులను పరిశీలించి ఉపసంహరించుకోవాలని, అక్రమ అరెస్టులపై తగిన చర్యలు తీసుకో వాలని కోరారు.జర్నలిస్టులపై వేధింపులు ఆపాలి.. మీడియా స్వేచ్ఛను కాపాడాలి" అంటూ నినాదాలు చేశారు. జర్నలిస్టుల ఆందోళనకు సీపీఐ, నాయకులు ఎస్ఎఫ్ఐ, విద్యార్థి సంఘాలు, ప్లైవుడ్ అసోసియషన్ నాయకులు నిఫసనలో పాల్గొని సంఘీభావం తెలిపారు. జర్నలిస్టుల హక్కులు, మీడియా స్వేచ్ఛ పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడుతామని వారు స్పష్టం చేశారు.



## వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

**- డీజేలు వాడితే కేసులు తప్పవు డీఎస్పీ మురళీ నాయక్, మున్సిపల్ కమిషనర్ తనూజ**

ప్రజాభూమి, పులివెందుల

వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని డీఎస్పీ మురళీ నాయక్, మున్సిపల్ కమిషనర్ తనూజ విజ్ఞప్తి చేశారు.బుధవారం స్థానిక ఆర్డీవో కార్యా లయంలో పీస్ కమిటీ సమావేశం నిర్వ హిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ.. గణేష్ మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా గణేష్ ఉత్సవ పోర్టల్ లో వివరాలు నమో దు చేసి అనుమతులు పొందాలన్నారు. మండ పాల వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్, అగ్నిప్రమా దాలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకో వాలని, అత్యవసర వాహనాల రాకపోకలకు అడ్డం కులు లేకుండా చూడాలన్నారు.నిమజ్జనం, ఊరేగింపు ల్లో డీజేలకు అనుమతి లేదని, నిబంధనలు ఉల్లంఘించి డీజేలు వాడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం సేవించి ఊరేగింపుల్లో పాల్గొనడం, గొడవలకు దిగడం వంటివి చేయరాదన్నారు.నిమజ్జనం, ఊరేగింపు వివరాలను ముందుగానే పోలీసులకు తెలియజేయాలని, మండపాల వద్ద పరిశుభ్రత పాటించాలని, అన్నదానం సమయంలో ప్లాస్టిక్ ప్లేట్లు, పేపర్ గ్లాసులు వాడరాదని సూచించారు.సమావేశంలో మత పెద్దలు, గణేష్ మండపాల నిర్వాహకులు, డివిజన్ పరిధి పోలీసు అధికారులు పాల్గొన్నారు.







## దివ్యాంగులకు గృహోపకరణాల పంపిణీ

**- స్వర్గీయ కుప్పాల సుబ్బరాయుడు సేవలు చిరస్మరణీయం**

ప్రజాభూమి, పులివెందుల:

పట్టణంలోని లక్ష్మీ థియేటర్ ఎదురుగా ఉన్న ఆయిల్ మిల్, ఎంఆర్ఎఫ్ టైర్స్ యజమాని స్వర్గీయ కుప్పాల సుబ్బరాయుడు ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకొని దివ్యాంగులకు గృహోపకరణాలు పంపిణీ చేశారు.ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో జరిగిన ఈ సంస్మరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కుప్పాల శ్రీరామ్, యూరో కిడ్స్ ప్లే స్కూల్ డైరెక్టర్ శ్వేత హాజరై సుబ్బరాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఆయన కుమారుడు సాయికుమార్, శ్వేత దంపతులు సమకూర్చిన గృహోపకరణాలను దివ్యాంగులకు అందజేశారు.ఈ సందర్భంగా వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షులు డా. ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి మాట్లాడుతూ.. స్వర్గీయ సుబ్బరాయుడు నిరంతర కృషీవలుడు, సౌమ్యుడు, స్నేహశీలి, మంచి మనసున్న వ్యక్తిగా అందరి హృదయాల్లో చిరస్మరణీయ స్థానం పొందారన్నారు. పార్నపల్లి రోడ్డులోని షిర్డీ సాయిబాబా గుడి వ్యవస్థాపకునిగా, ఆయిల్ మిల్ వ్యాపార, విద్యా రంగాల్లో ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరేలా కుటుంబ సభ్యులు దివ్యాంగులకు చేయూతనివ్వడం అభినందనీయమన్నారు.కార్యక్రమంలో వికలాంగుల నెట్ వర్క్ కార్యవర్గ సభ్యుడు బలిజపల్లె గంగిరెడ్డి, శ్రీరామ సుబ్బయ్య, రెంటాల వెంకట రమేష్, మేడిశెట్టి రమేష్, ప్రభాస్ తదితరులు పాల్గొన్నారు.

## పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు అవగాహన

**- డిజిటల్ ఈ-పంట నమోదు చేసుకోవాలి.. చీడపీడల నివారణకు చర్యలు చేపట్టాలి**

**- మండల వ్యవసాయ అధికారి బాల గంగాధర్ రెడ్డి**



ప్రజాభూమి, వేంపల్లె

మండలంలోని ఇడుపులపాయ, వీరన్నగట్టుపల్లి గ్రామాల్లో బుధవారం మండల వ్యవసాయ అధికారి ఈ. బాల గంగాధర్ రెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పంటల సాగు, చీడపీడల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి బాల గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా డిజిటల్ ఈ-పంట నమోదు చేసుకోవాలని సూచించారు. ఎల్నినో ప్రభావంతో చౌడు భూముల్లో వరి పంట ఎదుగుదల తగ్గడం, పిలకలు తగ్గడం, కొనలు ఎర్రబారడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. భూమి స్వభావాన్ని బట్టి ఎకరాకు 150 నుంచి 1,000 కిలోల వరకు జిప్సం వినియోగించాలని, జింక్ లోపం నివారణకు ఎకరాకు 20 కిలోల జింక్‌ను దుక్కిలో వేయాలని తెలిపారు. పొడి వాతావరణం కారణంగా నల్లి ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున స్పైరోమెసిఫెన్ ఒక మిల్లీలీటరు చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. నీటిని పొదుపుగా వినియోగిస్తూ వ్యవసాయ, వాతావరణ శాఖల సూచనలు పాటించాలని, మట్టి పరీక్ష ఆధారంగా ఎరువులు వినియోగించాలని రైతులకు సూచించారు. అనంతరం వరి పంట పొలాలను సందర్శించి చీడపీడల నివారణ చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## చెస్‌లో శ్రీ చైతన్య విద్యార్థిని ప్రతిభ

**- రాష్ట్రస్థాయి టోర్నమెంట్లలో 3వ, 1వ ర్యాంకులు**

**- కరస్పాండెంట్ బి. చక్రపాణి రెడ్డి**



ప్రజాభూమి, వేంపల్లె

రాష్ట్రస్థాయి చెస్ ర్యాంకింగ్ టోర్నమెంట్లలో స్థానిక పట్టణంలోని శ్రీ చైతన్య హైస్కూల్ విద్యార్థిని తలారి తనుశ్రీ అద్భుత ప్రతిభ కనబరిచి వరుస ర్యాంకులు సాధించిందని పాఠశాల కరస్పాండెంట్ బి. చక్రపాణి రెడ్డి తెలిపారు. ఆగస్టు 3న రాజమండ్రిలో జరిగిన అండర్-16 మూడో చెస్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంక్, సెప్టెంబర్ 6న తిరుపతిలో జరిగిన అండర్-16 ఐదో చెస్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో 1వ ర్యాంక్ సాధించిందన్నారు. తనుశ్రీ సాధించిన విజయాలు పాఠశాలకు, తల్లిదండ్రులకు గర్వకారణమని చక్రపాణి రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థిని ప్రతిభను అభినందిస్తూ పాఠశాల తరఫున నగదు బహుమతి అందజేశారు. రాబోయే పోటీల్లోనూ ఇదే పట్టుదలతో రాణించి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. చెస్ వంటి మేధో క్రీడలు విద్యార్థుల్లో ఏకాగ్రత, ఆలోచనా శక్తి, నిర్ణయ సామర్థ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. తనుశ్రీని ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు, శిక్షణ అందించిన చెస్ కోచ్‌లు, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తనుశ్రీకి అభినందనలు తెలిపారు.

## ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర నేతలకు ఘన స్వాగతం పలికిన పులివెందుల తాలూకా ఉద్యోగులు



**సచివాలయ సిబ్బంది సమస్యలపై వినతి పత్రం సమర్పించిన పులివెందుల తాలూకా అధ్యక్షుడు జగన్నాథరెడ్డి**

ప్రజాభూమి, పులివెందుల

కడప జిల్లా పర్యటనలో భాగంగా కడపకు విచ్చేసిన ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర జేఏసీ చైర్మన్ అలపర్తి విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి. రమణ లకు పులివెందుల తాలూకా ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు.పులివెందుల తాలూకా ఏపీ ఎన్జీవోస్ అధ్యక్షుడు గజ్జల జగన్నాథరెడ్డి నాయకత్వంలో పెద్ద ఎత్తున ఉద్యోగులు, స్వర్ణ వార్డు, సచివాలయ సిబ్బంది కడప ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ లో విద్యాసాగర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, ఉద్యోగుల పెండింగ్ సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. దీనిపై స్పందించిన విద్యాసాగర్.. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో మాట్లాడి త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.అనంతరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా స్థాయి సభలో పులివెందుల తాలూకా నుంచి భారీగా ఉద్యోగులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తాలూకా అధ్యక్షుడు జగన్నాథరెడ్డి, ట్రెజరర్ రామ గంగాధర్ రెడ్డి యాదవ్, ఉపాధ్యక్షులు వై. ప్రభుకుమార్, బి. శంకరయ్య, సచివాలయ సిబ్బంది గంగయ్య, సుగుణాకర్, సుధీర్ రెడ్డి, శ్రీనివాసులు, శివకృష్ణ, గిరి తదితరులు పాల్గొని సభను విజయవంతం చేశారు.ఉద్యోగుల ఐక్యతను చాటిన ఈ పర్యటన పులివెందుల తాలూకా ఉద్యోగుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది.



## పిల్లలకు టీకాలు తప్పనిసరిగా వేయించాలి

**కడప డీఎంహెచ్‌వో యుగంధర్**

**మాధవరం-1లో ఇమ్యునైజేషన్ కార్యక్రమం తనిఖీ**

ప్రజాభూమి, సిద్దవటం:

పిల్లలకు ప్రాణాంతక వ్యాధులు రాకుండా టీకాలు తప్పనిసరిగా వేయించాలని కడప జిల్లా డీఎంహెచ్‌వో యుగంధర్ తల్లిదండ్రులకు సూచించారు. బుధవారం సిద్ధవటం మండలం మాధవరం-1 గ్రామంలోని సచివాలయం-2 పరిధిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో నిర్వహించిన ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రతి బుధవారం, శనివారం పిల్లలు, గర్భిణులకు టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. పుట్టినప్పటి నుంచి రెండేళ్లలోపు పిల్లలకు 11 రకాల ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కల్పించే టీకాలను నిర్ణీత సమయంలో వేయించాలన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి టీకాలు పొందాల్సిన పిల్లలను గుర్తించాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులకు హాజరై రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆరోగ్య ఉపకేంద్రాల్లో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు అందుబాటులో ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో డీఐఓ ప్రవీణ్‌కుమార్, మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీవిద్య, సూపర్‌వైజర్ రమణయ్య, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల కోసమే కొత్త పెన్షన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం చెప్పడం జరిగిందని పోతిరెడ్డి నాగార్జున రెడ్డి

ప్రజాభూమి పోరుమామిళ్ల :



చంద్రబాబు ముఖ్యమంత్రి అయినా తరువాత దాదా పు రెండున్నర సంవత్సరం కావస్తున్న ఒక్క కొత్త పె న్షన్ మంజూరు చేయలేదు. ఈ సందర్భంగా మాజీ ప్ర భుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి కడప జిల్లా పోరుమామిళ్లలో మాట్లాడుతూ. స్థానిక సంస్థల ఎలక్షన్లు దగ్గర పడుతున్నందున. ఈ ప్రభు త్వానికి ప్రజ ల్లో వ్యతిరేకత పెరిగిన. నిత్యవసర వస్తువులు భారీ గా పెరిగే నందున. కొత్త పెన్షన్లు మం జూరు చేస్తామని చెప్పడం జరిగింది అన్నారు. 2019 నాటికి చంద్ర బాబు ముఖ్యమంత్రిగా దిగిపోయేసరికి రాష్ట్రంలో 39 లక్షల మందికి .2000 ప్రకారం ఇస్తున్నారని. 2024 నాటికి వైఎస్ జగన్ దిగిపోయేసరికి. 27 లక్షల కొత్త పెన్షన్లు ఇవ్వడం మొత్తం 66 లక్షల 35వేల మందికి 3000 ప్రకారం ఇవ్వ డం జరిగిందని. 2024 నుండి ఇప్పటివరకు ఒక్క కొత్త పెన్షన్ కూడా మంజూరు చేయలేదని గతంలో ఇస్తున్న మూడున్నర లక్షల పెన్షన్ దారులను తొల గించడం జరిగిందని ఇప్పుడు ఎన్టీఆర్ భరోసా కింద 50 సంవత్సరాలు పైబడిన ఎస్సీ ఎస్టీ బీసీల కు పెన్షన్లు ఇస్తామని ఎలక్షన్లకు ముందు చెప్పారని ఇప్పుడు. 60 సంవత్సరాలు పైబడిన వారికి మాత్ర మే..సెప్టెంబర్ 16 .2026 తేదీలోపు దరఖాస్తు చేసు కోమని ప్రభుత్వం చెప్పడం జరిగిందని .ఆ కాలపరిమితిని ఈ నెలాఖరు వరకు పొడిగించాలని. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పెన్షన్లను మంజూరు చేయా లని. గత ప్రభుత్వంలో మూడు నెలలకు ఒకసారి కొత్త పెన్షన్లను మంజూరు చేయడం జరిగేదని. ఇప్పు డు రెండున్నర సంవత్సరాల తర్వాత పెన్షన్లు ఇస్తామని చెప్పడం జరిగిందని. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న వారికి అందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని నాగార్జున రెడ్డి డిమాండ్ చేశారు.

## వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు

**చంద్రబాబు నాయుడు దంపతులకు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యనమల సుధాకర్ శుభాకాంక్షలు**



ప్రజాభూమి పోరుమామిళ్ల, :

రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తూ, ప్రజాసేవకు అంకితమైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా భువనేశ్వరి దంపతులకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, పోరుమామిళ్ల మాజీ సర్పంచ్ యనమల సుధాకర్ హృదయపూర్వక వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యనమల సుధా కర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజల కోసం నిత్యం శ్రమిస్తూ, రాష్ట్ర అభివృద్ధి కోసం విశేష కృషి చేస్తు న్నారని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి దంపతులకు భగవం తుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. నారా చంద్ర బాబు నాయుడు, నారా భువనేశ్వరి దంపతులు నిండు నూరేళ్లు ఆనందంగా, ఆరోగ్యంగా జీవిస్తూ రాష్ట్ర ప్రజలకు మరింత సేవ చేసే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు యనమల సుధాకర్ తెలిపారు.

## డ్రైనేజీ కాలువలో గ్రావిల్ తొలగించాలి

**నాలుగు రోజుల్లో తొలగించకపోతే నోటీసులు: పంచాయతీ కార్యదర్శి**

ప్రజాభూమి, సిద్ధవటం:



కడప-చెన్నై జాతీయ రహదారిపై సిద్ధవటం మండలం మాధవరం-1 పంచాయతీ పరిధిలోని పార్వ తి పురం సమీపంలో డ్రైనేజీ కాలువలో దుకాణదారులు వేసిన గ్రావిల్‌ను తొలగించాలని ఇంచా ర్జ పంచాయతీ కార్యదర్శి నాన్సీ సూచించారు. మండల అభివృద్ధి అధికారి ఫణి రాజకుమారి ఆదేశాల మేరకు బుధవారం ఆమె దుకాణదారులకు అవగాహన కల్పించారు. డ్రైనేజీ కాలువలో గ్రావిల్ పేరుకుపోవడంతో మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వస్తోందని తెలిపారు. దుకాణదారు లు స్వచ్ఛందంగా నాలుగు రోజుల్లోపు అడ్డంకులను తొలగించకపోతే నోటీసులు జారీ చేసి, జేసీబీ యంత్రంతో గ్రావిల్‌ను తొలగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

## అక్షరాస్యత ప్రతి ఒక్కరి హక్కు : ప్రిన్సిపాల్ డా. శ్రీనివాసులు



ప్రజాభూమి, పులివెందుల

నిరక్షరాస్యత నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. శ్రీనివాసులు పిలుపుని చ్చారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా కళాశాలలో ఆయన అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ యూనిట్-1, యూనిట్-2 ఆధ్వర్యంలో విద్యార్థులతో అక్షరాస్యతపై ప్రతిజ్ఞ చేయించారు."అక్షరాస్యత ప్రతి ఒక్కరి హక్కు అని విశ్వసిస్తాను. చదువు విలువను ప్రతి ఒక్కరికీ తెలియజేస్తాను. నిరక్షరాస్యత నిర్మూలనకు నా వంతు కృషి చేస్తాను. పిల్లలు, పెద్దలు అందరూ చదువుకునేలా ప్రోత్సహిస్తాను. విద్య ద్వారా సమాజ అభివృద్ధికి తోడ్ప డతాను" అంటూ విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. యు. శ్రీనిత, శ్రీనివాసులురెడ్డి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేకనాపురంలో పోలీసుల ఫుట్ పెట్రోలింగ్

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఒంటిమిట్ట సీఐ వెంకటేశ్వర్లు**



ప్రజాభూమి, సిద్ధవటం:

జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఒంటిమిట్ట సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వ ర్యంలో సిద్ధవటం ఎస్ఐ హారిక, పోలీసు సిబ్బంది మంగళవారం రాత్రి నేకనాపురం గ్రామంలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించి గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో నేరుగా మాట్లాడిన పోలీసులు మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ కార్యకలాపాలు, అసాంఘిక శక్తుల కదలికలపై అవగాహన కల్పించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, వినాయక చవితి, గణేష్ నిమజ్జనం నేపథ్యంలో ప్రజలు సంయమనం పాటించి, ఎలాంటి వివా దాలు, ఘర్షణలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో వేడుకలు నిర్వహించుకోవాలని కోరా రు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో భాగంగా విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తూ ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తామని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

## మూడు ఆలయాల హుండీల్లో రూ.2.32 లక్షలు

**- ఏడు నెలల కాలానికి హుండీ ఆదాయం.. 10 గ్రాముల బంగారం, 187 గ్రాముల వెండి లభ్యం**



ప్రజాభూమి, వేంపల్లె


స్థానిక పట్టణంలోని శ్రీ వృషభాచలేశ్వరస్వామి దేవస్థానం, అనుబంధ ఆలయాలైన శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానాల్లోని శాశ్వత హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించామని దేవస్థానం కార్యనిర్వహణాధికారి కే. సుభాష్ తెలిపారు. కార్యనిర్వహణాధికారి ఎం. మారుతి ప్రసాద్ పర్యవేక్షణలో హుండీలను తెరిచి లెక్కించగా, ఏడు నెలల కాలానికి మూడు ఆలయాలకు కలిపి మొత్తం రూ.2,32,950 ఆదాయం లభించినట్లు తెలిపారు. శ్రీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం హుండీలో రూ.85,009, శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం హుండీలో రూ.33,594, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీలో రూ.1,14,347 నగదు లభించింది. అలాగే సుమారు 10 గ్రాముల బంగారం, 187 గ్రాముల వెండి వస్తువులు లభించినట్లు తెలిపారు. హుండీల లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ముఖ్య అర్చకులు పి. హరి ప్రవీణ్, ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు సునీల్, అద్దంకి రామయ్య, వరాలు, జ్యోతి, ఏపీజీబీ శాఖ సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఐటీఐ విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం

**- నైపుణ్య విద్యతో మెరుగైన ఉపాధి అవకాశాలు**

**- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డా ఎన్. తులసి రెడ్డి**

ప్రజాభూమి, వేంపల్లె



స్థానిక పట్టణంలోని స్వర్గీయ కందుల ఓబుల్‌రెడ్డి ఐటీఐ కళాశాలలో విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదాన కార్యక్రమం బుధవారం ప్రిన్సిపాల్ ప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి, కడప కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ విశ్వప్రసాద్, సీఐ నరసింహులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ నైపుణ్య విద్యతో విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఐటీఐ కోర్సు సామాన్య, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు వరం లాంటిదన్నారు. ఐటీఐ పూర్తిచేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఎలక్ట్రిషియన్, ప్లంబర్, ఏసీ మెకానిక్ తదితర రంగాల్లో స్వయం ఉపాధి పొందవచ్చన్నారు. వేంపల్లిలో అందరికీ అందుబాటులో ఐటీఐ కళాశాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఈ అవకాశాన్ని ప్రాంతీయ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, రవీంద్రనాథ్ రెడ్డి, ఐచర్ రమణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు అరెస్టు రాజకీయ చరిత్రలో బ్లాక్‌డే



**కొమర వెంకట నరసయ్య**

ప్రజాభూమి, ఒంటిమిట్ట:

మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు భారత రాజకీయ చరిత్రలో ఒక బ్లాక్‌డేగా మిగిలిపోయిందని టీడీపీ సీనియర్ నాయకుడు కొమర వెంకట నరసయ్య అన్నారు. బుధవారం ఒంటిమిట్టలోని తన నివాసంలో ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు అరెస్టుకు నిరసనగా దేశంలోని వందలాది నగరాలతో పాటు విదేశాల్లోని తెలుగు ప్రజలు స్వచ్ఛందంగా ఆందోళనలు చేపట్టారని తెలిపారు.

ఎఫ్ఐఆర్‌లో పేరు లేకపోయినా చంద్రబాబును అప్పటి డీఐజీ కొల్లి రఘురామిరెడ్డి పోలీసు మాన్యువల్, చట్ట నిబంధనలకు విరుద్ధంగా అరెస్టు చేశారని ఆరోపించారు. జగన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో అంగళ్లులో చంద్రబాబు బస్సు యాత్రపై జరిగిన రాళ్ల దాడిని టీడీపీ నేత మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తన అనుచరులతో సమర్థవంతంగా ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. చంద్రబాబుపై కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ఆయనను అరెస్టు చేసి 53 రోజులపాటు రాజమండ్రి సెంట్రల్ జైలులో నిర్బంధించారని నరసయ్య ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాల కారణంగానే గత ప్రభుత్వం ప్రజల తిరస్కరణకు గురైందని అన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

జనరల్

గురువారం, సెప్టెంబర్ 10, 2026






# నాడు జైలు...నేడు ముఖ్యమంత్రి ఇదే ప్రజల తీర్పు

మచిలీపట్నం ప్రజాభూమి ప్రతినిధి

తెలుగుదేశం పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని 09-09-2023న అప్పటి వైసీపీ ప్రభుత్వం అరెస్టు చేసి 53 రోజుల పాటు జైలులో నిర్బంధించిన ఘటనకు నేటితో మూడు సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా బందరు మండలం కానూరు పంచాయతీ కార్యాలయం వద్ద తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ మాట్లాడుతూ... చంద్రబాబు నాయుడిని 09-09-2023న అరెస్టు చేసి 53 రోజుల పాటు జైలులో ఉంచినా ఆయన ధైర్యంగా న్యాయపోరాటం చేశారని కొనియాడారు. ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా ప్రజల కోసం ఆయన చేసిన పోరాటాన్ని ప్రజలు మరచిపోలేదని పేర్కొన్నారు.చంద్రబాబును అరెస్టు చేసి జైలులో ఉంచినా చివరికి న్యాయమే గెలిచిందని గోపు సత్యనారాయణ అన్నారు. <

2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు కూటమికి 164 అసెంబ్లీ స్థానాల అఖండ విజయాన్ని అందించి, చంద్రబాబు నాయుడిని తిరిగి ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నారని తెలిపారు.నాడు 53 రోజులు జైలులో ఉన్న నాయకుడు... నేడు ప్రజల ఆశీర్వాదంతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని, ఇది ప్రజాస్వామ్య శక్తికి, ప్రజల తీర్పుకు నిదర్శనమని అన్నారు. అధికారం శాశ్వతం కాదని, ప్రజల తీర్పే అంతిమమని ఈ పరిణామం మరోసారి నిరూపించిందని పేర్కొన్నారు.53 కొవ్వొత్తులతో నిరసన, సంఘీభావంచంద్రబాబు నాయుడు జైలులో గడిపిన 53 రోజులకు గుర్తుగా నాయకులు, కార్యకర్తలు 53 కొవ్వొత్తులను వెలిగించి సంఘీభావం తెలిపారు. చంద్రబాబుపై తమకున్న అభిమానాన్ని, నాడు ఆయనకు జరిగిన అన్యాయంపై తమ నిరసనను ఈ సందర్భంగా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. "నాడు జైలు... నేడు ముఖ్యమంత్రి — ఇదే ప్రజల తీర్పు" అంటూ నాయకులు, కార్యకర్తలు చేసిన నినాదాలతో కానూరు పంచాయతీ కార్యాలయ ప్రాంగణం హోరెత్తింది.

# హైవేపై పందుల లోడే లక్ష్యం

**-11 మంది అరెస్ట్ -2 బొలెరో పికప్‌లు, 6 పిడిబాకులు, రూ.8.50 లక్షల నగదు స్వాధీనం -వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్**



ప్రజాభూమి, హిందూపురం టౌన్

జాతీయ రహదారిపై రవాణా అవుతున్న పందుల లోడును దారి కాచి దోచుకునేందుకు మారణాయుధాలతో సిద్ధమైన అంతరాష్ట్ర దొంగల ముఠాకు పోలీసులు చెక్ పెట్టారు. దోపిడీకి సిద్ధమైన 11 మందిని అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్ తెలిపారు. వారి నుంచి రెండు బొలెరో పికప్ వాహనాలు, ఆరు పిడిబాకులు, రూ.8.50 లక్షల నగదు, దాడులకు ఉపయోగించేందుకు సిద్ధంగా ఉంచిన రాళ్లు, 20 ఖాళీ కూల్‌డ్రింక్ సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. హిందూపురం పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ నిందితుల అరెస్టు, నేర చరిత్రకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. హిందూపురం పట్టణంలోని సింగిరెడ్డిపల్లి శివారులో శిరా–కొడిగెనహళ్లి ఎన్ హెచ్-544 రహదారి వద్ద కొంతమంది వ్యక్తులు అనుమానాస్పదంగా మారణాయుధాలతో సంచరిస్తున్నట్లు సెప్టెంబర్ 9న ఉదయం పోలీసులకు సమాచారం అందిందని ఎస్పీ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు హిందూపురం అడిషనల్ ఎస్పీ కె.వి. మహేష్ పర్యవేక్షణలో హిందూపురం వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పోలీసులు సమన్వయంతో సంఘటనా స్థలానికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. పోలీసుల విచారణలో నిందితులు హైవేపై రవాణా అవుతున్న పందుల లోడును దారి కాచి పందులను దొంగిలించేందుకు పథకం వేసినట్లు వెల్లడైందని ఎస్పీ తెలిపారు. వాహనాలను అడ్డుకునే వారిపై దాడి చేసేందుకు రాళ్లు, ఖాళీ కూల్‌డ్రింక్ సీసాలను వాహనాల్లో సిద్ధంగా ఉంచుకున్నట్లు చెప్పారు. నిందితుల నుంచి రెండు బొలెరో పికప్ వాహనాలు, ఆరు పిడిబాకులు, రూ.8,50,000 నగదు, రాళ్లు, 20 ఖాళీ కూల్‌డ్రింక్ సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అరెస్టయిన వారిలో ఎరుకల చంద్రశేఖర్ (30), సాకే రాజేష్ (28), ఎరికల రమేష్ (35), వెంకటేష్ @ బొంగలి (23), బెస్త రాకేష్ @ రాఖి (26), సాకే మహేష్ (26), ఎరికల గంగన్న (20), నడిమిండ్లు లక్ష్మణ్ (22), ఎరికల సునీల్ @ కాకోడు (22), జె. రోహిత్ @ పిల్లి (23), వెంకటేష్ @ చెవులోడు (19) ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితులకు గతం లోనూ నేర చరిత్ర ఉన్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధి లోని పలు పోలీస్‌స్టేషన్లలో నమోదైన దొంగతనాలు, పోలీసులపై దాడులు, హత్యాయత్నం తదితర కేసుల్లో వీరి ప్రమేయం ఉన్నట్లు తెలిపారు. ఆగస్టు 7న హిందూపురం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన క్రైం నంబర్ 120/2026, ఆగస్టు 28న పరిగి పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన క్రైం నంబర్ 64/2026 కేసుల్లో పోలీసులను అడ్డుకుని రాళ్లు, సీసాలతో దాడి చేసినట్లు నిందితులు విచారణలో వెల్లడించినట్లు చెప్పారు. ఆగస్టు 27న రాత్రి హిందూపురం టౌన్ దండు రోడ్డులోని ఎరికల నాగభూషణం ఇంటి వద్ద 10 పందులను దొంగిలించిన కేసులోనూ వీరి ప్రమేయం ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. గతంలో డోన్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని డోన్–గుత్తి రహదారిలో పెట్రోల్ బంక్ వద్ద దొంగతనానికి ప్రయత్నిస్తూ పట్టుకునేందుకు వచ్చిన పోలీసులపై దాడి చేసిన ఘటనలోనూ వీరి ప్రమేయం ఉన్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. హిందూపురం వన్‌టౌన్, ఉరవకొండ, తాడిపత్రి టౌన్, తాడిపత్రి రూరల్, గుంతకల్లు రూరల్, కసాపురం, ఎల్లనూరు, కళ్యాణదుర్గం అర్బన్, డోన్ రూరల్, అమరాపురం, నల్లమాడ, బుక్కరాయసముద్రం తదితర పోలీస్‌స్టేషన్ల పరిధిలో నిందితులపై దొంగతనాలు, పోలీసులపై దాడులు, ఇతర హింసాత్మక నేరాలకు సంబంధించిన పలు కేసులు నమోదై ఉన్నట్లు ఎస్పీ వివరించారు. అరెస్టయిన 11 మంది నిందితులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం జ్యుడిషియల్ కస్టడీకి తరలించినట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన హిందూపురం వన్‌టౌన్ సీఐ జె. ప్రసాద్‌బాబు, రూరల్ అప్‌గ్రేడ్ సీఐ సి. ఆంజనేయులు, జనార్ధన్, టూటౌన్ సీఐ అబ్దుల్ కరీం, వన్‌టౌన్ ఎస్ఐ ఎం. రాజేష్, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించారు.



# మంగినపూడి బీచ్‌లో మహాగణపతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

**భక్తుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**

**14 రోజుల పాటు నిరంతర విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, రవాణా సౌకర్యాలు కల్పించాలి**

**ప్రతిరోజూ ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులను ఆకట్టుకోవాలి**

**అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డీకే బాలాజి**




ప్రజాభూమి ప్రతినిధి,మచిలీపట్నం:

మంగినపూడి బీచ్ సాగర తీరంలో 63 అడుగుల ఎత్తైన మహాగణపతి మట్టి విగ్రహం ఏర్పాటు చేసి 14 రోజుల పాటు నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని తన క్యాంపు కార్యాలయం నుంచి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్, ఉత్సవాల నిర్వహణకు సంబంధించి శాఖల వారీగా చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించి, పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 63 అడుగుల ఎత్తైన మహాగణపతి దర్శనానికి 14 రోజుల పాటు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులే కుండా ప్రతి శాఖ తమకు అప్పగించిన బాధ్య తలను ముందస్తు ప్రణాళికతో పూర్తి చేయా లని సూచించారు.ఉత్సవాలకు వచ్చే భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ఏర్పాటు చేసి, జనసమూహాన్ని సమర్థ వంతంగా నియంత్రించాలని పోలీసు శాఖను ఆదేశించారు. పార్కింగ్ ప్రాంతాలను ముందుగానే గుర్తించి, వాహనాల రాకపోకలకు ఇబ్బందు లు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. గతంలో బీచ్ ఫెస్టివల్ సందర్భంగా ఎదురైన ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని మచిలీపట్నం–మంగినపూడి ప్రధాన మార్గానికి ప్రత్యామ్నాయంగా గుర్తించిన రహదారిని అభివృద్ధి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఆ మార్గంలో అవసరమైన జంగిల్ క్లియరెన్స్, రహదారి బలోపేతం తదితర పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశిం చారు. మంగినపూడి సాగర తీరంలో భక్తులు సముద్రంలోకి వెళ్లకుండా ప్రత్యేక బారికేడింగ్ ఏర్పాటు చేయా లని కలెక్టర్ సూచిం చారు. మత్స్య శాఖ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన గజఈతగాళ్లను అందుబాటులో ఉంచడంతో పాటు లైఫ్ బాయ్స్, లైఫ్ జాకెట్లు, రక్షణ పరికరాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఉత్సవ ప్రాంగణంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన విద్యుత్ లైన్లు, కండక్టర్లను ముందుగానే మార్చి, ఉత్సవాల సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉత్సవాలకు భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. మున్సిపల్, పంచాయతీ సిబ్బంది సమన్వ యంతో రహదారులు, పార్కింగ్ ప్రాం తా లు, బీచ్ పరిసరాల్లో నిరంతరం పారిశుద్ధ్య పనులు నిర్వహించాలన్నారు.అవసరమైన చోట్ల తగిన సంఖ్యలో డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసి, వాటిని ఎప్పటికప్పుడు ఖాళీ చేయాలని సూచించారు. ఉత్సవాల ప్రారంభం నుంచి నిమజ్జనం పూర్త య్యే వరకు పారిశుద్ధ్య సిబ్బందిని అందుబా టులో ఉంచాలని ఆదేశించారు.భక్తుల కోసం తాగునీరు, మొబైల్/తాత్కాలిక మరుగుదొడ్లను తగిన సంఖ్యలో ఏర్పాటు చేసి, వాటి నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఉత్సవ ప్రాంగణంలో అగ్నిప్రమాదాలకు అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని అగ్నిమాపక శాఖను కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచడంతో పాటు కీలక ప్రాంతాల్లో ఫైర్ ఎక్స్టింగ్విషర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. 14 రోజుల పాటు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే నేపథ్యంలో అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు.14 రోజుల పాటు ప్రతిరోజూ సాయంత్రం భక్తులను ఆకట్టుకునేలా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. స్థానిక కళాబృందాలు, డ్యాన్స్ గ్రూపులు, డ్యాన్స్ స్కూల్స్, నాటక బృందాలు, కళాజాత, కూచిపూడి కళాకారులు తదితరులను భాగస్వామ్యం చేయాలని సూచించారు.మచిలీపట్నం నుంచి మంగినపూడి బీచ్‌కు భక్తుల రాకపోకలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రతి అరగంటకు బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని, భక్తుల రద్దీని బట్టి సంఖ్యను పెంచాలని సూచించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్పీ వి వి నాయుడు, బందరు ఆర్డీఓ కే సాంబశివరావు, కార్యక్రమ నోడల్ అధికారి డిఆర్డిఏ పీడీ హరిహరినాథ్, జెడ్పి సీఈవో డాక్టర్ జే అరుణ, డిపిఓ ఎం ధనలక్ష్మి, మచిలీపట్నం నగర మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ దయాకర్, ఆర్ అండ్ బి ఈఈ లోకేశ్వరావు, డ్వామా పీడీ ఎన్ శివప్రసాద్ యాదవ్, మెప్మా పీడీ సాయిబాబు, అగ్నిమాపక, మత్స శాఖాధికారులు ఏసురత్నం, అయ్యా నాగరాజా, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సోమశేఖర్, పర్యాటక శాఖ అధికారి జి రామలక్ష్మణరావు, దేవాదాయ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అంధకారంలో గ్రామాలు

**నెలలు తరబడి శివరామపురంలో వెలగని వీధి దీపాలు**

**ఏమి పట్టనట్టు వ్యవహరిస్తున్న ప్రత్యేక అధికారులు**



ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ

అధికార, బాధ్యతలు నిర్వర్తించాల్సిన అధికారులే పంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా ఉంటే గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తాయి అని ఊహించగా... దానికి విరుద్ధంగా నేడు మాత్రం అధికారుల పాలన గాడి తప్పుతోంది అని ప్రజలు పెదవి విరుస్తున్నారు. గ్రామాలలో కనీస మౌలిక వసతులలో ఒకటైన వీధి దీపాలు కూడా నెలల తరబడి వెలగనీ పరిస్థితి నెలకొంది. మోపిదేవి మండ లంలో మేజర్ పంచాయతీ గా ఉన్న పెదప్రోలు గ్రామంలో వీధి దీపాలు వెలిగించే నాథుడే కరువ య్యాడు అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ శివారు శివరామపురంలో వీధి దీపాలు వెలగక అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లిన ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు .రాత్రి సమయాలలో రహదారిపై రావాలంటేనే ప్రజలు ప్రాణాలు అరిచేతుల్లో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం పొలాల్లో వరి పంటలు సాగు చేస్తుండటంతో రహదారులపై విషసర్పాలు సంచా రముతో ప్రజలు తీవ్ర ఆందోళన లోనవుతున్నారు. ఇప్పటికైనా ప్రత్యేక అధికారులు దృష్టి సారించి గ్రామాల్లో పరిపాలన గాడిలో పెట్టి కనీసం వీధి దీపాలైన వెలిగించేలా చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

# కొత్త బైక్ ఇచ్చి.. నష్టపరిహారం చెల్లించాలి

## కృష్ణా జిల్లా వినియోగదారుల కమిషన్ తీర్పు...

మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి



తయారీలో లోపం ఉన్న "టీవీఎస్ జూపిటర్ 125" వాహనాన్ని తీసుకొని వినియోగదారురాలికి కొత్త వాహనం తిరిగి ఇవ్వాలని లేదా బైకు ఖరీదు 1,15,500రూపాయలు 9% వడ్డీతో తిరిగి చెల్లించాలని, మానసిక ఒత్తిడి కలగజేసినందుకు 25 వేల రూపాయలు లీగల్ ఖర్చులు కింద పదివేల రూపాయలు చెల్లించాలని మచిలీపట్నం టీవీఎస్ డీలర్,విజయవాడ టీవీఎస్ డీలర్, కాసా మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారిని ఆదేశిస్తూ కృష్ణాజిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షులు సిహెచ్. కిషోర్ కుమార్ సభ్యురాలు రాయల శ్రీలక్ష్మి బుధవారం తీర్పు చెప్పారు.. 30 రోజులలోపు తీర్పు అమలు చేయాలని కమిషన్ ఆదేశించింది.

విజయం సాధించిన వినియోగదారురాలు తరపున న్యాయవాది లంకిశెట్టి బాలాజీ ఫిర్యాదు వివరాలను వివరించారు. కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్ గా పనిచేస్తున్న లక్ష్మణ్ కుమార్ భార్య బొమ్మిశెట్టి వెంకట నాగ దీప్తి మచిలీపట్నంలో లెక్చరర్ గా పనిచేస్తున్నారు . 2024 జులై ఒకటో తారీఖున నాగ దీప్తి మచిలీపట్నం జిల్లా పరిషత్ ఎదురుగా గల టీవీఎస్ డీలర్ కసా మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ వద్ద 1,15,500 చెల్లించి టీవీఎస్ జూపిటర్ 125 కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన తేదీ నుండి వాహనంలో తయారీలోపం వలన పలు ఇబ్బందులకు గురిచేసింది. ఏడుసార్లు సర్వీసింగ్ చేయించిన సర్వీసు డబ్బులు తీసుకున్నారు గాని బండిలోని లోపాన్ని సరిచేలేకపోయారు. వినియోగదారురాలు దీప్తి ఆమె భర్త లక్ష్మణ కుమార్ అనేక పర్యాయములు మచిలీపట్నం మరియు విజయవాడలోని కాసా మోటార్స్ వారిని సంప్రదించిన ఫలితం లేకపోయింది.

విసిగివేసారిన వినియోగదారులు న్యాయం కోసం కృష్ణా జిల్లా వినియోగదారుల కమిషన్ లో 2025 జూన్ 30వ తారీఖున ఫిర్యాదు దాఖలు చేసింది. వినియోగదారుల కమిషన్ ఇరుపక్షాల వాద ప్రతివాదంలో విన్న పిదప, వాహనాన్ని శిక్షణ పొందిన మెకానిక్ తో పరీక్ష చేయించి వాహనం తయారీలో లోపం ఉన్న విషయాన్ని నిర్ధారించారు. టీవీఎస్ వాహనంలో తయారీలో ఉందని వినియోగదారులకు ఇబ్బంది కలగజేసినట్లుగా నిర్ధారిస్తూ కమిషన్ బుధవారం తీర్పు చెప్పింది.

తీర్పు ప్రకారం 30 రోజుల్లోపు కొత్త వాహనం గాని లేదా వాహన ఖరీదును 9 శాతం వడ్డీతో తిరిగి చెల్లించాలని 25 వేల రూపాయలు మానసిక ఒత్తిడికి గురి చేసినందుకు పదివేల రూపాయలు కోర్టు ఖర్చులు కింద చెల్లించాలని తీర్పు చెప్పారు. వినియోగదారురాలు తరుపున లంకిశెట్టి బాలాజీ, లంకి శెట్టి సాయి ఫణి సంతోష్, చిన్నంశెట్టి ఆశా నాగ మౌనిక,మద్దాల సువర్ణ రాజు న్యాయవాదులుగా వ్యవహరించారు.

# హిందూపురం అభివృద్ధికి భారీ బాటలు

**-రూ.136 కోట్లతో ఇంటింటికీ తాగునీటి సరఫరా**

**-రూ.108 కోట్లతో ఎస్‌టీపీ.. రూ.107.50 కోట్లతో మౌలిక వసతుల అభివృద్ధి**

**-ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా మాట్లాడిన ఎమ్మెల్యే బాలకృష్ణ**

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం అభివృద్ధికి భారీ బాటలు వేస్తున్నామని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. పట్టణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులు సమీకరించేందుకు నిరంతరం కృషి చేసిన ఫలితంగానే పట్టణంలో వందల కోట్ల రూపాయలతో పనులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. హిందూపురం పట్టణంలోని కోట ప్రాంతంలో తాగునీటి సరఫరాకు సంబంధించిన పైలాన్ ఆవిష్కరణతో పాటు పలు అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వ హించారు. ఎమ్మెల్యే బాలకృష్ణ ఆరోగ్య కారణాలతో కార్యక్రమానికి ప్రత్యక్షంగా హాజరు కాలేకపోయారు. ఆయన సతీమణి నందమూరి వసుంధరా దేవి ముఖ్య అతిథిగా హాజరై అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. పట్టణంలోని ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా రూ.136 కోట్లతో సమగ్ర నీటి సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నట్లు బాలకృష్ణ తెలిపారు. భవిష్యత్‌లో పట్టణ జనాభా, నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడకుండా శాశ్వత పరిష్కారం చూపేందుకు ఈ పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. అమృత్ 2.0 కార్యక్రమం కింద రూ.108 కోట్లతో కొట్నూరు చెరువు వద్ద సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. పట్టణం నుంచి వెలువడే మురుగునీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగించుకునే విధంగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. మురుగునీటి శుద్ధి వ్యవస్థ అందుబాటులోకి రావడంతో పట్టణ పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణకు మరింత ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి ఎస్డీఎఫ్ నిధుల ద్వారా రూ.107.50 కోట్లను కేటాయించి రోడ్లు, డ్రైనేజీలు, సెంటర్ లైటింగ్ తదితర పనులు చేపడుతున్నట్లు బాలకృష్ణ వెల్లడించారు. ప్రజల రోజువారీ అవసరాలకు సంబంధించిన మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు పట్టణాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. హిందూపురం అభివృద్ధి ఒక్క రోజులో సాధ్యమయ్యేది కాదని, ఇందుకోసం ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో నిరంతర కృషి అవసరమని బాలకృష్ణ అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. పట్టణానికి అవసరమైన మరిన్ని నిధులు తీసుకురావడంతో పాటు చేపట్టిన పనులను నాణ్యతతో, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య, డాక్టర్ సురేంద్ర, బాలాజీ, మాజీ మున్సిపల్ చైర్మన్లు రావిళ్ల లక్ష్మి, అనిల్‌కుమార్, రమేష్‌కుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షులు వెంకటేష్, చంద్రమోహన్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ఎంఈ గంగాధర్, ఇతర అధికారులు, పార్టీ నాయకులు, బాలకృష్ణ అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# కిడ్నీ బాధితులకు ఓ వరం డయాలసిస్ కేంద్రం

**-జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్ర పరిశీలనలో వసుంధర దేవి**

ప్రజాభూమి, హిందూపురం టౌన్



కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న వారికి హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులోకి వచ్చిన డయాలసిస్ కేంద్రం ఎంతో ఉపయోగకరంగా మారిందని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర దేవి పేర్కొన్నారు. బుధవారం హిందూపురం పట్టణంలో పర్యటించిన ఆమె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించారు. డయాలసిస్ చేయించుకుంటున్న రోగులను వసుంధర దేవి పలకరించి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, డయాలసిస్ కేంద్రంలో ఉన్న సౌకర్యాల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయనే విషయంపై కూడా ఆరా తీశారు. డయాలసిస్ కేంద్రంలో రోగులకు నిరంతరం సేవలు అందిస్తున్న వైద్యులు, సాంకేతిక సిబ్బందిని ఆమె అభినందించారు. గతంలో కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న హిందూపురం ప్రాంత ప్రజలు డయాలసిస్ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, దీంతో సమయం, డబ్బు ఖర్చుతో పాటు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారని వసుంధర దేవి తెలిపారు. బాధితుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయించడం జరిగిందన్నారు. స్థానికంగానే డయాలసిస్ సేవలు అందుబాటులోకి రావడంతో కిడ్నీ బాధితులకు ప్రయాణ భారం తగ్గడంతో పాటు వైద్య సేవలు సులభంగా పొందే అవకాశం ఏర్పడిందన్నారు. హిందూపురం నియోజకవర్గ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్నదే ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆకాంక్ష అని వసుంధర దేవి పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన వైద్య సేవలు స్థానికంగానే అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని తెలిపారు.


Printed by MOHANEESWAR PUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at West Godavari and published at D. No.11-12-124, Nawabpetcolony,3rd Division, Eluru editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1219.cell:9502116677